
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 261
సోమవారం 12-12-2022


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



భారత అమ్మాయిలే 'సూపర్'
ఆసీస్‌తో జరిగిన రెండో టి20లో సూపర్ ఓవర్‌లో నెగ్గిన టీమిండియా - 12లో



ఏ 'సిప్'లో ఏముంది?
స్టాక్ సిప్, ఫండ్స్ సిప్ టూల్ ఒక్కటే అయినా ఫలితాల్లో వైరుధ్యాలు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇంగ్లండ్ ఇంటికి... ఫ్రాన్స్ సెమీస్‌కి
ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ ఏడోసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 2-1 గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది.
వివరాలు 12లో ▸



షార్ట్‌కట్ పాలిటిక్స్ పని చేయవు
భారత్‌లో సుస్థిరాభివృద్ధి జరగాలని.. మన దేశానికి షార్ట్ కట్ పాలిటిక్స్ అవసరం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



హిమాచల్ సీఎంగా సుఖు
హిమాచల్‌ప్రదేశ్ 15వ ముఖ్యమంత్రిగా సుఖ్వందర్ సింగ్ సుఖుతో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ప్రమాణం చేయించారు.
వివరాలు 6లో ▸



జమ్మూకశ్మీర్‌లో 'ఫ్యామిలీ ఐడీ'
జమ్మూకశ్మీర్‌లో అన్ని కుటుంబాల సమగ్ర వివరాలతో కూడిన డేటా బేస్ సిద్ధం చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

సౌత్ గ్రూప్‌తో సంబంధమేంటి?



ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన కేసులో టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సీబీఐ అధికారులు సుమారు ఏడున్నర గంటల పాటు ప్రశ్నించారు. 'నిందితులను ఎప్పుడైనా కలిశారా, వారితో ఫోన్ సంభాషణలు జరిగాయా.. ఢిల్లీలో సమావేశమయ్యారా.. ఫోన్లు ఎందుకు మార్చాల్సి వచ్చింది..' అని ప్రశ్నించినట్లు తెలిసింది.
వివరాలు 10 ▸

స్వచ్ఛంద సేవకులపై అంత విద్వేషమా?



తెలుగుదేశం పార్టీ నాయకుల ఇళ్లకు కూడా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై 'ఈనాడు' అమానుష రాతలు రాయడం దుర్మార్గమని రామోజీరావుపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మండిపడ్డారు. వలంటీర్లు సేవాభావంతో పనిచేస్తున్నారని.. వారికి గౌరవ పారితోషకమే ఇస్తున్నామని చెప్పారు.
వివరాలు 10 ▸

విజయనగరం జిల్లాలో క్యాన్సర్ ఆస్పత్రి



విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ప్రాంగణంలో వంద పడకల క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు శంకుస్థాపన చేశారు. గురుదేవ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.
వివరాలు 14 ▸

సామాన్యుడి చేతిలో స్పందనాస్త్రం

లక్షలాది సమస్యలకు పరిష్కార వేదిక 'స్పందన'

- ప్రతి ఫిర్యాదుపైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- బాధితులకు సత్వరం న్యాయం చేయడమే లక్ష్యం
- సచివాలయాలు, టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా నివేదించే అవకాశం
- ప్రతి ఫిర్యాదుకూ వైఎస్సార్ (యువర్ స్పందన రిక్వెస్ట్) నంబర్
- పరిష్కారంపై సంతృప్తి చెందకుంటే మరోసారి క్షుణ్ణంగా పరిశీలన



విజయవాడలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు (ఫైల్)

ఏపీ నెట్‌వర్క్

దాదాపు రూ.45 కోట్ల విలువ చేసే ఖరీదైన భూమిని అనంతపురంలో నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ సైతం చేసిన వ్యవహారానికి 'స్పందన' కార్యక్రమం ద్వారా అడ్డుకట్ట పడింది! అధిక వడ్డీల ఎరతో 40 మంది ఉద్యోగుల నుంచి రూ.25 కోట్లు వసూలు చేసిన ఓ మహిళ బెదిరింపులకు 'స్పందన' సత్వరమే తెర దించింది. అధిక ఫీజులు వసూలు చేసి తల్లిదండ్రులను, తిండి పెట్టకుండా చదువుల పేరుతో పిల్లలను కాల్చుకు తింటున్న కార్పొరేట్ కాలేజీల దురాగతాల బారి నుంచి 'స్పందన' భరోసా కల్పిస్తోంది. ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమం అనూహ్య ఫలితాలనిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు అక్రమాలకు అడ్డుకట్ట వేస్తోంది. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందకపోవడం, ఎవరికైనా అన్యాయం జరిగిన సందర్భాల్లో ఫిర్యాదుచేస్తే చాలు విచారించి నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాలు, సచివాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమం బాధితులకు కొండంత భరోసానిస్తోంది. స్పందన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు మార్గాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి డిజిటల్ అసిస్టెంట్ సహకారంతో స్పందన పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు. దీంతోపాటు ఏడాది పొడవునా ఏ సమయంలోనైనా వివిధ అంశాలపై ఫిర్యాదులను స్వీకరించేందుకు

మిగతా 2వ పేజీలో ▶

తెరిపిన పడ్డ సీమ

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు తగ్గుముఖం
ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం

- లోతట్టు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు
- పునరావాస కేంద్రాల్లో ఉన్న మెరుగైన భోజనం, వసతి
- శిబిరాల్లో ఉన్న కుటుంబానికి రూ.2 వేల చొప్పున తక్షణ సాయం
- సేవలందిస్తున్న ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- నష్టం అంచనాకు ఉపక్రమించిన అధికార గణం
- మరో రెండు రోజులు తేలికపాటి వర్షాలు



అన్నమయ్య జిల్లా బాలపల్లి వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

సాక్షి, అమరావతి: కుండపోత, భారీ వర్షాల నుంచి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు తేరుకుంటున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు తగ్గుముఖం పట్టాయి. వర్ష ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం ముందస్తు సహాయక చర్యలు చేపట్టడంతో భారీ నష్టాన్ని నివారించింది. వర్ష ప్రభావిత ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరాలకు తరలించారు. అధికారులతోపాటు నాలుగు ఎస్డీఆర్ఎఫ్, ఐదు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా సేవలందిస్తున్నాయి. వర్షాల వల్ల శిబిరాల్లో తల దాచుకున్న ఆరు జిల్లాలకు చెందిన వారికి తక్షణ సాయంగా రూ.1000, గరిష్ఠంగా కుటుంబానికి రూ.2 వేల చొప్పున అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి మంచి భోజన, వసతి ఏర్పాటు చేశారు. కాగా, శనివారం కూడా పలు ప్రాంతాల్లో

మిగతా 2వ పేజీలో ▶

15న మరో అల్పపీడనం 2లో

రైతు భరోసా కేంద్రాలు.. గొప్ప ఇన్నోవేషన్

- సీఎం జగన్ దూరదృష్టికి నిదర్శనం: బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్
- కియోస్క్‌ల ద్వారా ఇన్‌పుట్స్ బుకింగ్ వినూత్న ఆలోచన
- మూగ జీవాలకు అంబులెన్స్ సేవలు బాగున్నాయి
- గ్రామ స్థాయిలోనే పంటల కొనుగోళ్లు ఎక్కడా చూడలేదు
- అగ్రి ల్యాబ్‌ల సేవలు ఆదర్శప్రాయం



కృష్ణాజిల్లా నందిగామలోని అగ్రి ల్యాబ్‌లో పరీక్ష చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్

సాక్షి, అమరావతి/కంచికచర్ల(నందిగామ): ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ముఖ్యమంత్రి జగన్ దూరదృష్టికి నిదర్శనమని, రాష్ట్ర ప్రభుత్వ పనితీరు అద్భుతంగా ఉందని బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ (ఏపీ, తెలంగాణ) గారెత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. తమ దేశంలోనూ ఇలాంటివి ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. 'ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలను చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. నిజంగా ప్రపంచ శ్రేణి ఇన్నోవేషన్ ఇది. ఇన్‌పుట్స్ బుకింగ్ కోసం కియోస్క్‌లు, నాలెడ్జ్ హబ్‌లు, పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలుగా వాటిని తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది. ఆర్బీకేలకు అనుబంధంగా ఏర్పాటైన కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, మూగజీవాల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన అంబులెన్స్‌లు, నాణ్యతకు పెద్దపీట వేస్తూ నియోజకవర్గ స్థాయిలో నెలకొల్పిన అగ్రి ల్యాబ్‌లు నిజంగా అద్భుతం' అని బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల ఆర్బీకేతో పాటు నందిగామలోని వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను స్వయంగా సందర్శించి

మిగతా 2వ పేజీలో ▶

నాలుగేళ్లు చదివితేనే ఆనర్స్ డిగ్రీ

కొత్త కరిక్యులం ఫ్రేమ్ వర్క్‌లో స్పష్టం చేసిన యూజీసీ

- మూడేళ్లపాటు చదివితే బ్యాచిలర్ డిగ్రీ
- రెండేళ్లు చదివితే డిప్లొమా
- ఏడాది చదివితే సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసినట్టు
- ఆనర్స్ కోర్సుల్లో రీసెర్చ్ ప్రాజెక్టు కూడా.. నేడు నోటిఫై కానున్న కొత్త కరిక్యులం



సాక్షి, అమరావతి: అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఇకపై కొత్త కరిక్యులం ఫ్రేమ్ వర్క్‌ను అనుసరించి డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. నూతన జాతీయ విద్యా విధానం-2020లో పేర్కొన్న ప్రకారం.. బహుళ ప్రవేశ, నిష్క్రమణలతో ఆనర్స్ డిగ్రీ కోర్సులు అమలు కానున్నాయి. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్త కరిక్యులం ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించిన సంగతి తెలిసిందే. దీని విధివిధానాలను యూజీసీ సోమవారం నోటిఫై చేయనుంది.

160 క్రెడిట్లను పూర్తి చేస్తేనే..

యూజీసీ కొత్త కరిక్యులం ఫ్రేమ్ వర్క్ నిబంధనల ప్రకారం.. విద్యార్థులు నాలుగేళ్లు పూర్తి చేశాకే యూజీ ఆనర్స్ డిగ్రీని

మిగతా 14వ పేజీలో ▶

విద్యార్థుల ఇంటికే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు

- దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు
- పూర్తి ఉచితంగానే సర్టిఫికెట్ల పంపిణీ
- అర్హత, సామాజిక పరిస్థితి ఆధారంగా జారీ
- టెన్త్, ఇంటర్ విద్యార్థుల జాబితా వీఆర్వోల యాప్‌కు అనుసంధానం


3లో



కరోనా వేళా ఏపీలో 'వృద్ధి'

- తమిళనాడు, పశ్చిమ బెంగాల్ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు మైనస్‌లో..
- రాష్ట్రాల వారీగా కోవిడ్ కాలంలో జీడీపీ నమోదు వివరాలను వెల్లడించిన కేంద్రం
- సంక్షేమ పథకాల అమలుతోనే ఏపీలో 0.08 వృద్ధి రేటు నమోదు
- కానీ, మిగిలిన రెండూ ఆ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలే
- కరోనా తర్వాత ఏడాదిలోనూ జీఎస్‌డీపీ వృద్ధి రేటులో ఏపీ దేశంలోనే టాప్

2లో



పోర్టు ఆధారిత విదేశీ పెట్టుబడులే లక్ష్యం

విశాఖ సదస్సు సందర్భంగా ప్రణాళిక సిద్ధం చేసిన ఏపీ మారిటైమ్ బోర్డు

- వివరాలు 2లో

హైకోర్టుల్లో ఇంకెన్నాళ్లీ ఖాళీలు?

హైకోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీల భర్తీ విషయంలో కేంద్ర ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ కాల పరిమితికి కట్టుబడకపోవడం దురదృష్టకరమని పార్లమెంటు కమిటీ ఆవేదన వెలిబుచ్చింది. ఖాళీల భర్తీకి నిర్దిష్ట కాలవ్యవధిని సూచించలేమన్న కేంద్ర న్యాయ శాఖ వ్యాఖ్యలతో తాము ఏకీభవించడం లేదని స్పష్టం చేసింది.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

మాతా, శిశు మరణాల కట్టడికి సర్కారు ప్రణాళిక

ప్రసవానికి ముందే ఏరియా, జిల్లా, బోధనాస్పత్రులకు తరలింపు
రవాణా చార్జీలు భరించనున్న ప్రభుత్వం
ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేకంగా యాప్ రూపకల్పన
రాష్ట్రంలో సగటున నెలకు 5 వేల హైరిస్క్ గర్భిణుల ప్రసవాలు



సాక్షి, అమరావతి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, మెరుగైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తొలి నుంచీ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రసవం సమయంలో మాతా, శిశు మరణాలకు హైరిస్క్ ప్రెగ్నెన్సీయే ప్రధాన కారణమవుతోంది. ఈ క్రమంలో మాతా, శిశు మరణాల కట్టడికి ఇప్పటికే వివిధ చర్యలు చేపడుతున్న సీఎం జగన్ ప్రభుత్వం మరో కీలక ప్రక్రియకు శ్రీకారం చుడుతోంది. హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి మూడు, నాలుగు రోజుల ముందే ఏరియా, జిల్లా, బోధనాస్పత్రులకు తరలించడం ద్వారా వారికి మెరుగైన ఆరోగ్య రక్షణ కల్పించాలని నిర్ణయించింది. హైరిస్క్ గర్భిణులను పెద్దాస్పత్రులకు తరలింపునకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించనుంది. ఇప్పటికే పురిటి నొప్పులతో

మిగతా 2వ పేజీలో ▶

అందుబాటులోకి కాల్ సెంటర్

మరోవైపు గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై వాకబు చేయడం కోసం వైద్య శాఖ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ సేవలు ప్రారంభమయ్యాయి. రెండు షిఫ్టుల్లో 80 మంది సిబ్బంది కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్నారు. రాత్రివేళల్లో అత్యవసర సేవల కోసం కొందరు సిబ్బంది కాల్‌సెంటర్‌లో ఉంటున్నారు. గర్భిణులు, బాలింతలకు ఏఎన్‌సీ, పీఎన్‌సీ, ఇతర వైద్యసేవల కల్పన, చిన్నారులకు ఇమ్యునైజేషన్ వంటి ఇతర అంశాలను కాల్‌సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తారు. రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హైరిస్క్ గర్భిణులపై కాల్ సెంటర్ ద్వారా ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

క్లుప్తంగా...

సత్వర నిర్ధారణతోనే క్యాన్సర్‌ను నివారించగలం

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- డాక్టర్ పళనివేల్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్. చిత్రంలో డాక్టర్ పళనివేల్ తదితరులు

సాక్షి, అమరావతి/లబ్బీపేట(విజయవాడ తూర్పు): సత్వర నిర్ధారణతోనే క్యాన్సర్ నివారణ సాధ్యమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు అందరూ ఆరోగ్యవంతమైన జీవన శైలిని పాటించాలని ఆయన సూచించారు. అసోసియేషన్ ఆఫ్ మినిమల్ యాక్సెస్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఆదివారం విజయవాడలో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డా.పళనివేల్ రచించిన 'మినిమల్లీ ఇన్వాసివ్ క్యాన్సర్ సర్జరీ' అనే పుస్తకాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆవిష్కరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలో పరిశోధనలు నిర్వహించేందుకు జెమ్ ఫౌండేషన్ స్థాపించిన డా.పళనివేల్‌ను అభినందించారు. ఆయన తన పరిశోధనల ద్వారా తక్కువ ఖర్చుతో క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకురావడం దేశానికే గర్వకారణమన్నారు. క్యాన్సర్ చికిత్స విధానంలో మరిన్ని పరిశోధనలు చేయాలని సూచించారు. డాక్టర్ పళనివేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. తమ ఆస్పత్రిలో కూడా ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత సేవలందిస్తున్నామని చెప్పారు. సదస్సులో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, డా.వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయం వీసీ పి.శ్యామ్‌ప్రసాద్, డా.వార్గేశ్, డా.రహమాన్, డా.బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, డా.పట్టాభిరామయ్య, డా.రమణ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆధారిత విదేశీ పెట్టుబడులే లక్ష్యం

విశాఖ సదస్సు సందర్భంగా ప్రణాళిక సిద్ధం చేసిన ఏపీ మారిటైమ్ బోర్డు



సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం వీటి ఆధారంగా పరిశ్రమలను తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. వచ్చే ఏడాది విశాఖ వేదికగా జరిగే అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సులో పోర్టు ఆధారిత విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఏపీ మారిటైమ్ బోర్డు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ సదస్సులో పరిశ్రమలు, ఇంధన రంగం తర్వాత పోర్టు ఆధారిత రంగంలో పెట్టుబడులు అధికంగా వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్గో టెర్మినల్స్, లాజిస్టిక్స్ పార్క్, ఐసీడీ, వేర్ హౌసింగ్ తదితరాల్లో పెట్టుబడులు పెట్టేందుకున్న అవకాశాల గురించి అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలని భావిస్తున్నారు. యూఏఈ, జపాన్ తదితర దేశాల్లో రోడ్‌షోలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మారిటైమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. కొత్తగా నిర్మిస్తున్న 4 పోర్టుల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలు.. ఈ పోర్టుల పక్కనే అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కులు, వాటిలో మౌలిక వసతుల కల్పన తదితరాలను కూడా వివరించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం సముద్ర ఆధారిత వాణిజ్యానికి ఇస్తున్న ప్రాధాన్యం, పెట్టుబడి అవకాశాలను వివరిస్తూ జనవరిలో విశాఖ వేదికగా అంతర్జాతీయ మారిటైమ్ సదస్సును నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే గుంటూరు వేదికగా సముద్రపు ఆహార ఉత్పత్తులు, వాటి రంగంలో పెట్టుబడుల అవకాశాలపై సదస్సు నిర్వహించడానికి ఏపీ మారిటైమ్ బోర్డు కసరత్తు చేస్తోంది.

15న మరో అల్పపీడనం!

- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం
- నేడు, రేపు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఈనెల 13వ తేదీన దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవిర్భవించనుంది. దీని ప్రభావంతో 15వ తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి, బలపడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంపైకి తూర్పు గాలులు వీస్తున్నాయి. ఫలితంగా ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. వీటి ఫలితంగా సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్ని చోట్ల, ఉత్తర కోస్తాంధ్రలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి వెల్లడించింది.

కరోనా వేళా ఏపీలో వృద్ధి

రాష్ట్రాల వారీగా కోవిడ్ కాలంలో జీడీపీ నమోదు వివరాలను పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్రం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలుచేయడంవల్లే దేశంలో మిగిలిన రాష్ట్రాల కంటే ఏపీలో జీఎస్‌డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్–రాష్ట్ర స్థూల ఉత్పత్తి) వృద్ధి రేటు నమోదవుతోందని కేంద్రం నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రెండ్రోజుల క్రితం పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్రం ప్రవేశపెట్టిన వివరాల్లో.. కరోనా లాంటి విపత్తు సమయంలో దేశ వ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లో జీఎస్‌డీపీ వృద్ధిరేటు మైనస్ స్థాయికి పడిపోయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ సహా కేవలం 3 రాష్ట్రాల్లోనే వృద్ధిరేటు నమోదైనట్లు వెల్లడించింది. దీని ప్రకారం.. 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఏపీ(0.08%), తమిళనాడు (0.14%), పశ్చిమ బెంగాల్ (1.06 %) మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో ఈ వృద్ధిరేటు మైనస్ స్థాయికి పడిపోయినట్లు కేంద్రం పేర్కొంది.

ఆ రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలవల్లే..

మరోవైపు.. ఆ ఆర్థిక సంవత్సరంలో ఏపీ మినహా మిగిలిన రెండు రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం గమనార్హం. ఎన్నికల సంవత్సరంలో ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రజాకర్షక పథకాలు అమలుచేయడం సహజం. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా అక్కడి ప్రభుత్వాలు అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలతో ఆయా రాష్ట్రాల్లో వృద్ధిరేటు నమోదు కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం



రాష్ట్రాల వారీగా 2020-21లో అతితక్కువ వృద్ధిరేటు నమోదైన రాష్ట్రాలు.. (శాతాల్లో)

రాష్ట్రం	2020-21		
ఛండీఘడ్	- 10.34	మహారాష్ట్ర	- 7.57
కేరళ	- 9.20	జార్ఖండ్	- 5.52
		ఉత్తరప్రదేశ్	- 5.51

అప్పటికి 9 నెలల ముందే అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. ఇక మన రాష్ట్రంలో ప్రభుత్వం పేదలకు పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడాన్ని ప్రతిపక్షాలు తప్పుపడుతున్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా నవరత్నాల పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తోంది. దీని వల్లే ఆ ఏడాది రాష్ట్రంలో వృద్ధిరేటు సాధ్యమైందని అధికార వర్గాలు స్పష్టంచేస్తున్నాయి. ఇక ఆ ఏడాది దేశంలో ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలైన ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలున్న మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వృద్ధిరేటు మైనస్ స్థాయిలోనే ఉంది.

2021–22లో ఏపీనే టాప్..

కరోనా అనంతరం 2021–22 ఆర్థిక సంవత్సరంలో అయితే ఏపీ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే అత్యధిక వృద్ధిరేటు నమోదు చేసినట్లు పార్లమెంట్‌లో తెలిపిన వివరాల్లో కేంద్రం పేర్కొంది. ఆ ఏడాది దేశంలోనే అత్యధికంగా ఏపీ 11.43% జీఎస్‌డీపీ వృద్ధిరేటును నమోదు చేసినట్లు వెల్లడించింది. ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సహా దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ కంటే ఏపీ మెరుగైన వృద్ధిరేటు నమోదుచేసిందని కేంద్రం తెలిపింది.

క్షేమంగా తిరిగొచ్చిన మత్స్యకారులు

- ఈ నెల 4న వేటకెళ్లిన గంగపుత్రులు
- మాండూస్ తుపాను కారణంగా చుట్టుముట్టిన రాకాసి అలలు
- సిగ్నల్స్ కట్ అవడంతో పనిచేయని మొబైల్స్
- కొత్తపట్నం తీరంలో 48 గంటల నిరీక్షణ
- ఫలించిన ఎన్డీఆర్ఎఫ్, మెరైన్, సివిల్ పోలీస్ రెస్క్యూ ఆపరేషన్



సముద్రంలో చిక్కుకుపోయిన మత్స్యకారులను బోటు సహాయంతో తీసుకొస్తున్న అధికారులు

కొత్తపట్నం/చీరాల టౌన్: బాపట్ల జిల్లా చీరాల ఓడరేవు నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు నడిసంద్రంలో చిక్కుకుపోగా.. అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి ఆదివారం సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 4న ఏడుగురు మత్స్యకారుల బృందం ఓడరేవు గ్రామం నుంచి గరికన కృష్ణ, మల్లె బంగారయ్య, మెరుగు శివ, కుక్కల మహేష్, మరద పోలు, దాసరి పంపోజీ, మెరుగు ప్రసాద్ (డ్రైవర్) సముద్రంలో నెల్లూరు జిల్లా వైపు బయలుదేరారు. 4 రోజుల పాటు వేట కొనసాగించారు. ఆ సమయంలో మాండూస్ తుపాను హెచ్చరికలు వెలువడటంతో వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం వీరి మొబైల్ సిగ్నల్స్ నిలిచిపోగా.. కాసేపటికే ఆ బోటులోని ఒక ఇంజన్ చెడిపోయింది. అలల ఉధృతికి బోటు ముందుకు సాగలేదు. దీంతో వారు నడిసంద్రంలోనే బిక్కుబిక్కుమంటూ నెమ్మదిగా ముందుకొచ్చారు. శనివారం మధ్యాహ్నం మొబైల్ సిగ్నల్స్ పనిచేయడంతో టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తాము ఆపదలో ఉన్నామని అధికారులకు సమాచారమిచ్చారు.

యంత్రాంగం అప్రమత్తం

సమాచారం తెలియగానే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మెరైన్, మత్స్యశాఖ, స్పెషల్ బ్రాంచ్, ఎన్డీఆర్ఎఫ్, కోస్ట్, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. మత్స్యకారులతో ఫోన్‌లో సంప్రదించగా.. రాకాసి అలలు ఉధృతంగా వస్తున్నాయని బోటు తిరగబడే పరిస్థితి నెలకొందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తపట్నం సమీపంలోని గుండమాల రేవుకు వెళ్లామని అధికారులకు చెప్పగా.. చీరాల మత్స్యశాఖ జేడీ పి.సురేష్, ఇతర అధికారులు కొత్తపట్నం బీచ్‌కు చేరుకున్నారు. అనంతరం మత్స్యకారులతో ఫోన్‌లో మాట్లాడి.. వారిని గుండమాలకు వెళ్లొద్దని, కొత్తపట్నం బీచ్‌కు రావాలని, తాము ఇక్కడే ఉన్నామని, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. దీంతో వారంతా శనివారం రాత్రి 9 గంటలకు కొత్తపట్నం సమీపానికి వచ్చారు. అలలు ఉధృతంగా ఎగిసిపడటంతో ముందుకు రాలేమని చెప్పి బీచ్‌కు 500 మీటర్ల దూరంలో లంగర్ వేసుకుని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడిపారు. ఆదివారం ఉదయం జిల్లా యంత్రాంగం కొత్తపట్నం బీచ్‌కు చేరుకుని వేరే బోటును తీసుకెళ్లి వారిని తీసుకొచ్చారు.

సామాన్యుడి చేతిలో స్పందనాస్త్రం

▶ మొదటి పేజీ తరువాయి

వేర్వేరు టోల్‌ఫ్రీ నంబర్లను కూడా అందుబాటులోకి తెచ్చింది.

పనితీరు ఇలా...

ఫిర్యాదులను స్వీకరించటంతో సరిపెట్టకుండా సమస్యల పరిష్కారానికి కచ్చితమైన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 'స్పందన'లో స్వీకరించే ప్రతి ఫిర్యాదుకూ వైఎస్ఆర్ (యువర్ స్పందన రిక్వెస్ట్) నెంబరు కేటాయిస్తారు. ఫిర్యాదులను వర్గీకరించి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపుతారు. వాటిపై విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ఒకవేళ ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందకుంటే ఆ విషయాన్ని తెలిపితే అధికారులు మరోసారి పరిశీలిస్తారు.

5.85 లక్షల ఫిర్యాదులు పరిష్కారం..

2021 ఏప్రిల్ 1 నుంచి 2022 డిసెంబరు 6వ తేదీ వరకు స్పందనలో 6,14,529 ఫిర్యాదులు నమోదు కాగా 5,85,613 పరిష్కారమయ్యాయి. 28,916 ఫిర్యాదులు విచారణలో ఉన్నాయి.

రూ.45 కోట్ల భూమిపై కన్ను..

అనంతపురం వక్కలం వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట సుబ్బయ్యకు రాచానపల్లి సర్వే నెంబర్ 127లో 14.96 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో దీని విలువ రూ.45 కోట్లకు పైమాటే. ఖరీదైన ఈ భూమిని కాజేసేందుకు అంపగాని శ్రీనివాసులు, సత్యమయ్య, హనుమంతాచారి, వేణుగోపాల్, రమేష్, రామ్మోహన్‌రెడ్డి ఓ ముఠాగా ఏర్పడి నకిలీ ఆధార్ సృష్టించారు. టీచర్స్ కాలనీకి చెందిన వడ్డే రాముడు ఆధార్ కార్డును వెంకట సుబ్బయ్య పేరుతో నవీకరించారు. తండ్రి పేరు, అడ్రస్,ఫోన్ నంబర్ మార్చేసి సత్యమయ్యకు



అనంతపురంలో స్పందన ఫిర్యాదులను స్వీకరిస్తున్న పోలీసులు

విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ కూడా చేశారు. అనంతరం దీన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి దేవేందర్‌రెడ్డికి ఎకరం రూ.కోటి చొప్పున విక్రయించేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. అడ్వాన్స్ కింద ఈ ముఠా రూ.1.05 కోట్లు వసూలు చేసింది. వెంకటసుబ్బయ్య కుమారులు వెంకటరమణ, నందకిషోర్ ఆగస్టు మొదటి వారంలో అనుమానంతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈసీకి దరఖాస్తు చేయడంతో అసలు బాగోతం వెలుగు చూసింది. ఆగస్టు 7న స్పందన కార్యక్రమంలో దీనిపై ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పకు ఫిర్యాదు చేయడంతో విచారించి ఆగస్టు 24న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అధిక వడ్డీల ఎర...

అధిక వడ్డీల ఎర వేసి రూ.1.5 కోట్లు కాజేసి బెదిరిస్తున్న ఓ మహిళపై నవంబరు 31న న్యాయవాది చంద్రశేఖర్ గుంటూరు ఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. 40 మంది ఉద్యోగుల నుంచి నిందితురాలు మొత్తం రూ.25 కోట్లు వసూలు చేసి మోసగించినట్లు వెల్లడైంది. ఈ కేసును నల్లపాడు పోలీసులు విచారిస్తున్నారు. బ్యాంకు రుణం ఇప్పిస్తానంటూ రూ.లక్షల్లో వసూలు చేసిన గుంటూరు శ్రీనగర్‌కు చెందిన మరో మహిళ మోసాలపైనా స్పందనలో ఫిర్యాదు అందటంతో అరండల్‌పేట పోలీసులు విచారణ చేపట్టారు.

నకిలీ ఎన్‌వోసీల గుట్టు రట్టు..

ట్రెజరీ మాజీ ఉద్యోగి మనోజ్ రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో కలసి నకిలీ ఎన్‌ఓసీలు సృష్టించిన వైనం ఇది. అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు 513 సర్వే నంబరులో శంకరరెడ్డికి చెందిన 12 ఎకరాల భూమికి ఎన్‌వోసీ ఇప్పించేందుకు మనోజ్‌తో పాటు రాయల శ్రీనివాసులు, దండు వెంకటనాయుడు రూ.2.50 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్సుగా రూ.1.32 కోట్లను తీసుకున్నారు. స్థానిక మండల తహశీల్దార్ శ్రీనివాసులుతో పాటు సబ్‌రిజిస్ట్రార్ త్రినాథ్, డిప్యూటీ తహశీల్దార్ గురుప్రసాద్, ఎస్ఐ రాంప్రసాద్‌కు లంచం ఇచ్చి అక్రమ మార్గాల్లో పని పూర్తి చేశారు. వాటాల పంపకంలో తేడా రావడంతో ట్రెజరీ ఉద్యోగి మనోజ్‌పై దండు వెంకటనాయుడు, రాయల శ్రీనివాసులు స్పందనలో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి ప్రధాన నిందితులు ముగ్గురిని అరెస్టు చేశారు. ఎస్ఐ రాంప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ గురుప్రసాద్ పరారీలో ఉన్నారు. సస్పెండైన తహశీల్దార్ ,సబ్ రిజిస్ట్రార్ త్రినాథ్ ఊచలు లెక్కిస్తున్నారు.

'కార్పొరేట్' వేధింపులపై..

నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించడంతోపాటు రోజూ 16 గంటలు గదుల్లోనే ఉంచడం ,నాసిరకం భోజనంపై 'స్పందన'లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అధ్యాపకులు చావబాదిన ఘటనలపైనా విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదు

శాఖల వారీగా స్పందన ఫిర్యాదుల పరిష్కారం ఇలా..

ప్రభుత్వ శాఖ	ఫిర్యాదుల సంఖ్య	పరిష్కరించినవి
రెవిన్యూ(సీసీఎల్ఏ)	154215	142103
సచివాలయాలు	83600	82795
పంచాయతీరాజ్	59878	57307
మున్సిపల్ పరిపాలన	42481	41795
పోలీస్	37019	35992
హౌసింగ్ కార్పొరేషన్	26760	26419
వ్యవసాయం	25223	24353
ఇతర శాఖల ఫిర్యాదులు	1,85,353	1,74,849

చేస్తున్నారు.అనంతపురంలో నారాయణ కళాశాలను తనిఖీ చేసిన జేసీ నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.5 లక్షల జరిమానా విధించారు. అద్దె కట్టకుండా, ఇల్లు ఖాళీ చేయకుండా పదేళ్లుగా యజమానిని ఇబ్బంది పెడుతున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహారం కూడా 'స్పందన' ద్వారానే బహిర్గతమైంది. బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఒకరి భూమి మరొకరికి రిజిస్ట్రేషన్..

ఒకరి భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడంపై చిత్తూరుకు చెందిన బాలగురునాథం స్పందనలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించారు. సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ శాఖ సిబ్బంది కొందరు ముఠాగా ఏర్పడి ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా రూ.కోట్లు విలువ చేసే స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తేలింది. స్థల యజమానికి తెలియకుండా మరొకరి పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్న ముఠాను అక్టోబర్ 8న చిత్తూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో తహసీల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం, చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్తా, వీఆర్‌వోలు ధనుంజయ, శివనారాయణ, కె.బాబు హస్తం ఉన్నట్లు వెల్లడైంది.

దొంగ పాస్ పుస్తకాలతో...

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం సీఎం.కండ్రిగకి చెందిన రైతు రఘు తన భూమికి రెవెన్యూ సిబ్బంది నకిలీ పాస్ పుస్తకాలను సృష్టించడంపై నవంబర్ 7న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రఘుకు చెందిన 4.08 ఎకరాల భూమిని కాజేసేందుకు అదే మండలంలో పనిచేసే వీఆర్‌వో సుబ్రహ్మణ్యం తన కుమార్తె పేరుతో దొంగ పాసుపుస్తకాలను సృష్టించినట్లు విచారణలో వెల్లడైంది. వీఆర్‌వోపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

చెరువునే మింగిన పచ్చ తిమింగలం

శ్రీకాకుళం జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ)కి చెందిన భూబాగోతం స్పందన ఫిర్యాదుతోనే వెలుగు చూసింది. ఎచ్చెర్ల పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కృష్ణ బంద చెరువును పూడ్చి ప్లాట్లుగా విక్రయిస్తున్నట్లు స్పందనలో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఇక్కడ సెంటు స్థలం రూ.5 లక్షలు పలుకుతోంది. ఐదెకరాల చెరువు ఆక్రమణకు గురైనట్లు విచారణలో తేలడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

స్పందన టోల్‌ఫ్రీ నంబర్లు..

1902 : నవరత్నాలు పథకాలతో సహా అన్ని రకాల ఫిర్యాదులకు
14500: ఇసుక, ఎక్సైజ్ విభాగంపై ఫిర్యాదులకు
14400: అధికారుల అవినీతిపై ఫిర్యాదులకు
1907: వ్యవసాయ రంగం, రైతుభరోసాకు సంబంధించిన ఫిర్యాదులు
14417: పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు పనులు, టాయిలెట్ల నిర్వహణ, టీచర్ల హాజరుపై ఫిర్యాదులకు..

రైతు భరోసా కేంద్రాలు.. గొప్ప ఇన్నోవేషన్

▶ మొదటి పేజీ తరువాయి

సేవలను పరిశీలించారు.

రెండు గంటల పాటు ఆర్బీకేలోనే..

ఆర్బీకేలో రెండు గంటల పాటు గడిపిన బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. పొలంబడిని పరిశీలించారు. గ్రామ స్థాయిలో ఎంపిక చేసిన రైతుక్షేత్రాల్లో 14 వారాల పాటు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణనిస్తున్నామని, మూడు సీజన్‌లలో శిక్షణ ఇచ్చిన వారికి గ్యాప్ సర్టిఫికేషన్ ఇస్తున్నామని, ఇలా మూడు విడతల్లో పొందిన వారికి ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఇవ్వనున్నట్లు అధికారులు వివరించారు. ఆర్బీకేలో కియోస్క్ ద్వారా అందిస్తున్న సేవలు, ఇన్‌పుట్స్ బుకింగ్ విధానాన్ని బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. కియోస్క్‌ను స్వయంగా ఆపరేట్ చేసి వాతావరణ సమాచారాన్ని పరిశీలించారు. చాలా అద్భుతంగా ఉందంటూ కితాబిచ్చారు. ఆర్బీకేలో డిజిటల్ లైబ్రరీతో పాటు వ్యవసాయ మ్యాగజైన్స్‌ను పరిశీలించారు. స్మార్ట్‌టీవీ ద్వారా ప్రసారమవుతున్న ఆర్బీకే చానల్ కార్యక్రమాలను వీక్షించారు. ఈ – క్రాప్ బుకింగ్‌తో పాటు గ్రామ స్థాయిలో బ్యాంకింగ్ సేవలు బాగున్నాయని అభినందించారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచిన పరికరాలను పరిశీలించి వినియోగంపై రైతులను వివరాలు అడిగి



నందిగామలోని అగ్రి ల్యాబ్‌ను పరిశీలిస్తున్న బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ ఓవెన్

తెలుసుకున్నారు.

మూగజీవాలపై శ్రద్ధ..

ఆర్బీకే ప్రాంగణంలో ఉన్న వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవారథాన్ని పరిశీలించి వినూత్నంగా ఉందని కితాబిచ్చారు. హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా పశువులను తరలించే విధానం, అంబులెన్స్‌లో మినీ లేబరేటరీ ద్వారా పరీక్షల తీరును పరిశీలించారు. మూగజీవాల కోసం ఇంత శ్రద్ధ తీసుకోవడం తానెక్కడా చూడలేదంటూ అభినందించారు. అనంతరం నందిగామలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను సందర్శించారు. సుమారు గంటకు పైగా ల్యాబ్‌లోనే గడిపి ప్రతి ఒక్కటి స్వయంగా పరిశీలించారు.

ప్రభుత్వ దూరదృష్టి అద్భుతం

'అక్టోబర్‌లో రాష్ట్రానికి వచ్చినప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు అధికారులు వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల గురించి వివరించారు. వాటిని స్వయంగా పరిశీలించేందుకే ఇక్కడకు వచ్చా' అని బ్రిటన్‌డిప్యూటీ హై కమిషనర్ తెలిపారు. సీఎం, అధికారులు చెప్పిన దాని కంటే గొప్పగా రైతులకు సేవలు అందిస్తున్నారని చెప్పారు. 'ల్యాబ్ టు ల్యాండ్, ల్యాండ్ టు ల్యాబ్' విధానంతో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు అందిస్తున్నారు. నాణ్యతకు పెద్ద పీట వేశారు. ప్రతీ ఇన్‌పుట్‌ను పరీక్షించి మరీ రైతులకు అందిస్తున్నారు. సాగులో అడుగడుగునా అండగా నిలుస్తున్నారు. పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఆర్బీకే సేవలు అద్భుతంగా ఉన్నాయి' అని తెలిపారు. తొలిసారిగా అరిటాకులో భోజనం చేశానని, సంప్రదాయ పద్ధతిలో వడ్డించే ఆహారం చాలా రుచికరంగా ఉండటమే కాకుండా చేతి వేళ్లతో తిన్నానంటూ బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ ట్వీట్ చేశారు. నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఆర్బీకేల ఇన్‌చార్జి వల్లూరి శ్రీధర్, పొలంబడి ఇన్‌చార్జి బాలూనాయక్, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయభారతి, నందిగామ ఏడీ రమణమూర్తి, కంచికచర్ల మత్స్యశాఖ ఏడీ చక్రాణి, పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్వరరావు, అగ్రిల్యాబ్ కోడింగ్ సెంటర్ డీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెరిపిన పడ్డ సీమ

▶ మొదటి పేజీ తరువాయి

ఓ మోస్తరు వర్షాలు కొనసాగాయి.

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అధిక ప్రభావం

తుపాను కారణంగా తిరుపతి జిల్లాలో 21 మండలాలు, చిత్తూరు జిల్లాలో 14 మండలాలు, ప్రకాశంలో 10, నెల్లూరులో 9, అన్నమయ్యలో 8 మండలాలు ప్రభావితమయ్యాయి. తిరుపతి జిల్లాలో 571 మందిని, చిత్తూరు జిల్లాలో 416, నెల్లూరు జిల్లాలో 208 మందిని.. మొత్తంగా 1,195 మందిని శిబిరాలకు తరలించారు. వర్షాలకు వైఎస్సార్ జిల్లాలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తిరుపతి జిల్లాలో 55 ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

గత 24 గంటల్లో వర్షపాతం ఇలా..

శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు ప్రకాశం జిల్లా పెదచెర్లోపల్లిలో అత్యధికంగా 15.4 సెం.మీ వర్షం కురిసింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం బట్టేపాడులో 15.1 సెం.మీ, ప్రకాశం జిల్లా కనిగిరి మండలం బల్లిపల్లిలో 14.4 సెం.మీ, నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం టి.ముస్తాపురంలో 12.37 సెం.మీ, చీపినపిలో 12.35 సెం.మీ, ప్రకాశం జిల్లా కోతపల్లిలో 11.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నెల్లూరు జిల్లా ఉలవపాడులో 8.6 సెం.మీ, కందుకూరులో 7.6 సెం.మీ, మన్నేటికోటలో 7.4 సెం.మీ, కందుకూరు దైవివారిపాలెంలో 7.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. 2 రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

సహాయక చర్యలపై మంత్రి పెద్దిరెడ్డి సమీక్ష

- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వరద బాధితులకు చేపడుతున్న సహాయక చర్యలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్‌లతో సమీక్షించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తోంది. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి మెరుగైన భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు.
- ఈ రెండు జిల్లాల్లో సుమారు 10 వేల హెక్టార్లలో వివిధ పంటలు నీట మునిగినట్లు అంచనా. శనివారం వేకువజామున భారీగా వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. శిబిరాల నుంచి ఇళ్లకు వెళుతున్న కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.2 వేలు అందజేశారు. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శనివారం వర్షపు నీటిలోనే పర్యటించి, మున్సిపల్ అధికారులను అప్రమత్తం చేశారు. ఎక్కడా నీరు నిలవకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి దుప్పట్లు పంపిణీ చేశారు.

లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు

- మాండూస్ తుపాన్ తీరం దాటినప్పటికీ ఆ ప్రభావంతో నెల్లూరు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా నారుమళ్లు, నాట్లు నీట మునిగాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో ఆ శాఖకు నష్టం వాటిల్లింది.
- నెల్లూరు నగరంతో పాటు లోతట్టు ప్రాంతాల కాలనీల్లో ఇంకా వర్షపు నీరు నిలబడిపోయింది. నెల్లూరు ఆర్టీసీ కాలనీ, చంద్రబాబునగర్, వైఎస్సార్ నగర్, చొటమిట్ట కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న నీటిని అధికారులు జేసీబీల సాయంతో కాలువల్లోకి మళ్లిస్తున్నారు. నగర పంచాయతీ అయిన బుచ్చిరెడ్డిపాళెంలో చెన్నకేశవ ఆలయం గర్భగుడిలోకి వర్షం నీరు చేరింది. వ్యవసాయ, విద్యుత్ శాఖాధికారులు నష్టం అంచనాకు ఉపక్రమించారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

- ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగు చేసిన పంటలు నీట మునిగాయి. దర్శి, కనిగిరి, కొండపి ప్రాంతాల్లో కొంత మేర పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అనేక ప్రాంతాల్లో వాగులు రోడ్లెక్కి ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. జిల్లా వ్యాప్తంగా చెరువులు, వాగులు, వంకలు నిండటంతో జలకళ సంతరించుకుంది.
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వరి కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ వర్షాల ప్రభావం డెల్టా రైతులపై తీవ్రంగా ఉంది. భట్టిప్రోలులో వరి ఓదెలు నీట మునిగాయి.
- తుపాను తీరం దాటి బలహీన పడినప్పటికీ కాకినాడ తీరంపై ఇంకా దాని ప్రభావం కనిపిస్తోంది. కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, కోనపాపపేటల్లో తీరానికి చేరువగా ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయి. ఉప్పాడ వద్ద తీర రక్షణకు వేసిన జియోట్యూబ్ గోడ ధ్వంసమైంది.
- ఉమ్మడి కృష్ణా జిల్లా అవనిగడ్డ, పెడన, మైలవరం తదితర నియోజకవర్గాల్లో 7,500 ఎకరాల్లో పనలపై ఉన్న వరిపంట, కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నీటమునిగాయి.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ


▶ మొదటి పేజీ తరువాయి

బాధపడుతున్న గర్భిణులకు ప్రభుత్వం 108 అంబులెన్స్‌ల ద్వారా నిమిషాల్లో ఆస్పత్రులకు తరలిస్తూ అండగా నిలుస్తున్న విషయం తెలిసిందే. 2020 నుంచి ఇప్పటివరకూ 108 అంబులెన్స్‌లు 10 లక్షలకు పైగా ఎమర్జెన్సీ కేసులకు హాజరవగా.. ఇందులో అత్యధికంగా 19 శాతం మంది గర్భిణులు ఉండటం గమనార్హం.

ఏటా రూ.12 కోట్ల వరకు.

హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి ముందే పెద్దాస్పత్రులకు తరలించడం కోసం నెలకు రూ.కోటి చొప్పున ఏడాదికి రూ.12 కోట్ల వరకూ ఖర్చు అవుతుందని వైద్య శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలో ఏటా 8 లక్షల మందికిపైగా గర్భిణులు ఆర్సీహెచ్ పోర్టల్‌లో రిజిస్టర్ అవుతుంటారు. కాగా, వీరిలో 10 శాతం మంది హైరిస్క్‌లో ఉంటున్నారు. ఈ లెక్కన నెలకు 5 వేల వరకూ హైరిస్క్ గర్భిణుల ప్రసవాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో అన్ని పీహెచ్‌సీలకు రాబోయే వారం రోజుల్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్న హైరిస్క్ గర్భిణుల సమాచారం రాష్ట్రస్థాయి నుంచి అందజేస్తారు. సమాచారం ఆధారంగా పీహెచ్‌సీ సిబ్బంది హైరిస్క్ గర్భిణులను డెలివరీ తేదీకి మూడు నుంచి నాలుగు రోజుల ముందే దగ్గరలోని ఏరియా, జిల్లా, అవసరాన్ని బట్టి బోధనాస్పత్రులకు తరలిస్తారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించడం కోసం ప్రత్యేకంగా యాప్‌ను సిద్ధం చేశారు. హైరిస్క్ గర్భిణి వాహనంలో పెద్దాస్పత్రికి తరలింపు, పెద్దాస్పత్రిలో అడ్మిట్ చేయడం, ప్రసవానంతరం ఫొటోలను యాప్‌లో సిబ్బంది అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే యాప్ ట్రయల్ రన్ సైతం పూర్తయింది. చిన్నచిన్న మార్పు చేర్పులను చేస్తున్నారు.

మాత, శిశు మరణాల కట్టడి కోసమే



మాతా, శిశు మరణాల కట్టడిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో హైరిస్క్ గర్భిణులపై ఫోకస్ పెంచుతున్నాం. వారికి మెరుగైన ఆరోగ్య సంరక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా ప్రసవానికి ముందే వారిని పెద్దాస్పత్రులకు తరలించడం కోసం పీహెచ్‌సీలకు నిధులు మంజూరు చేయనున్నాం.

– జె.నివాస్, కమిషనర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ


ఏలూరు జిల్లా వసంతవాడలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



కర్నూలు జిల్లా కల్లూరు వీకర్ సెక్షన్ కాలనీలో మహిళలకు బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


బాపట్ల జిల్లా కొత్తమద్దిబోయినవారిపాలెంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి


ఎన్టీఆర్ జిల్లా తాతకుంట్లలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

క్లుప్తంగా...

నాగపూర్ మెట్రో ప్రాజెక్ట్‌కు విశాఖ ఉక్కు

ఉక్కునగరం: మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్మిస్తున్న మెట్రో ప్రాజెక్టుకు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉక్కును వినియోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆత్మనిర్భర్ కార్యక్రమాల్లో భాగంగా మెట్రో ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతున్నది. నిర్మాణంలో ఉన్న మెట్రో ప్రాజెక్ట్ ఫేస్–2లో దేశంలో నాణ్యమైన ఉక్కు తయారీకి పేరెన్నికగన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి చేసిన 48 వేల మిలియన్ టన్నుల ఉక్కును వినియోగిస్తున్నారు. పార్లమెంట్, సర్దార్ సరోవర్ వంటి ప్రాజెక్టలతోపాటు నాగపూర్ మెట్రో ప్రాజెక్ట్‌కు విశాఖ ఉక్కు వినియోగించడంపై విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

14 నుంచి జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలు

సాక్షి, అమరావతి: ఈ నెల 14 నుంచి 20 వరకు జరగనున్న జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగస్వాములు కావాలని అన్ని ప్రభుత్వ శాఖలను రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. ఇంధన శాఖ అధికారులతో ఆదివారం జరిగిన వర్చువల్ సమీక్షలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ కొనుగోళ్లలో రూ.4,925 కోట్లు, ఇంధన సామర్థ్య కార్యక్రమాల ద్వారా 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేసిన అంశాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం)కు మంత్రి సూచించారు. పలు ప్రభుత్వ శాఖల్లో ఏర్పాటు చేసిన ఇంధన సంరక్షణ విభాగాలను వారోత్సవాల్లో పాల్గొనాలని ఆదేశించారు. వారోత్సవాల్లో విద్యార్థులు, స్వయం సహాయ మహిళలు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ఎనర్జీ కన్జర్వేషన్ ర్యాలీ, ఎనర్జీ ఎఫిషియెన్సీ టెక్నాలజీలపై వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సమీక్షలో ఏపీఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు మరిన్ని ఐటీ సంస్థలు

బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

సాక్షి, విశాఖపట్నం: ఐటీ రంగం అభివృద్ధి చెందడానికి అవసరమైన అన్ని వనరులు విశాఖపట్నంలో ఉన్నాయని బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. దేశంలోనే టాప్ ఐటీ డెస్టినేషన్ సిటీగా విశాఖ నిలవనుందన్నారు. ఇప్పటికే పలు ఐటీ సంస్థలు విశాఖకు వచ్చాయని, మరి కొన్ని రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. ఆదివారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ రంగంపై ప్రభుత్వం పూర్తి శ్రద్ధ చూపడం లేదని, దీనిపై బీజేపీ పోరాటం చేస్తుందని చెప్పారు. ఎస్టీపీఐకి స్థలం కేటాయింపు, స్టీల్ ప్లాంట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు నిధుల మంజూరు విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. టీడీపీ హయాంలో ఊరూ, పేరు లేని ఐటీ కంపెనీలకు సబ్సిడీలిచ్చి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో 'విశాఖ అభివృద్ధి' అజెండాతో ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నగర అధ్యక్షుడు ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సీఐ, కానిస్టేబుల్

- స్టేషన్ బెయిల్‌కు రూ.75వేలు డిమాండ్
- రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ


సీఐ రాము


కానిస్టేబుల్ కరీమ్

బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాము, కానిస్టేబుల్ కరీమ్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపిన వివరాల ప్రకారం... బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాల విషయంలో అదే గ్రామానికి చెందిన కొండారెడ్డి, నెల్లూరు జిల్లాకు చెందిన మల్లికార్జునరెడ్డి మధ్య వివాదం ఉంది. ఫోర్జరీ సంతకాలతో కళాశాల ఆస్తులను కాజేశారని మల్లికార్జునరెడ్డిపై కొండారెడ్డి ఈ ఏడాది మే నెలలో బుక్కరాయసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మల్లికార్జునరెడ్డి, అతని భార్య స్రవంతి, తమ్ముడు రాజమోహన్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. మల్లికార్జునరెడ్డి హైకోర్టుకు వెళ్లి బెయిల్ కోసం ప్రయత్నించారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు మల్లికార్జునరెడ్డి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని సీఐ రామును కోరగా.. అందుకు రూ.75 వేలు డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇచ్చినప్పటికీ బెయిల్ ఇవ్వలేదు. మరో రూ.25 వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో అతను ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి ప్రణాళిక మేరకు శనివారం రాత్రి పది గంటలకు రూ.25 వేలు తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాము వద్దకు వెళ్లాడు. కానిస్టేబుల్ కరీమ్‌కు ఇచ్చి వెళ్లాలని ఆయన సూచించారు. కానిస్టేబుల్ కరీమ్‌కు నగదు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

విద్యార్థుల ఇంటికే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు

దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు

- పూర్తి ఉచితంగానే సర్టిఫికెట్లు పంపిణీ
- అర్హత, సామాజిక పరిస్థితి ఆధారంగా జారీ
- టెన్త్, ఇంటర్ విద్యార్థుల జాబితా వీఆర్వోల యాప్‌కు అనుసంధానం
- వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సర్టిఫికెట్
- పది లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం



మూడేళ్ల క్రితం..

ఓ పల్లెటూరి కుర్రాడికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. దగ్గరలో ఉన్న పట్నం వెళ్లాడు. రూ. 50 ఫీజు కట్టి మీ సేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకొన్నాడు. దీనికి ఒక రోజంతా పట్టింది. వారం పది రోజులు మండలాఫీసుల చుట్టూ తిరిగాడు. అప్పటికి గాని సర్టిఫికెట్లు రాలేదు. లంచం వంటివి అదనంగా ఇచ్చుకోవాల్సి వచ్చింది.

ప్రస్తుతం..

అదే గ్రామానికి చెందిన మరో యువకుడికి ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాల అవసరం వచ్చింది. నేరుగా అదే గ్రామంలోని గ్రామ సచివాలయానికి వెళ్లాడు. అక్కడే ఎటువంటి ఫీజు చెల్లించకుండా దరఖాస్తు చేసి నిమిషాల్లో ఇంటికి వచ్చేశాడు. మండలాఫీసుల చుట్టూ తిరగలేదు. ఎవరినీ కలవాల్సిన పనిలేదు. సర్టిఫికెట్లు చేతికందాయి.

ఇక మీదట

ఈ మాత్రం కష్టం కూడా ఉండదు. దరఖాస్తు చేసుకోకపోయినా పది, ఇంటర్ చదివే విద్యార్థులకు వారి అర్హత, సామాజిక పరిస్థితి ఆధారంగా ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను ప్రభుత్వమే వారి ఇళ్లకు తీసుకొచ్చి అందజేయనుంది. అది కూడా ఉచితంగానే.

సాక్షి, అమరావతి: ఆదాయ (ఇన్‌కం), కుల (క్యాస్ట్) ధ్రువీకరణ సర్టిఫికెట్లకు డిమాండ్ చాలా ఎక్కువ. విద్యార్థులకు స్కాలర్ షిప్ మంజూరులో, ఉన్నత చదువుల సీట్ల కేటాయింపుల్లో ఇవే కీలకం. ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్లు పొందాలన్నా ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి. మూడేళ్ల క్రితం వరకు వీటి కోసం విద్యార్థులు నానా తిప్పలు పడేవారు. పట్టణాలకో, మండల కేంద్రాలకో వెళ్లి మీ– సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాలి. ఒక్కొక్క సర్టిఫికెట్‌కు రూ. 40 నుంచి 50 వరకు ఫీజు చెల్లించాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. లంచాలు సరేసరి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విప్లవాత్మకంగా తెచ్చిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో పేదలకు ఈ ఇబ్బందులు తప్పాయి. గ్రామంలో, వార్డుల్లో ఉండే సచివాలయాల్లోనే సర్టిఫికెట్ల జారీ ప్రారంభమైంది. ఇంటికి దగ్గరలోనే ఉండే సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకొంటే నాలుగైదు రోజుల్లో సర్టిఫికెట్లు వచ్చేవి. ఫీజు మామూలుగానే చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి, పేదలకు ఈమాత్రం కష్టంకూడా లేకుండా, అసలు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా, పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లను ఇంటి వద్దకే అందజేసే ఏర్పాట్లు చేస్తోంది. రెవెన్యూ శాఖ సూచన మేరకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఈ ప్రక్రియను ఇప్పటికే మొదలు పెట్టింది.

జారీ ఇలా..

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పది, ఇంటర్మీడియట్ విద్యార్థుల జాబితాలను రాష్ట్రంలో అన్ని సచివాలయాల్లో పని చేసే వీఆర్వోల మొబైల్ యాప్‌కు అనుసంధానం చేశారు. వీఆర్వోలు ఆ జాబితా ప్రకారం తమ పరిధిలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితిని పరిశీలిస్తారు. దాని ఆధారంగా అర్హులందరికీ ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)కి నివేదిక ఇస్తారు. ఆర్ఐ పరిశీలన చేసి మండల తహసీల్దార్‌కు సిఫార్సు చేస్తారు. తహసీల్దార్ అర్హులకు సర్టిఫికెట్లను జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్లను సచివాలయాలవారీగా డౌన్‌లోడ్ చేస్తారు. వలంటీర్లు విద్యార్థుల ఇళ్లకే వెళ్లి ఆ సర్టిఫికెట్లను అందజేస్తారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ సోమవారంలోగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయనుంది.

టెన్త్‌లో 6 లక్షల మంది, ఇంటర్‌లో 10 లక్షల మంది!

రాష్ట్రంలో ఏటా పదో తరగతిలో 6 లక్షల నుంచి 6.5 లక్షల మంది, ఇంటర్ రెండు సంవత్సరాలు దాదాపు 10 లక్షల మంది చదువుతుంటారని అంచనా. వీరిలో దాదాపు 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారేనని అధికార వర్గాలు చెప్పాయి. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను ఇళ్ల వద్దే ఉచితంగా పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో 10లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందుతారని అధికారులు చెబుతున్నారు.

సచివాలయ వ్యవస్థ కారణంగానే ఈ వెసులుబాట్లు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ కారణంగా రాష్ట్రంలో పరిపాలనలోనే విప్లవాత్మక మార్పులు వచ్చాయి. అప్పటివరకు ప్రజలకు కష్టసాధ్యంగా ఉండే ప్రభుత్వ సేవలు కూడా ఇప్పుడు ఇంటి వద్దే అందుతున్నాయి. కుగ్రామంలో ఉండే ప్రజలు కూడా ఊరు దాటి బయటకు రావాల్సిన అవసరం లేకుండానే ఐదు కోట్లకు పైగా సేవలను ఈ 'సచివాలయా'లే అందించాయి. నడవలేని స్థితిలో ఉండే అవ్వాతాతలు ప్రతి నెలా పింఛను డబ్బుల కోసం ఆ గ్రామంలో పంచాయతీ ఆఫీసు లేదంటే గ్రామ పెద్ద ఇంటిదాకా వెళ్లే ఇబ్బందులు మూడేళ్ల క్రితమే తొలగిపోయాయి. 34 లక్షల మంది వృద్ధులు (కేవలం వృద్ధాప్య పింఛన్లు), మరో 50 వేల మందికి పైగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా వలంటీర్లు ఇంటి వద్దకు వెళ్లి పింఛను డబ్బులు పంపిణీ చేసే విధానాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. ఇప్పుడు విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దనే అందజేసే ప్రక్రియ కూడా మొదలు కాబోతోంది.

పారిశ్రామిక పార్కులపై ఫోకస్

- 21 పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళిక
- రూ.293.86 కోట్లతో పనులకు సిద్ధమైన ఏపీఐఐసీ
- పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతులు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఎటువంటి కాలుష్యం లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు ఏపీఐఐసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే 7 పారిశ్రామిక పార్కులు, ఆటోనగర్‌లలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తికాగా.. మరో 3 ఎంఎస్ఎంఈ పార్కుల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవికాకుండా మరో 14 పారిశ్రామిక పార్కుల్లో రూ.203.75 కోట్లతో మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అలాగే 7 పారిశ్రామిక పార్కుల్లో రెడీ టు వర్క్ ప్రారంభించుకునే విధంగా రూ.90.11 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎంఎస్ఈ–సీడీపీ పథకాన్ని వినియోగించుకుంటోంది. ఈ పథకం కింద 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే 60 శాతం నిధులను కేంద్రం గ్రాంటుగా ఇస్తోంది.

కేంద్రానికి ప్రాజెక్ట్ రిపోర్టులు

రాష్ట్రంలో మొత్తం 21 పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతులను అభివృద్ధి పర్చడానికి సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టులను తయారు చేసి కేంద్రానికి ఇస్తున్నట్టు ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇందుకోసం రూ.293.86 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. ప్రస్తుతం గుంటూరు ఆటోనగర్, మచిలీపట్నం జ్యూవెలరీ పార్కు, హిందూపురం పారిశ్రామిక పార్కుల్లో రూ.22.24 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇవికాకుండా ఇప్పటికే విజయవాడ ఆటోనగర్, ఆమదాలవలస, గాజువాక ఆటోనగర్, చిత్తూరు టెక్స్‌టైల్, కొప్పర్తి పారిశ్రామిక పార్కుల్లో రూ.85.77 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

అభివృద్ధికి నోచుకోనున్న 14 పారిశ్రామిక పార్కులు ఇవే..

జిల్లా	పారిశ్రామికపార్కు/ ఆటోనగర్
వైఎస్సార్	గోపవరం
కర్నూలు	బ్రాహ్మణపల్లి
నంద్యాల	జగదుర్తి
కృష్ణా	వీరపనేనిగూడెం
తూర్పుగోదావరి	కాల్వచర్ల
ప్రకాశం	చందలూరు
చిత్తూరు	వెంకటాపురం
అన్నమయ్య	తాటిగుంటుపల్లి
శ్రీసత్యసాయి	కప్పలబండ
తిరుపతి	పగలి బ్లాక్–2
కర్నూలు	గుట్టపాడు
అనకాపల్లి	కోడూరు
నెల్లూరు	నారంపేట
విశాఖ	గాజువాక

చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు

- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్య
- రాష్ట్రంలో రక్త బీజ రాక్షసుడు చంద్రబాబే
- పవన్.. వారాహితో బాబుపైకి వెళ్తావా?



సాక్షి, అమరావతి: 'చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరివి. సంక్షేమాభివృద్ధి పథకాలతో సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ ఘన విజయం సాధించడం, టీడీపీ ఉనికి కోల్పోవడం ఖాయం' అని జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీకి ఓటు వేయకపోతే ఇవే నాకు చివరి ఎన్నికలని నోరుజారి మనసులో మాట బయట పెట్టుకున్న చంద్రబాబు.. ఇప్పుడు దాన్ని సరి చేసుకోవడానికి పడుతున్న పాట్లు చూస్తుంటే నవ్వొస్తోందన్నారు. 'ఓ వైపు నాకు సీఎం పదవి అవసరం లేదు.. ప్రజల కోసమే వస్తున్నా అంటాడు. మరోవైపు సీఎం అయ్యాకే అసెంబ్లీలో అడుగు పెడతానన్నాడు. రెండింటికీ ఎక్కడైనా పొంతన ఉందా?' అని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన కుమారుడు, దత్తపుత్రుడు ముగ్గురూ సైకో లేనని విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంకా ఏమన్నారంటే..

బాబూ.. వీటికి సమాధానం చెప్పండి

- పోలవరం పనుల్లో పాపాలపై నేను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని చంద్రబాబు.. కిలాడీ రోశయ్య, ఆంబోతు రాంబాబు.. అంటూ పిచ్చిగా మాట్లాడుతున్నారు.
- నన్ను గంట, అర గంట మంత్రి అంటూ కనీస సభ్యత, సంస్కారం లేకుండా చంద్రబాబు విమర్శిస్తున్నారు. చంద్రబాబూ.. నీ రాజకీయ జీవితం ఏమిటి? ఆంబోతులకు ఆవులను సరఫరా చేయలేదా? అలాంటి వారిని ఏమంటారో నా నోటితో చెప్పించొద్దు. అలాంటి సన్నాసివి నీవు. నా గురించి మాట్లాడుతావా? మళ్లీ అలా నోరు జారితే నేను నోరు తెరుస్తాను. జాగ్రత్త. నీకు ధైర్యం ఉంటే నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు.
- మీరు ఎన్ని పర్యటనలు చేసినా, సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ 175కు 175 స్థానాల్లో విజయం సాధించడం ఖాయం.

విప్లవాత్మక మార్పులపై విషం చిమ్ముతారా?

- రాష్ట్రంలో పరిపాలనలో విప్లవాత్మక మార్పులను సహించలేని ఎల్లో మీడియాలో భాగమైన టీడీపీ గెజిట్ 'ఈనాడు'లో వలంటీర్లపై విషం చిమ్ముతూ నేరాలు చేస్తున్నదంతా వాళ్లే అంటూ కథనాలను ప్రచురించడం దారుణం.
- రాష్ట్రంలో రక్త బీజుడు అయిన రాక్షసుడు ఎవరైనా ఉన్నారంటే.. అది చంద్రబాబు మాత్రమే. పవన్ కళ్యాణ్ తన వారాహి ప్రచార వాహనాన్ని చంద్రబాబుపైకి ఎక్కిస్తారా? పవన్ కళ్యాణ్ సినిమాల్లో మాత్రమే హీరో. రాజకీయాల్లో పెద్ద జోకర్. ఒక విచిత్ర వేషధారుడు.

క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి


విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న మంత్రి రోజా

గూడూరు రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో కూడా ప్రోత్సహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖా మంత్రి రోజా కోరారు. తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీలో ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన 30వ రాష్ట్ర స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2022 ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో మంత్రి రోజా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో 182 ప్రాజెక్టులను బాల శాస్త్రవేత్తలు ప్రదర్శిస్తే అందులో 125 ప్రాజెక్టులను బాలికలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు అందించారు.

అంతర్‌రాష్ట్ర బదిలీలకు సమ్మతించండి

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వోద్యోగుల బదిలీలకు సమ్మతించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవంబర్ 23న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖపై తగు నిర్ణయం తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన తెంగాణ సీఎం కేసీఆర్‌కు ఒక లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏపీకి చెందిన 1,369 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు.

బాబుకు బుర్రే లేదు..

- ప్రజాప్రతినిధులకు సంక్షేమ పథకాలు వర్తిస్తాయా?
- ఆయనొస్తే పాత పథకాలు వడ్డీతో కలిపి ఇస్తారట!
- రాష్ట్రం మరో శ్రీలంక అంటున్న బాబు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారు?
- ఈ మోసకారి మాటలు నమ్మకండి: మంత్రి బొత్స మండిపాటు
- ఓర్వలేకే బురదజల్లుడు: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- పవన్, లోకేశ్ పది పంటల్లో ఐదింటిని కనుక్కుంటే గొప్ప: మంత్రి కాకాణి


మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. పక్కన మంత్రులు బొత్స సత్యనారాయణ, రాజన్నదొర తదితరులు

విజయనగరం/సత్తెనపల్లి/ అనంతపురం సప్తగిరి సర్కిల్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు బుర్రే లేదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. జయహో బీసీ సభకు రాకపోతే పింఛను తొలగిస్తాం.. సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని బెదిరించారని తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఆ సభకు వచ్చిన వారంతా ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారని, వారికి సంక్షేమ పథకాలు వర్తించవనే విషయం తెలియదా? అని ప్రశ్నించారు. జయహోబీసీ సదస్సుకు వచ్చిన బీసీలంతా పార్టీ నాయకులే అయినప్పుడు వారిని బెదిరించి తీసుకురావాల్సిన అవసరం ఏముంటుందని అన్నారు. ఆదివారం విజయనగరంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మీ సొంత చానళ్లలో అబద్ధాలు చెబుతూ దుష్ప్రచారం చేయిస్తే ప్రజలు నమ్మేస్తారని అనుకోవటం మీ మూర్ఖత్వం' అని బొత్స అన్నారు. తనొక భగవత్ స్వరూపుడిని, తాను చెప్పేదంతా ప్రజలు నమ్ముతారన్న భ్రమలో చంద్రబాబు ఉన్నారన్నారు. అమరావతిలో ఆయన వర్గం వారి ఆస్తులు కాపాడుకోవడానికి మనమంతా మద్దతివ్వాలనడం హాస్యాస్పదమని చెప్పారు. చంద్రబాబు మాటలకు కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు చప్పట్లు కొట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అయిపోతుందని గగ్గోలు పెడుతున్న చంద్రబాబు.. 2024 ఎన్నికల్లో తనకు అధికారమిస్తే పాత పథకాలను వడ్డీతో కలిపి ఇస్తామని చెబుతున్నారని, వాటికి డబ్బులు ఎక్కడ నుంచి తెస్తారని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు మోసకారి మాటలు చెబుతారని, అవి నమ్మి మోసపోవద్దని సూచించారు. టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క హామీ నెరవేర్చకుండా, ఇప్పుడు మళ్లీ అధికారం ఇస్తే.. అన్నీ చేస్తాం.. అని నిస్సిగ్గుగా హామీలు ఇవ్వడం ఏమిటని ధ్వజమెత్తారు. చంద్రబాబు 2014లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలుచేయలేదని ప్రజలు నిలదీయాలన్నారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటే ఓర్వలేక పచ్చ మీడియా సహకారంతో బురద జల్లుతున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఆ ముగ్గురికి జన్మనివ్వడం ఏపీ చేసుకున్న పాపం: కాకాణి



చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌లకు జన్మనివ్వడం ఆంధ్ర రాష్ట్రం చేసుకున్న పాపమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో ఆదివారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో సాగవుతున్న పది పంటలను చూపిస్తే వాటిల్లో ఐదు పంటల పేర్లు పవన్, లోకేశ్ చెప్పగలిగితే గొప్ప అని అన్నారు. అలాంటి వీరు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో రైతులకు ఇవ్వాల్సిన బీమా సొమ్ము రూ.716 కోట్లు ఎగ్గొట్టి, పసుపు కుంకుమకు పంపిణీ చేశారని విమర్శించారు. రూ.1.11 లక్షల కోట్లు రుణమాఫీ చేయకుండా మోసం చేశాడన్నారు. ప్రాజెక్టులు కడితే ఖర్చు తప్ప రాబడి ఉండదన్న దుర్మార్గుడు చంద్రబాబు.. అని నిప్పులు చెరిగారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలుకు నగదు చెల్లించకుండా బకాయిలు పెట్టాడన్నారు. తుదకు రైతుల ఆత్మహత్యలను కూడా గుర్తించలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో ఆత్మహత్య చేసుకున్న 474 మంది రైతు కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్ పరిహారం చెల్లించారని గుర్తు చేశారు.

వెంటిలేటర్‌పై టీడీపీ: సజ్జల




తెలుగుదేశం పార్టీ వెంటిలేటర్‌పై ఉందని, చంద్రబాబు పరిస్థితి కూడా అలాగే ఉందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. ఇదేం ఖర్మరా బాబు అని 2019 ఎన్నికల్లో జనం అనుకున్నారు కాబట్టే చంద్రబాబును, ఆయన పార్టీని చెత్త బుట్టలో పడేశారన్నారు. రాష్ట్రంలో 90 శాతం కుటుంబాలకు సంక్షేమాభివృద్ధి ఫలాలు అందాయని, వారి ఆశీస్సులు తమ ప్రభుత్వానికి ఎప్పటికీ ఉంటాయని చెప్పారు. టీడీపీ నేతల పగటి కలలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.

బీసీలకు బాబు చేసింది శూన్యం

ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు ఎన్.మారేష్

సాక్షి, అమరావతి: బీసీలు అంతా పార్టీలకతీతంగా తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సీఎం వైఎస్ జగన్ వెంటే ఉన్నారని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు ఎన్.మారేష్ చెప్పారు. బీసీల జీవన స్థితిగతులపై ఆదివారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయమే గీటురాయిగా సీఎం జగన్ బీసీలకు రాజ్యాధికారం కల్పిస్తున్నారన్నారు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో బీసీలకు చేసింది శూన్యమని విమర్శించారు. రాష్ట్రంలో ఇదే తరహా సంక్షేమ పాలన కొనసాగితే పేద, ధనిక అంతరాలు తొలగిపోయి సరికొత్త సమాజం ఆవిర్భవిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మోర్ల మహిధర్, మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.



ఒకచోట మనం తాకితే అది భూమిపై ఇం
కొకచోట కదలిక తీసుకువస్తుంది.
– ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ

సాక్షి
సోమవారం, డిసెంబర్, 12

పుస్తకాల రుతువు

ఆ నల్లటి వరుస కట్టిన అక్షరాల వెంట అక్షువులతో వెంబడిస్తే గుత్తులుగా కాసిన మామిడి పండ్ల చెట్టు కింద అశ్వాన్ని వదిలి సేదతీరుతున్న రాకుమారుడు కనిపిస్తాడు. కొమ్మపై కూచున్న జంట పక్షులు ఏవో అతనికి తెలియాల్సిన రహస్యం మరికాసేపట్లో చెవిన ఊదుతాయి. నల్లటి వరుస కట్టిన ఆ పంక్తుల వెంట పరిగెడితే కొత్త పెళ్లికూతురిని శోభనం రాత్రి చంపడమే వ్రతంగా పెట్టుకున్న రాకుమారుడు ఆ పెళ్లికూతురు మొదలెట్టిన గొలుసు కథల్లో గుడ్లు తేలేసి వ్రతం మరిచి 'ఆ తర్వాత?' అనే ప్రశ్నతో జీవితాంతం బతుకు వెళ్లమార్చడం చూస్తాము. కాగితం మీద వరుస కట్టిన పంక్తులు రాముడు కానలకు వెళ్లాక కౌసల్య పడిన శోకమెట్టిదన్న ఆలోచనను ఇస్తాయి. బోధిచెట్టు కింద దేహాన్ని క్షోభ పెట్టుకుంటున్న సిద్ధార్థుని సాక్షాత్కారం కోసం వేచి చూడమంటాయి. కరకు పళ్లు దిగబడి కాలి విముక్తి కోసం ఘీంకారం చేస్తున్న గజేంద్రుని మోక్షానికి శంఖు చక్రాలు వదిలి శ్రీ మహావిష్ణువును పరిగెత్తమంటాయి. రామలింగడు ఈ పంక్తులు పలకడానికే అంబ ఇచ్చిన ఒక చేతి పాలు, మరో చేతి పెరుగును కలిపి గొంతులోకి ఒంపుకున్న వైనం చెబుతాయి. పుటలు కొన్ని శ్రీనాథుని పల్లకీ మోస్తాయి. పుటలు కొన్ని పేదవాడి తెల్లని నవ్వును మల్లెలుగా విరబూస్తాయి. పుటల నిండా వీరుని ధీరకంపనం... వనిత దీక్షా కంకణం... పసిపిల్లల కేరింతలు... యువతీ యువకుల సల్లాపాలు... కన్నీటి ఉప్పదనం... త్యాగపు శౌర్యము... భీరువు ఆక్రందన... ఆలోచనల అలజడి... తేజోమూర్తి జీవన సందేశము.

ఒక దేశ 'తలసరి ఆదాయం' ఎలా గణిస్తారోగాని ఒక దేశ 'తలసరి సంస్కారం' సగటున ఆ దేశ పౌరుడు చదివిన పుస్తకాల సంఖ్యను బట్టి అవి ఎలాంటి పుస్తకాలన్న నాణ్యతను బట్టి గణించాలి. ఆహార కొరత వస్తేనో, విదేశీ మారకద్రవ్యం అడుగంటితేనో, ద్రవ్యోల్బణం విజృంభిస్తేనో మాత్రమే ఆ దేశం ప్రమాదంలో పడినట్టు కాదు. ఏ దేశ ప్రజలైతే నిజంగా పుస్తకాలు చదవడం మానేస్తారో, ఇంట పుస్తకాల అల్మారా లేకుండా జీవిస్తారో, 'పుస్తకమా అది ఏమి' అని ఫోన్ స్క్రీన్‌లో తల కూరుస్తారో ఆ దేశం నిజంగా ప్రమాదంలో పడినట్టు!

వస్తు ప్రపంచం కంటే పుస్తక ప్రపంచం మేలైనది. ఇంట టివి, ఫ్రిజ్జు, కారు, ఐఫోన్ ఎన్ని కొన్నా మరోటేదో కావాలన్న అత్యాశను, పేడలో పడవేసే పేరాశను కలిగిస్తాయి. పుస్తకాలు? నీ పాదాలకు లేపనం రాసి హిమానీనదాల వరకూ తీసుకెళతాయి. నీ చీకటి కవాటాలను తెరిచి వెలుతురు వాకిళ్ల ఎదుట నిలబెడతాయి. నీ మూఢవిశ్వాసాలకు నువ్వే నవ్వుకునేలా చేస్తాయి. చైతన్యాన్ని కలిగించి నీ నిజస్థితి మీద అంచనా కట్టిస్తాయి. ద్వేషంతో, హైన్యంతో, వ్యవస్థీకృత దుర్లక్షణాలతో బతకాలన్న నీ పట్టుదలను అవి హరిస్తాయి. పుస్తకాలు నిన్ను పెట్రోలు కొట్టించమనవు. ఫుడ్డు ఆర్డర్ పెట్టమనవు. విలాసాలు అమేజాన్ చేయమనవు. అవి కోరేదల్లా తెరిచి చదవమనే!

రెండు రాష్ట్రాల్లో 9 కోట్ల తెలుగు జనాభా. ఏ పుస్తకమూ 500 కాపీలు అమ్ముడు పోదు. అంటే కోటికి 100 మంది కూడా పుస్తకాలు కొనరు. సినిమా హీరోల కొరకు టికెట్టు రికార్డు స్థాయిలో కొంటారు. 'నెక్స్ట్ సినిమా ఏమిటి?' అని అడుగుతారు. 'నువ్వు చదివిన పుస్తకం చెప్పు' అని ఏ హీరోనీ ఎవరూ అడగరు. శ్రీమంతురాలైన సుధామూర్తి తానే శ్రీమంతులుగా భావించే ఒకరి ఇంటికి వెళ్లిందట. 'అబ్బబ్బ... ఆ ఇంట మణిమాణిక్యాలు వజ్రవైఢూర్యాలు.. బంగారు సింహాసనాలు... అమూల్య కళాకృతులు... ఒక్కటే లోపం. ఒక్క పుస్తకం కనపడలేదు' అని రాసింది. ఇలాంటి పేదరికంలో ఉన్న శ్రీమంతులు మనలో ఎందరు? పూర్వం తెలుగు ఇళ్లల్లో తప్పనిసరిగా ఎక్కాల పుస్తకం ఉండేది. శతకాలు ఉండేవి. పెద్ద బాలశిక్ష అయినా కనిపించేది. ఒక చిన్న గూటిలో ఇవి కూడా లేని స్థితికి తెలుగుజాతి ఎగబాకింది

10 వేల మంది తెలుగు కవులు ఉన్నారు. పక్క కవి పుస్తకం కొనరు. 5 వేల మంది తెలుగు కథకులు ఉన్నారు. పక్క రచయిత సంకలనం కొనరు. పాఠకుల మీద వంక పెడుతుంటారు. మొదట వీరే పుస్తకాలు కొనరు. రచయిత అంటే ఎవరు? సీనియర్ పాఠకుడు! మంచి కవి కావాలన్నా, మంచి కథకుడు కావాలన్నా మొదట జీవితంలో పాల్గొనాలి అనుభవం కోసం. తర్వాత పుస్తకాలు చదవాలి సాధన కోసం. జీవన స్పర్శ, పుస్తకాల సంపర్కం లేని శుష్కకవులతో, కథకులతో నిండి ఉంది నేటి మెజారిటీ తెలుగు సమాజం. ఇక మన పాఠకులు 'మా పిల్లలు తెలుగు చదవరు'... 'మాకు ఈ కథలు, కవిత్వం పడవు' అంటూ ఉంటారు. నీకు రోటి పచ్చడి ఇష్టమైతే కనీసం రోటి పచ్చళ్ల మీద వచ్చిన పుస్తకమైనా కొను. ఇంట పుస్తకంగా కనపడుతూ ఉంటుంది.

డిసెంబర్ 22 నుంచి జనవరి 1 వరకు హైదరాబాద్‌లో పుస్తకాల రుతువు. అంటే బుక్ ఎగ్జిబిషన్. వందలాది స్టాళ్లు, వేలాది పుస్తకాలు, ఆవిష్కరణలు, ఉపన్యాసాలు, సాహితీకారుల దర్శనం, మిత్రుల కరచాలనం, చలిగాలుల్లో ఛాయ్‌తో చేసే కబుర్లు. తెలుగులో ఎందరో రచయితలు, కవులు, బుద్ధిజీవులు... ఈ బుక్ ఎగ్జిబిషన్‌కు తరలివచ్చే పాఠకుల మీద నమ్మకంతో కొత్త పుస్తకాలను విడుదల చేస్తున్నారు. పాత క్లాసిక్స్‌ను రీప్రింట్ చేస్తున్నారు. 'ఈ పుస్తకాలు చదివి ఆనందించండి, ఆస్వాదించండి, ఆలోచించండి' అని కొమ్ముబూర ఊది మరీ మొరపెట్టుకోనున్నారు.

ఈ రుతువులో పాలుపంచుకోండి. పుస్తకాల చెట్టు నీడ ప్రతి ఇంటా పడుగాక!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.చవితి ప.3.41 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పుష్యమి రా.9.21 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.14 నుండి 12.58 వరకు, తదుపరి ప.2.26 నుండి 3.10 వరకు, **అమృతఘడియలు:** ప.2.15 నుండి 3.42 వరకు; **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం** 6.24 ; **సూర్యాస్తమయం** 5.23.

ఇక భారతీయ అస్మిత!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

గుజరాతీ 'అస్మిత' (ఆత్మగౌరవం) పులకించిపోయింది. ఆ పులకింత వెల్లువలో ఏడో వరస విజయం బీజేపీ ఒడిలోకి వచ్చి పడింది. గుజరాత్‌లో కనిపించే ఎత్తయిన విగ్రహం సర్దార్ పటేల్‌దే కావచ్చు. కనిపించని ఎత్తయిన విగ్రహం ఇప్పుడు గుజరాతీ అస్మిత. అది పులకించకుండా ఎలా ఉంటుంది? గుజరాతీ బిడ్డ నరేంద్ర మోదీ దేశంలో తిరుగులేని నాయకుడిగా కొనసాగుతున్నారు. నెంబర్ టూగా మరో గుజరాతీ సేట్ అమిత్‌షా చక్రం తిప్పుతున్నారు. వారిద్దరి ప్రభావం ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థను గుజరాతీ వ్యాపారులు నడిపిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులు అనేకం దేశంలోని ఇతర ప్రాంతాలకు జెల్లకొట్టి గుజరాత్ బాట పడుతున్నాయి. దేశవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు 'కెమ్ చో' (ఎలా ఉన్నావ్) వంటి కొన్ని గుజరాతీ మాటలు నేర్చుకుంటున్నారు. మాట్లాడుతున్నారు.

గుజరాతీ అస్మితకు ఇంతకంటే ఏంకావాలి? మధ్యతరగతి మందహాసం చేస్తున్నది. ఉన్నత వర్గాలు మీసం మెలేస్తున్నాయి. దరిద్రనారాయణుల 'న్యూసెన్స్' గురించి ఆలోచించే ఓపిక ఇప్పుడు అస్మితకు లేదు. మోర్బీ వంతెన కూలిపోయింది. అయితే ఏమిటి? వందమందికి పైగా చనిపోయారు. రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనం, అధికారుల అవినీతి ఈ విషాదానికి కారణం. అఫ్‌కోర్స్! ప్రపంచ రాజ్య కూటముల్లో ఎలైట్ క్లబ్‌గా పరిగణించే జీ–20కి ఇప్పుడు గుజరాతీ బిడ్డ నరేంద్రభాయ్ నేతృత్వం వహిస్తున్నారు. ఏది ముఖ్యం? ఇంతకంటే ఎక్కువ దేశాలు సభ్యులుగా ఉన్న అలీనోద్యమానికి పండిత నెహ్రూ, ఇందిరాగాంధీ నాయకులుగా ఉన్నారు. ఇది రొటేషన్ పదవే కనుక వారు పెద్దగా పటాటోపాన్ని ప్రదర్శించలేదు. కానీ గుజరాతీలు వ్యాపార ప్రవీణులు. దీన్ని కూడా బ్రాండింగ్ చేసుకున్నారు. ఈ బిల్డప్‌ను 'అస్మిత' ఆమోదించింది.

గుజరాతీ అస్మిత వేసిన తెరలకు ఆవల కూడా కొంత గుజరాతీ సమాజం ఉన్నది. అక్కడా ఓట్లుంటాయి. వాటికి ఏకైక హక్కుదారుగా ఉండవలసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దీనస్థితికి దిగజారింది. అహ్మద్ పటేల్ మరణం తర్వాత అది అనాథగా మారిపోయింది. కాంగ్రెస్ నిస్తేజమవడంతో దాని ఓట్లను కొల్లగొట్టడానికి చీపురుకట్ట తీసుకుని ఆమ్ ఆద్మీ పార్టీ రంగంలోకి దిగింది. పదమూడు శాతం కాంగ్రెస్ ఓట్లను చీల్చగలిగింది. 'ఆప్' చీల్చిన ఓట్ల కారణంగా సౌరాష్ట్ర ప్రాంతంలో 18 మంది కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో గుజరాత్ చరిత్రలో ఎన్నడూ ఎరగనంత ఘనవిజయం బీజేపీకి సాధ్యమైంది.

వరసగా ఏడు ఎన్నికల్లో విజయం సాధించడం అసాధారణమైన విషయమే. సీపీఎం నాయకత్వంలో లెఫ్ట్ కూటమి ఒక్కటే ఇప్పటివరకూ బెంగాల్‌లో ఆ ఘనతను సాధించింది. ఇప్పుడు బీజేపీ ఆ రికార్డును సమం చేసింది. ఏడవసారి గెలవడం, 52.5శాతం ఓట్లను కొల్లగొట్టడం, 156 (182లో) సీట్లు సాధించడం స్వప్నతుల్యమైన విజయమే. బెంగాల్‌లో సీపీఎం కూటమి ఏడోసారి గెలిచినప్పుడు కూడా 50.5 శాతం ఓట్లు సాధించింది. ఇప్పుడు గుజరాత్‌లో 10 పార్టీలు రంగంలో ఉంటే, అప్పుడు బెంగాల్‌లో 30 పార్టీలు పోటీలో ఉన్నాయి. ఈ అంశాన్ని గమనంలోకి తీసుకుంటే రెండు విజయాలూ సమానమైనవే. కానీ, నేటి గుజరాత్ విజయాన్ని కనీవినీ ఎరుగని సునామీగా మేళతాళాలు మోగిస్తూ మీడియా ప్రకటించింది. ఇందులో పావలా వంతు ప్రాధాన్యం కూడా నాటి లెఫ్ట్ విజయానికి దక్కలేదు. దటీజ్ బీజేపీ!

జాతీయ స్థాయిలో నరేంద్ర మోదీతో పోల్చదగిన మరో నాయకుడు ప్రచారంలో లేడన్నమాట నిజం. ఆయన రాజకీయ కెరీర్‌లోనే ఇప్పుడు ఉచ్చదశలో ఉన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఆయన మేజిక్ ఎంతోకొంత పనిచేసే అవకాశం కూడా ఉన్నది. అయితే రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికల్లో అది పనిచేయాలన్న నియమం లేదు. హిమాచల్‌ప్రదేశ్ ఫలితాలు ఈ అంశాన్ని నిర్ధారించాయి. ఈ రాష్ట్రం బీజేపీకి అనుకూలమైనదే. అసెంబ్లీ ఎన్నికల్లో చెరో అవకాశం ఇస్తున్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి అనుకూలంగానే ఉంటున్నది. 2019 ఎన్నికల్లో కమలం పార్టీకి రికార్డు స్థాయిలో ఓట్లను కురిపించింది. సైనిక దళాల్లో ఈ రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున పనిచేస్తుంటారు. కేంద్రం ప్రకటించిన 'అగ్నిపథ్' కార్యక్రమాన్ని వీరు వ్యతిరేకిస్తున్నారు. దానివల్ల తమ ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని వారు భావిస్తున్నారు. యాపిల్స్ పండించే రైతాంగం సంక్షోభంలో కూరుకొనిపోయింది. రైతాంగ సమస్యను బీజేపీ పట్టించుకోకపోవడం మైనస్‌గా మారింది. జై జవాన్ – జై కిసాన్‌లిద్దరూ బీజేపీ ఓటమికి కారకులయ్యారు. మోదీ నాయకత్వం, హిందూత్వ, జాతీయవాదం వంటి అంశాలపై మెజారిటీ హిమాచలీయులకు ఎటువంటి పేచీ లేదు. కానీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి స్థానిక అంశాల ఆధారంగానే వారు స్పందించారు.

ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌ను ఏకధాటిగా పదిహేనేళ్ల పాటు కమలం పార్టీ ఏలింది. మొన్న జరిగిన ఎన్నికల్లో 'ఆప్'కి తలవంచక తప్పలేదు. 'ఆప్' ప్రస్తావించిన స్థానిక అంశాలపైనే ఓటర్లు స్పందించారు తప్ప మోదీ బొమ్మను పట్టించుకోలేదు. మునిసిపల్ అధికార యంత్రాంగంలో పేరుకొనిపోయిన అవినీతిని పెకిలిస్తామని 'ఆప్' ప్రచారం చేసుకున్నది. వీధి కుక్కల బెడద మీద చర్యలు తీసుకుంటామని చెప్పింది. వీధి వ్యాపారులను లంచాల నుంచి కాపాడతామని చెప్పింది. రోడ్లకు మరమ్మతులు చేయిస్తామని చెప్పింది. మునిసిపల్ స్కూళ్లను అభివృద్ధి చేస్తామని చెప్పింది. ఈ సాదాసీదా హామీల వైపే ఓటర్లు మొగ్గు చూపారు. ఈ ఎన్నికలతోపాటు ఆరు అసెంబ్లీ స్థానాలకు, ఒక లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీకి చేదు ఫలితాలే వచ్చాయి. ఒక్క గుజరాత్‌లో అఖండ విజయం సిద్ధించినా, హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల్లో, ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికల్లో, వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉపఎన్నికల్లో భంగపాటే ఎదురైంది.

ఈ నేపథ్యంలో వచ్చే సంవత్సరంలోగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ ఎదుర్కోవలసి ఉన్నది. డబుల్ ఇంజిన్ వ్యూహం హిమాచల్‌లో పనికిరాలేదు. గుజరాతీలు తమ ముఖ్యమంత్రిగా కూడా మోదీయే ఉన్నట్టు భావిస్తున్నారు. కనుక వారి దృష్టిలో అక్కడున్నది సింగిల్ ఇంజనే! విఫలమైన ఈ వ్యూహాన్ని వచ్చే ఐదు రాష్ట్రాల్లో మళ్లీ అనుసరిస్తారా? పైగా సాధారణ ఎన్నికలకు ఏడాది వ్యవధి లోపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్ని డ్రెస్ రిహార్సల్‌గా పరిగణిస్తారు. సాధారణ ఎన్నికల ఆహార్యాన్ని ఎంతోకొంత ఈ ఎన్నికల్లో ప్రదర్శించవలసి ఉంటుంది. ఆయా రాష్ట్రాల స్థానిక అంశాలపై విస్తృత చర్చ జరగకుండా ఒక జాతీయ ఎజెండా, వీలైతే భావోద్వేగపూరితమైన అంశం చుట్టూ ప్రచారం కేంద్రీకృతమయ్యేలా బీజేపీ ప్రయత్నిస్తుంది. రాష్ట్రాల స్థానిక అంశాలపై చర్చలో బీజేపీ ఇరుక్కోవడమంటే మొసళ్ల మడుగులో గజేంద్రుడు పాదం మోపినట్టే! అప్పుడు 'సిరికింజెప్పి, శంఖ చక్రములు' సంధిస్తూ మోదీ వచ్చి వాలినా చేయగలిగిందేమీ ఉండదు. కనుక ఈ వేసంగిలో జరిగే కర్ణాటక ఎన్నికల నాటికే బీజేపీ సరికొత్త ఎజెండా శాంపుల్ బయటకు రావాల్సి ఉంటుంది. ఇక్కడ బీజేపీకి ఊరట కలిగించే విషయం ఒకటున్నది. వచ్చే యేడు ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లోనూ బీజేపీ జాతీయ పార్టీలతోనే తలపడనున్నది. నాలుగు రాష్ట్రాల్లో వృద్ధ కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి. తెలంగాణలో నిన్ననే జాతీయ పార్టీగా ప్రకటించుకున్న బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థి. కనుక తన కొత్త ఎజెండాపై డ్రెస్ రిహార్సల్ చేయడం సులభం.

ఈసారి బీజేపీ ఏ నినాదంతో ముందుకు రావచ్చు? హిందూత్వ? జాతీయవాదం? ఆర్థికాభివృద్ధి? అన్నీ గుదిగుచ్చిన భారతీయ అస్మిత హారం? భారతీయ ఆత్మగౌరవ విజయాన్ని ఎలుగెత్తి చాటేందుకు సాధించిన విజయాలేమున్నాయి? హిందూత్వ అంశం తప్పకుండా ఉంటుంది. దండలో దారం మాదిరిగా ఇప్పుడూ ఉన్నది. ఇకముందు కూడా ఉంటుంది. బీజేపీ భౌతిక రూపాన్ని నడిపించే నాడీ మండలం ఆర్ఎస్ఎస్ అనే విషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాల్లేవు. భారత రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ సభలో డాక్టర్ అంబేడ్కర్ ప్రవేశపెట్టిన మరుసటిరోజే ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' దానిపై స్పందించింది. ఈ రాజ్యాంగంలో భారతీయతే లేదని అభిశంసించింది. మనుధర్మ శాస్త్రంలోని అంశాలను రాజ్యాంగంలో జొప్పించకపోవడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భారత రాజ్యాంగానికీ, ప్రజాస్వామ్యానికీ మూల సూత్రాలని డాక్టర్ అంబేడ్కర్ నొక్కి చెప్పారు. సమానత్వం అనేది భారతీయ భావన కాదంటారు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురు గోల్వాల్కర్. భిన్నవర్గాల మధ్య సామరస్యతే భారతీయత అనేది ఆయన వాదన. ఇప్పుడు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ప్రవేశం ఫలితంగా అంబేడ్కర్ ప్రవచించిన రాజ్యాంగ మౌలిక ఆశయానికి దెబ్బతగిలిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు కూడా ఇదే అభిప్రాయాన్ని ప్రకటించారు. అంటే ఆట మొదలైనట్టే కదా!

భారతదేశం ఫెడరల్ వ్యవస్థగా ఉండటాన్ని ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిస్తున్నది. గురు గోల్వాల్కర్ తన రచనల్లో ఫెడరల్ వ్యవస్థను గట్టిగా వ్యతిరేకించారు. దేశమంతా ఏకచ్ఛత్ర పాలన కింద, ఏకభాష (హిందీ), ఏకైక మతం (హిందూ)తో వర్ధిల్లాలనేది వారి ఆశయం. కొత్త పన్నుల విధానం (జీఎస్టీ), కొత్త విద్యావిధానాలను (ఎన్ఇపి) కూడా రాష్ట్రాల అధికారాలను కత్తిరించడానికి, వాటిని బలహీనపరచడానికి ఉపయోగిస్తున్న వైనం కనబడుతూనే ఉన్నది. ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ, ఎన్ఆర్సీ, హిజాబ్ నిషేధం వంటి పరిణామాల వెనుక హిందూత్వ ఎజెండా కనిపిస్తూనే ఉన్నది. గోహత్యా పాతకులుగా ముద్రవేయడం ద్వారా ఒక మతావలంబుల్ని సమాజానికి దూరంగా నెట్టే ప్రయత్నమూ కట్టెదుటే ఉన్నది. కనుక హిందూత్వ ఎజెండా ఇప్పటికీ ఉన్నది. ఇంకా బలంగా ఉండబోతున్నది.

మనదేశంలో తొంబయ్యవ దశకం ప్రారంభంలో మొదలైన ఆర్థిక సంస్కరణలు కేవలం ఆర్థిక వ్యవస్థనే మార్చలేదు. సామాజిక, రాజకీయ వ్యవస్థలను కూడా ఆసాంతం మార్చి వేశాయి. ఎనభయ్యో దశకం తర్వాత పుట్టిన వాళ్లను 'మిలీనియల్స్' అంటున్నారు. ఈ మిలీనియల్స్, పోస్ట్ మిలీనియల్స్ తరాల్లో చరిత్ర, సమాజ పరిణామ శాస్త్రాల అధ్యయనం మృగ్యమైంది. అందువల్ల భావోద్వేగపూరితమైన, మతపరమైన, కులపరమైన అంశాలకు సులభంగా ప్రభావితమవుతున్నారు. ఈ పరిణామం కూడా బీజేపీ ఎదుగుదలకు బాగా ఉపయోగపడింది. సోషల్ మీడియాపై ఆ పార్టీకి ఉన్న పట్టు కారణంగా ఇకముందు కూడా ఉపయోగపడుతుంది. కనుక హిందూత్వ ఎజెండా ఇకముందు కూడా బలంగా ఉండబోతున్నది.

కేవలం హిందూత్వ కార్డుతోనే ఎన్నికలకు వెళ్లడం కుదరదు కాబట్టి అందులో జాతీయ వాదాన్ని మిక్స్ చేసి, ఆర్థికాభివృద్ధితో గార్నిష్ చేసుకుని ఎజెండాను వడ్డించవచ్చు. సరిహద్దుల్లో బలవంతుడైన చైనావాడితో ఢీ అంటే ఢీ అనడం, ఆక్రమిత కశ్మీర్‌ను హస్తగతం చేసుకుంటామని ప్రకటనలు చేయడం జాతీయ భావాలను ప్రేరేపితం చేసే కార్యక్రమాలే! అంతర్జాతీయ యవనికపై ప్రముఖ పాత్రను పోషించడానికి మోదీ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నది. ఆర్థికాభివృద్ధిని గురించి ఉటంకించడానికైతే గణాంకాలు అందుబాటులోనే ఉన్నాయి. 2014లో రెండు ట్రిలియన్ డాలర్లుగా ఉన్న జీడీపీ 2022 నాటికి మూడున్నర ట్రిలియన్ డాలర్లకు చేరింది. తలసరి ఆదాయం లక్ష రూపాయల నుంచి రెండు లక్షలకు పెరిగింది. భారత ఆర్థిక వ్యవస్థ బ్రిటన్‌ను దాటేసి ఐదో స్థానంలోకి చేరింది.

అయితే మానవ అభివృద్ధి సూచికలో మాత్రం దేశం 130వ స్థానం నుంచి 132కు దిగజారింది. మరి బలపడిన ఆర్థిక వ్యవస్థ మానవ అభివృద్ధికి ఎందుకు ఉపకరించలేదు? సృష్టించిన సంపద అంతా ఎక్కడికి వెళ్లింది? ఆక్స్‌ఫామ్ ఇండియా రిపోర్టులో సమాధానం దొరుకుతుంది. సంపద అంతా పిడికెడుమంది చేతిలో కేంద్రీకృతమై ఉన్నది. 80 శాతం సంపద 10 శాతం శ్రీమంతుల చేతిలో ఉన్నది. అందులోనూ ఒక్కశాతం కుబేరుల చేతుల్లో 55 శాతం సంపద కేంద్రీకృతమై ఉన్నది. అయినప్పటికీ జీడీపీలోనూ, తలసరి ఆదాయంలోనూ పెరుగుదల కనిపిస్తున్నది కదా? అంబానీ ఆదాయం లక్షకోట్లు, అప్పారావు ఆదాయం లక్ష రూపాయలనుకుందాం. ఇద్దరి తలసరి ఆదాయం యాభై వేల కోట్ల యాభైవేల రూపాయలు అవుతుంది కదా! ఈ సంగతి తెలిస్తే అప్పారావు మూర్ఛపోతే పోవచ్చు గాక! లెక్క లెక్కే కదా! ఈ లెక్క ప్రకారం ఇండియా ఈజ్ షైనింగ్. ఈ నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వాజపేయి ప్రభుత్వం గతంలో దెబ్బతిన్నది. కనుక ఈ షైనింగ్‌లో ఈసారి హిందూత్వ మెరుపులు, జాతీయ తళుకులూ ఉండవచ్చు. ఇదొక సంభావ్యత మాత్రమే! కొత్త జాతీయ పార్టీగా ప్రకటించుకున్న బీఆర్ఎస్ రైతు రాజ్యాన్ని ఎజెండాగా ప్రకటించుకున్నది. కొత్తగా జాతీయ పార్టీ హోదా సాధించిన 'ఆప్'కు 'అవినీతి' బాణం ఉండనే ఉన్నది. కాంగ్రెస్ సంగతేమిటో ఆ పార్టీలోనే ఇంకా ఎవరికీ తెలియదు. మూడు నాలుగు పాయలుగా చీలిన ప్రతి పక్షం మురిపిస్తుండగా బీజేపీ మెరిపించబోయే ఎజెండా కోసం దేశం ఎదురుచూస్తున్నది.

vardhelli1959@gmail.com

ప్రజల కోణం నుంచి చూస్తే...

అభిప్రాయం



డా॥ గోపరాజు నారాయణరావు

డిసెంబర్ 8న వెలువడిన గుజరాత్ శాసనసభ ఎన్నికల ఫలితాలు వివిధ కోణాల నుంచి చారిత్రకంగా విశేష ప్రాధాన్యం కలిగి ఉంటాయి. ఆ రాష్ట్ర చరిత్రలో ఒకే రాజకీయ పార్టీకి 156 శాసనసభ స్థానాలు లభించడం మొదలు, వరసగా ఏడవసారి అధికారంలోకి రావడం వరకు ఐదారు కీలక అంశాలు ఉన్నాయి. ఈ ఫలితాలతో పాటే వెలువడిన హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల ఫలితాలు ఆ రాష్ట్ర సంప్రదాయాన్ని పునరావృతం చేశాయి. అక్కడ ఒక పార్టీకి రెండుసార్లు వరసగా అధికారం ఇచ్చే పద్ధతి లేదు. 25 స్థానాలకు పరిమితమైన బీజేపీ, 40 స్థానాలు సాధించిన కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తున్నది. ఓడిన పార్టీల నేతల నోటి నుంచి వచ్చే మొదటిమాట గెలుపోటములు రాజకీయాలలో సహజం. యాపిల్ సాగు శాసించే హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలలో బీజేపీకీ, కాంగ్రెస్‌కీ ఓట్లలో తేడా ఒక శాతం కంటే తక్కువ. దీనితో బీజేపీ ఓడినా గెలిచినట్టే. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఘనతలు బీజేపీ అండతో పోరాడిన ప్రధాని నరేంద్ర మోదీవే. ఈ ఫలితాలు చూసిన తరువాత తప్పక వేసుకోవలసిన ప్రశ్న ఈ ఎన్నికల నుంచి వాస్తవాలు గ్రహించ వలసిన వారు నిజంగా ఎవరు? బీజేపీ వ్యతిరేకత తప్ప మరొక ఎజెండా జోలికిపోని రాజకీయ పార్టీలా? ప్రజా తీర్పు ప్రజాతీర్పే, బీజేపీ పట్ల మా గుడ్డి వ్యతిరేకత మాదే అన్న ధోరణిలో ఉండిపోతున్న మేధావులూ, ఉదార వాదులా?

మేం ప్రజాతీర్పును గౌరవిస్తున్నామంటూ రాజకీయ పార్టీలు చూపిస్తున్న కనీస మర్యాదను మేధావులుగా, ఉదారవాదులుగా చలామణీ అవుతున్నవారు చూపిస్తున్నారా అంటే సమాధానం దొరకదు. వీరందరి అభిమతం ప్రజాస్వామ్య పరిరక్షణే కావచ్చు. దానిని శంకించనక్కర లేదు. కానీ ప్రజాతీర్పును గౌరవించడం దగ్గర బీజేపీ యేతర శిబిరం ప్రదర్శిస్తున్న ఆత్మహత్యాసదృశమైన వైఖరి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయలేదు. వీరు ఒక రాజకీయ పార్టీ మీద, ఒక దేశ సార్వభౌమాధికారం మీద విమర్శల విషయంలో ఉండవలసిన లక్ష్మణరేఖను విస్మరిస్తున్నారు. ముస్లింల మీద జరిగిన కొన్ని దాడులను చూపిస్తూ హిందూ మెజారిటేరియన్ వాదాన్ని అంతర్జాతీయంగా రుద్దాలన్న ప్రయత్నం పట్ల సాధారణ భారతీ యులు ఆగ్రహంతో ఉన్నారని 2019 లోక్‌సభ ఎన్నికలు, తాజా గుజరాత్ ఎన్నికలలో రికార్డు స్థాయి ఫలితాలు చెప్పాయి. ఈ మేధావులు కష్టపడి నిర్మిస్తున్న హిందూ మెజారిటేరియన్ సిద్ధాంతం ముస్లింలకు రక్షణ కల్పించేది కాదు. నిజానికి మైనారిటీలకు అనాలి. కానీ వీరు మైనారిటీ అంటే కేవలం ముస్లింలు అనే అభిప్రాయాన్ని కలిగిస్తున్నారు. ఇదే హిందూ ఫోబియాకు జన్మనిచ్చింది. అది బీజేపీకి ఉపయోగపడుతోంది.

సాధారణ హిందువు, సాధారణ ముస్లిం కోరుకునేది శాంతినే! పీఎఫ్ఐ లాంటి పచ్చి హిందూ, భారత వ్యతిరేక సంస్థల ప్రభావంలో పడినవారు తప్ప సాధారణ ముస్లింలు మత కల్లోలాలను కోరుకోరు. బీజేపీ పాలనలో నిస్సందేహంగా మత కల్లోలాలు లేవు. ఢిల్లీ మత కల్లోలాలు, దసరా సందర్భంగా జరిగిన తాజా అలజడులు పీఎఫ్ఐ వంటి సంస్థల



కారణంగానే జరిగాయి. అది ఇంటెలిజెన్స్ సమాచారం కూడా. ఆ వర్గం నుంచి ఒక్క అభ్యర్థిని కూడా నిలపకున్నా, గుజరాత్ తాజా ఫలితాల ప్రకారం ముస్లింలు అత్య ధికంగా ఉన్న 19 నియోజక వర్గాలలో 17 బీజేపీకి దక్కాయి. బీజేపీ పట్ల తమకు గుడ్డి వ్యతికత అయితే లేదని వారే ప్రకటించి నట్టయింది.

గుజరాత్ శాసనసభలో ముస్లింల సంఖ్య తగ్గడం ఇవాళ్టి పరిణామం మాత్రం కాదు. 1980 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో 12 మంది ముస్లింలు చట్టసభకు వెళ్లారు. అప్పుడే కాంగ్రెస్ పార్టీ 'ఖామ్' పేరుతో ఒక ఓటుబ్యాంక్ సమీకరణను తెర మీదకు తెచ్చింది. అదే క్షత్రియ, హరిజన్, ముస్లిం, ఆదివాసీ, ముస్లిం సమీకరణ. గడచిన ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు మహమ్మద్ జావెద్ ఫిర్జాదా, ఖియాజుద్దీన్ షేక్, ఇమ్రాన్ ఖెడావాలా గెలిచారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ ఆరుగురు ముస్లింలను అభ్యర్థులుగా నిలిపింది. వీరిలో ఖెడావాలా మాత్రమే బీజేపీ, ఎఐఎంఐఎం సవాళ్లను ఎదుర్కొని సభలో ప్రవేశించబోతున్నారు. గుజరాత్‌తో సంబంధం లేకున్నా, ఈ ఎన్నికలతో పాటే జరిగిన రాంపూర్ (ఉత్తరప్రదేశ్) నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితం గురించి చెప్పడం అసందర్భం కాబోదు. ముస్లింలు అధిక సంఖ్యలో ఉండే ఈ నియోజకవర్గంలో ఏడు దశాబ్దాలుగా ముస్లిం అభ్యర్థులే గెలుస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆజంఖాన్ మీద క్రిమినల్ కేసులు, అరెస్టు తదితర కారణాలతో పదవి రద్దయింది. దీనితో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ తరఫున అసీమ్ రజా బరిలో ఉండగా, బీజేపీ అభ్యర్థిగా ఆకాశ్ సక్సేనా నిలిచారు. సక్సేనా 33,000 భారీ ఆధిక్యంతో సమాజ్‌వాదీ అభ్యర్థిని ఓడించారు.

గుజరాత్ మోర్బీ వంతెన కూలిన ఘటన, దానితో 135 దుర్మరణం పాలైన సంగతిని ఒక వర్గం మీడియా మృతుల మీద సానుభూతిగా కంటే, బీజేపీకి వ్యతిరేకాస్త్రంగానే భావించినట్టు కనిపిస్తుంది. ఆ ఘటన బీజేపీ గెలుపు మీద ప్రభావం చూపుతుందని ప్రచారం చేసింది. ఆ జిల్లాలో (మోర్బీ) మూడు అసెంబ్లీ నియోజక వర్గాలు మోర్బీ, టంకారా, వాంకనేర్ ఉన్నాయి. వీటిని 2017 ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచింది. కానీ ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ ఈ స్థానాలను గెలుచుకుంది

బీజేపీ విజయాన్ని... కాంగ్రెస్ ఓట్లు చీల్చడం, హిందూత్వ వంటి అసహజ విశ్లేషణలతో తక్కువ చేయడానికి ప్రయత్నించడం కూడా ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం కానేకాదు. మరి హిమాచల్‌లో జరిగిన దానిని ఏమనాలి? బీజేపీ ఓటును 'ఆప్' చీల్చినందునే కాంగ్రెస్ గెలిచిందంటే ఒప్పుకుంటారా? బీజేపీని ప్రస్తుతం ప్రజలు ఆదరిస్తున్నారు. దీనిని అంగీకరించడమంటే... బీజేపీని బలోపేతం చేయడం కాదు, ప్రజాతీర్పును గౌరవించడం! ఆ పార్టీని సిద్ధాంతపరంగా వ్యతిరేకించడమనేది రాజ్యాంగ హక్కు. ఈ రెండింటినీ గుర్తించాలి.

ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి, పౌరసత్వ సవరణ చట్టం వీటన్నిటికీ రాజ్యాంగ ఆమోదం ఉంది. కానీ వీటన్నిటిలోనూ మైనారిటీ వ్యతిరేకతనే మేధావులు వెతకడానికి ప్రయత్నించారు. దేశ ప్రయోజనాల కోసం ఏ అడుగు వేసినా, ఏది చేసినా బీజేపీని బోనులో నిలబెట్టే ప్రయత్నం మానడం లేదు. మెజారిటీ ప్రజల మౌనాన్ని వీరు అలుసుగా తీసుకుంటున్న మాట కూడా వాస్తవం. ఆ మౌనం వెనుక ఏమున్నదో ఇప్పటికే ఎన్నో పర్యాయాలు రుజువైంది. బీజేపీని ఓడించడానికి అవాస్తవాలను జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా ప్రచారం చేయడం సాధారణ ప్రజలకీ, యువతరానికీ కూడా మింగుడు పడడం లేదు. పీఎఫ్ఐ, కొందరు మౌల్వీలు చేస్తున్న హిందూ వ్యతిరేక, భారత వ్యతిరేక వ్యాఖ్యలను ఖండించడం దగ్గర మేధావులు, ఉదారవాదులు ప్రదర్శిస్తున్న ఉదాసీన వైఖరి, సెలెక్టివ్ పంథా కూడా మైనారిటీలకూ, మెజారిటీలకూ మధ్య అగాధాన్ని తగ్గించడానికి బదులు పెంచుతోందన్న స్పృహ వారికి లేదు.

ఇప్పుడు అయోధ్య అంశం లేదు. జ్ఞానవాపి, మధుర ఎన్నికల అంశాలుగా లేవు. అయినా బీజేపీ రికార్డు విజయం సాధించింది. కారణం సంక్షేమ పంథా. షాహీన్ బాగ్‌కీ, బీజేపీ వ్యతిరేక రైతు ఉద్యమానికీ ఇచ్చిన గౌరవం ఒక గిరిజన మహిళను రాష్ట్రపతి పీఠం మీద కూర్చోబెట్టినప్పుడు మేధావులు ఎందుకు ఇవ్వలేకపోయారన్న ప్రశ్న సగటు భారతీయుడిని ఎప్పటికీ తొలుస్తూనే ఉంటుంది. పరిణామాలను పక్షపాతం ఆధారంగా విశ్లేషించడం కాదు, ప్రజాతీర్పులు, ప్రజల అభిప్రాయాల కోణం నుంచి చూడాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ! రాజకీయ పార్టీ మీద ఆగ్రహం వ్యవస్థల మీద, ఆ వ్యవస్థలకు సంబంధించిన విలువల మీద ఆగ్రహంగా మారకూడదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

క్లుప్తంగా...

15 నుంచి భవానీ దీక్ష విరమణలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు భవానీ దీక్ష విరమణలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ దీక్ష విరమణలకు రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి ఏడు లక్షల మంది భవానీలు విచ్చేస్తారని దేవస్థానం అంచనా వేసింది. భవానీల కోసం దేవస్థానం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. పుణ్యస్నానాలు, గిరి ప్రదక్షిణ, అమ్మవారి ఆలయానికి చేరుకునేందుకు క్యూలైన్లు, ఇరుముడి సమర్పణ, హోమగుండాలలో నేతి కొబ్బరి కాయల సమర్పణ, ప్రసాదాల విక్రయ కౌంటర్లు వంటివి సిద్ధం చేస్తోంది. దీక్ష విరమణలలో 20 గంటల పాటు భవానీలకు అమ్మవారి దర్శనం కల్పించేలా, అలాగే రద్దీకి అనుగుణంగా దర్శన వేళలు పెంచే అవకాశం ఉంది. దీక్ష విరమణలో 17, 18వ తేదీలు అత్యంత కీలకమని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

17 నుంచి ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

తిరుపతి కల్చరల్: పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 250 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కేటీ రోడ్డులోని శ్రీవరదరాజస్వామి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారులలో ఒకరైన శ్రీగోదాదేవి ధనుర్మాసవ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం ద్వారా దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది.

బేడి ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం



ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ బేడి ఆంజనేయస్వామికి కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఉదయం పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, గంధంతో తిరుమంజనం జరిపి సింధూరంతో అలంకరించారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 13 నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 69,383 మంది స్వామి వారిని దర్శించుకోగా 32,391 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో రూ.3.75 కోట్లు భక్తులు సమర్పించారు. సర్వదర్శనానికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు, ఆర్మీ ఫోర్ట్ స్టేట్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అరుణ్ అనంతరామన్ దర్శించుకున్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం

- సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ



ఎన్వీ రమణను సన్మానిస్తున్న రోటరీ ఇంటర్నేషనల్ సభ్యులు

కొమ్మాది (భీమిలి): విశాల దృక్పథంతో 200 దేశాల్లో నిస్వార్థంగా, సుదీర్ఘకాలంగా రోటరీ ఇంటర్నేషనల్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. రుషికొండలోని రాడిసన్ బ్లూలో నిర్వహిస్తున్న 'రోటరీ ఇంటర్నేషనల్ విశాఖ విస్తా–2022' ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ చిన్నారులకు గుండె ఆపరేషన్లు, పోలియో నిర్మూలన, జలవనరుల పరిరక్షణపై ప్రధానంగా రోటరీ ఇంటర్నేషనల్ దృష్టి పెడుతుందని తెలిపారు. చతుర్ముఖ వ్యూహంతో రోటరీ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు. రోటరీ క్లబ్ అనుసరిస్తున్న ప్రణాళిక రచన, అమలు, పని విధానంలో గుణాత్మక పద్ధతులను పాటించడం ఆదర్శనీయమన్నారు. తమ సేవలను విశ్వవ్యాపితం చేస్తున్న రోటరీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ జెన్నీఫర్ జోన్స్‌ను అభినందించారు. సమాజంలో అసమానతలను పారదోలేందుకు న్యాయ వ్యవస్థ కృషిచేస్తోందని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. సమాజంలో అనేక వ్యవస్థలకు న్యాయమే పునాదిగా నిలుస్తోందన్నారు. మనిషి ప్రవర్తనను నియంత్రించడానికి న్యాయవ్యవస్థ దోహదపడుతుందని తెలిపారు. న్యాయవ్యవస్థ లేకపోతే అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన రోటరీ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర వెరీ గుడ్డు



- పౌల్ట్రీ రైతుకు ఊరట
- ఫారమ్ గేటు వద్ద గుడ్డు ధర రూ.5.25
- రిటైల్ మార్కెట్‌లో రూ.6.50
- రికార్డు స్థాయిలో పెరిగిన ధర
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఇదే రీతిలో ధరలు
- గల్ఫ్ దేశాలకు 20 కోట్ల గుడ్లు ఎగుమతి

సాక్షి, అమరావతి: కోడిగుడ్డు ధర ఊహించని రీతిలో పెరుగుతోంది. ఫారమ్ గేటు వద్ద రికార్డు స్థాయిలో ఒక్కో గుడ్డు ధర రూ.5.25 పలుకుతుండగా.. రిటైల్‌గా రూ.6.50 వరకు విక్రయిస్తున్నారు. ఇదే ధర మరికొంత కాలం కొనసాగితే.. నష్టాల నుంచి గట్టెక్కుతామని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. రాష్ట్రంలో 1,200 కోళ్ల ఫారాలు ఉండగా.. వాటిలో ప్రస్తుతం 5.60 కోట్లకు పైగా కోళ్లున్నాయి. రోజుకు 6 కోట్ల గుడ్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ మేత, ఇతర ధరలు పెరగడంతో కోళ్ల ఉత్పత్తి సంఖ్య తగ్గిపోగా.. రోజుకు 4.75 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్ర పరిధిలో నిత్యం 2.50 కోట్ల నుంచి 3 కోట్ల గుడ్లు వినియోగమవుతున్నాయి. కాగా, దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు గల్ఫ్ దేశాలకు కోడిగుడ్లు ఎగుమతి అవుతున్నాయి. రానున్న రోజుల్లో ఫారమ్ గేటు వద్ద ధర రూ.6 దాటే అవకాశం కన్పిస్తోందని పౌల్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 మార్క్‌ను చేరుకునే అవకాశాలు లేకపోలేదంటున్నాయి.

ఎగుమతులకు ఊపు

సాధారణంగా మన రాష్ట్రం నుంచి పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్, అస్సాం, మణిపూర్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. కొంతమేర గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. విదేశాల విషయానికి వస్తే ప్రతి నెలా 2 కోట్ల గుడ్లు గల్ఫ్ దేశాలకు, 50 లక్షల నుంచి 75 లక్షల వరకు ఇతర దేశాలకు మన దేశం నుంచి ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం టర్కీ, నెదర్లాండ్స్‌లో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో మన దేశం నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరిగాయి. గత నెలలో ఏకంగా 20 కోట్ల గుడ్లు ఎగుమతి అయ్యాయి. 50 లక్షలకు మించి ఎగుమతి కాని కతార్‌కు ప్రస్తుతం 2 కోట్లకు పైగా ఎగుమతి అవుతున్నాయి. ఇతర దేశాలకు కూడా కోటిన్నరకు పైగా గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలకు సైతం రాష్ట్రం నుంచి ఎగుమతులు పెరిగాయి. ఫలితంగా గుడ్ల ధరలకు రెక్కలొచ్చాయి.

రైతులకు ఊరట

మొక్కజొన్న టన్ను గత ఏడాది రూ.20 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.24 వేలకు చేరింది. సోయాబీన్ టన్ను గతేడాది రూ.38 వేల వరకు పలకగా.. ప్రస్తుతం రూ.48 వేల నుంచి రూ.51వేల మధ్య వరకు ఉంది. ఆయిల్ తీసిన తవుడు (డీవోపీ) గతేడాది కిలో రూ.9 నుంచి రూ.10 ఉండగా.. ప్రస్తుతం రూ.17–18 మధ్య ఉంది. ఇలా ఊహించని రీతిలో పెరిగిన మేత ధరల వల్ల పిల్ల దశ నుంచి గుడ్డు పెట్టే దశ వరకు ఒక్కో కోడికి రూ.300 నుంచి రూ.315 వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా ఫారమ్ గేట్ వద్ద ఒక్కో కోడిగుడ్డు ఉత్పత్తికి రూ.4.65 నుంచి రూ.4.75 వరకు ఖర్చవుతోంది. ఫిబ్రవరి నుంచి ఇదే రీతిలో ఖర్చవుతున్నా నెల రోజుల క్రితం వరకు ఫారమ్ గేట్ వద్ద గుడ్డు ధర రూ.3.90కి మించి పలకలేదు. ఫలితంగా పౌల్ట్రీ రైతులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. కాగా, ప్రస్తుతం ఊహించని రీతిలో విదేశాలకు పెరిగిన ఎగుమతులు దేశీయంగా పౌల్ట్రీ రైతుకు కాస్త ఊరటనిచ్చాయి.

ఎగుమతులు పెరగటం వల్లే..

చాలా రోజుల తర్వాత పౌల్ట్రీ రైతుకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఇది పౌల్ట్రీ పరిశ్రమకు శుభపరిణామం. ఊహించని రీతిలో గల్ఫ్ దేశాలకు ఎగుమతులు పెరగడం వల్లే ఫారమ్ గేటు వద్ద రైతుకు గిట్టుబాటు ధర లభిస్తోంది. గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేసే టర్కీ, నెదర్లాండ్స్ దేశాల్లో ఉత్పత్తి తగ్గడం మన గుడ్డుకు కలిసొచ్చింది.

– తుమ్మల కుటుంబరావు, చైర్మన్, ఎన్ఈసీసీ, విజయవాడ జోన్

తొలిసారి గిట్టుబాటు ధర

కృష్ణా జిల్లాలో 70 కోళ్ల ఫారాలు ఉన్నాయి. సుమారు కోటి కోళ్లను పెంచుతుండగా.. 75 లక్షల నుంచి 80 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. పెరిగిన ముడిసరుకు ధరల వల్ల ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఒక్కో కోడిపై నెలకు రూ.30 చొప్పున నష్టపోయాం. ఆ తర్వాత నెలకు రూ.10నుంచి రూ.15 మేర నష్టాలను చవిచూశాం. ప్రస్తుతం ఫారమ్ గేట్ వద్ద గుడ్డు తయారీకి రూ.4.75 వరకు ఖర్చవుతుండగా.. తొలిసారి రూ.5.25 ధర లభిస్తోంది. చాలా ఆనందంగా ఉంది. ఇదే రీతిలో కనీసం ఏడాది పాటు కొనసాగితే నష్టాల నుంచి గట్టెక్కగలం.

– ఆర్.సత్యనారాయణరెడ్డి, అధ్యక్షుడు, కృష్ణా జిల్లా లేయర్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

'టౌన్ ప్లానింగ్' విభాగం ప్రక్షాళన



- నిర్మాణ అనుమతులు, ఓసీ జారీ జాప్యంపై పరిశీలన
- యూఎల్బీల్లోని పరిస్థితిపై వివరాలు సేకరిస్తున్న అధికారులు
- టౌన్ ప్లానింగ్ విభాగంలో మార్పులు!
- డీపీఎంఎస్‌లో మార్పులపైనా అధ్యయనం
- సాఫ్ట్‌వేర్‌నూ అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం

సాక్షి, అమరావతి: ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అనుమతులు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) విభాగాన్ని ప్రక్షాళన చేస్తోంది. డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీపీఎంఎస్)లో మార్పులపైనా అధ్యయనం ప్రారంభించింది. భవన నిర్మాణ దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో అనుమతి మంజూరు పత్రం ఆలస్యమవుతోందని, నిర్మాణం అనంతరం జారీ చేసే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సైతం గడువులోగా ఇవ్వడం లేదని ఉన్నతస్థాయిలో ఫిర్యాదులు అందుతున్నాయి. పైగా మూడు నెలల క్రితం పలు పట్టణాల్లో (యూఎల్‌బీల్లో) ఏసీబీ చేసిన తనిఖీల్లో టౌన్ ప్లానింగ్ విభాగంలోని అవకతవకలు బయటపడ్డాయి. దీంతో ప్రభుత్వం టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ఇటీవల మున్సిపల్ విభాగంపై సీఎం నిర్వహించిన సమీక్ష సమావేశంలోనూ ఈ అంశంపై ప్రధానంగా చర్చించినట్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవల లైసెన్స్‌డ్ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలోనూ అనుమతులు మంజూరు ఆలస్యమవుతున్నాయని, అప్‌లోడింగ్‌కు అధిక సమయం పడుతున్నట్టు ఫిర్యాదులు అందాయి. దీంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో పెద్ద ఎత్తున మార్పులు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

సామాన్యులకు అనువుగా డీపీఎంఎస్

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను టౌన్ లేదా సిటీ ప్లానింగ్ విభాగం అధికారులు పరిశీలిస్తారు. అన్ని పత్రాలను పరిశీలించి 15 రోజుల్లోగా అనుమతినివ్వాలి. గడువులోగా అనుమతివ్వకుంటే ఆటోమెటిక్‌గా అనుమతి జారీ అయ్యేలా డీమ్డ్ ప్రొవిజన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. నిర్మాణం తర్వాత ఇచ్చే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీని కూడా ఇదే విధానం కిందకు తేవాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతమున్న సాఫ్ట్‌వేర్ సైతం సామాన్యులకు ఉపయోగపడేలా రూపొందించారు. అయినప్పటికీ సమస్యలు వస్తున్నాయి. దీంతో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసి, సర్వర్ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్లాన్ అనుమతికి దరఖాస్తు అప్‌లోడ్ చేసేటప్పుడు ఎల్టీపీలు (లైసెన్స్డ్ టౌన్ ప్లానర్) నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించకపోవడంతో ప్రీ డీసీఆర్ (డెవలప్‌మెంట్ కంట్రోల్ రెగ్యులేషన్స్), ఆటో డీసీఆర్ పరిశీలనలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటివి బహుళ అంతస్తుల భవనాల ప్లాన్లకు మాత్రమే వస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇటీవల మార్చిన టౌన్‌ప్లానింగ్ నిబంధనల మేరకు నిర్మాణ, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను వార్డు ప్లానింగ్ కార్యదర్శి మంజూరు చేయవచ్చు. ఏదైనా సమస్య ఉంటే అక్కడే దరఖాస్తుదారుకు తెలియజేసి పరిష్కరించవచ్చు. కానీ, ప్రతి చిన్న సమస్యను ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపడంతో అనుమతులు మంజూరు ఆలస్యమవుతున్నట్టు గుర్తించారు.

అజ్ఞాతంలోకి టీడీపీ నేతలు

- ముందస్తు బెయిల్‌కు యత్నాలు!
- 87 మంది హోంగార్డులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ
- ఏడుగురు నిందితులు అదుపులోకి..

చిత్తూరు అర్బన్ : చిత్తూరు పోలీసు శాఖను కుదిపేస్తున్న నకిలీ హోంగార్డుల కుంభకోణంలో వన్‌టౌన్ పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో ఆర్.మణిగండన్, టి.యువరాజ్, బీఆర్ కిరణ్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు హోంగార్డులు, ఓ కానిస్టేబుల్ ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో వీరిని మీడియా ఎదుట హాజరుపరిచే అవకాశముంది. 87 మంది నిరుద్యోగులను దొడ్డిదారిన పోలీసు శాఖలోకి చొప్పించిన బాగోతం తెలిసిందే. ఇదే కేసుకు సంబంధించి కుట్రలో భాగమైన జిల్లాకు చెందిన కొందరు టీడీపీ నేతలు ముందస్తు బెయిల్ పొందేందుకు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఇక నకిలీ హోంగార్డుల వ్యవహారంలో అవకతవకలను గుర్తించిన చిత్తూరు ఏఆర్ ఆర్ఐ మురళీధర్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ నరసింహరాజు ఐపీసీ 420, 419, 409, 468, 471 రెడ్‌విత్ 120 (బి) సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు.

ఆ 87 మందికీ తొలగింపు ఉత్తర్వులు

మరోవైపు.. పోస్టులు పొందిన 87 మందినీ డీఐజీ ఆదివారం విధుల నుంచి తొలగించారు. ఇప్పుడు వీళ్లను తొలగించకపోతే కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి హోంగార్డు కోటా చూపించి వీరంతా ఉద్యోగాల్లో చేరిపోయే ప్రమాదాన్ని పసిగట్టి ఈ నిర్ణయం హుటాహుటిన తీసుకున్నారు. ఈ 87 మందిలో 28 మంది టీటీడీలో, చిత్తూరు, తిరుపతి అగ్నిమాపక శాఖలో 22 మంది, కాణిపాకం ఆలయంలో 15 మంది, చిత్తూరు, తిరుపతి రవాణాశాఖలో 10 మంది, లా అండ్ ఆర్డర్‌లో ఐదుగురు, చిత్తూరు జిల్లా జైల్లో ముగ్గురు, తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్, చిత్తూరు స్త్రీ–శిశు సంక్షేమశాఖలో ఒకొక్కరు, ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న ఒకరితోపాటు సర్వీసు నుంచి తొలగించిన మరొకరు ఉన్నారు. మరోవైపు ఈ కుట్రపై చిత్తూరు ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి స్పందిస్తూ లోతుగా దర్యాప్తు జరుగుతుందని, బాధ్యులందరిపైనా చర్యలుంటాయని స్పష్టంచేశారు.

'త్రిశూల'మిరప



అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి గ్రామంలో ఓ మొక్కకు త్రిశూలం ఆకారంలో పచ్చిమిరపకాయ కాసింది. ఒక తొడిమకు మూడు కాయలు కాశాయి. దీన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. జన్యుపరమైన అసమానతల కారణంగా ఇలా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రమేష్‌నాయుడు తెలిపారు.

– రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

భారతీయ చిన్నారులు బాగా 'స్మార్ట్'

భారత్‌లో పిల్లల ఫోన్ వినియోగం 83 శాతం

- మొబైల్ పరిపక్వతలో మన దేశ పిల్లలదే ముందంజ
- అధికంగా ఆన్‌లైన్ ముప్పును ఎదుర్కోవడంలోనూ వారిదే అగ్రస్థానం
- చిన్నారులకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వొద్దంటున్న నిపుణులు



స్మార్ట్ ఫోన్ ఎంత సౌకర్యవంతమో.. అజాగ్రత్తగా ఉంటే అంతే ప్రమాదం. అది చిన్నారుల చేతుల్లోకి వెళితే ఆన్‌లైన్ రిస్క్ మరింత ఎక్కువగా ఉంటోంది. పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇస్తున్న తల్లిదండ్రులకు సైబర్ బెదిరింపులు ఎదురవుతుండగా.. సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆందోళన కూడా పెరుగుతోంది.

సాక్షి, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా మొబైల్ పరిపక్వతలో భారతీయ చిన్నారులు ముందంజలో నిలుస్తున్నారు. 10–14 ఏళ్ల వయసు పిల్లల్లో ఫోన్ వినియోగం 83 శాతంగా ఉంది. ఇది ప్రపంచ సగటుతో పోలిస్తే 7 శాతం అధికంగా నమోదవటం విశేషం. కాగా, ఇతర దేశాలతో పోలిస్తే ఆన్‌లైన్ అపాయాల(రిస్క్)కు గురవుతున్న చిన్నారుల్లో అత్యధికులు భారతీయులే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. స్మార్ట్ ఫోన్ వినియోగంలో 10నుంచి 14ఏళ్లలోపు భారతీయ చిన్నారులు 24 శాతం ఆన్‌లైన్ ముప్పునకు గురైనట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

ఆన్‌లైన్ భద్రతపై అవగాహన లేమి

దేశంలో 47 శాతం మంది తల్లిదండ్రుల్లో సైబర్ బెదిరింపులు, సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆందోళన పెరుగుతోంది. ఇక్కడ చిన్నారులు స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నప్పుడు రక్షణ కల్పించడంలో అవగాహన లేమి ఆన్‌లైన్ ముప్పునకు కారణాలుగా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అంతేకాకుండా దేశంలో 33 శాతం తల్లిదండ్రుల ఆన్‌లైన్ ఖాతాలు సైతం సైబర్ దాడికి గురైనట్టు గుర్తించారు. ఇది ప్రపంచంలోని ఇతర దేశాల సగటుతో పోలిస్తే 13 శాతం ఎక్కువ. ప్రపంచ సగటులో 15 శాతం మంది చిన్నారులు ఆన్‌లైన్ ముప్పునకు గురైతే.. మన దేశంలో అది 28 శాతంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా సైబర్ బెదిరింపులు, వ్యక్తిగత సమాచారం చోరీ, ఆర్థిక సమాచారం లీకేజీలను అరికట్టడానికి చిన్నారులకు ఫోన్ ఇచ్చేముందు పాస్‌వర్డ్ ప్రొటెక్షన్ తప్పనిసరిగా పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రముఖ ఆన్‌లైన్ స్టోర్లలోనే షాపింగ్, అపరిచిత వ్యక్తుల సందేశాలకు దూరంగా ఉండటంపై తరచూ పిల్లలను హెచ్చరించాలని చెబుతున్నారు. చిన్నారులకు ప్రత్యేకంగా ఫోన్ ఇవ్వకపోవడం మంచిదని, తమ ఫోన్లలోనే వారికి అవసరమైన యాప్‌లు మాత్రమే ఓపెన్ అయ్యేలా పర్యవేక్షించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇవి చేస్తే మంచిది..

చిన్నారుల్లో స్మార్ట్ ఫోన్ వ్యసనాన్ని తొలగించడం సవాల్‌గా మారింది. దీనిని నెమ్మదిగా తగ్గించేందుకు పిల్లలతో గడిపే కుటుంబ సమయాన్ని పెంచాలి. కచ్చితంగా స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని కఠిన తరం చేయాలి. స్క్రీన్ సమయ పరిమితిని విధించాలి. ఫోన్ వాడకంతో లాభనష్టాలను వారికి అర్థమయ్యేలా వివరించాలి.

దేశంలో చిన్నారుల స్మార్ట్‌ఫోన్ వినియోగంలో కొన్ని ఆన్‌లైన్ రిస్క్‌లు ఇలా..

అంశం	శాతం
ఆన్‌లైన్ అకౌంట్ల దొంగతనం	26
వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం	24
ఆర్థిక సమాచారం లీకేజీ	23
సైబర్ బెదిరింపులు	22

రక్తదానంపై అవగాహనకు 21,000 కి.మీ నడక



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): భారత్‌లో 2025 డిసెంబర్ 31 తర్వాత ఆపదలో ఉన్న ఏ వ్యక్తీ రక్తం కోసం ఎదురుచూసి చనిపోకూడదన్నదే తన లక్ష్యమని ఢిల్లీకి చెందిన సామాజిక సేవా కార్యకర్త కిరణ్ వర్మ చెప్పారు. రక్తదానంపై అవగాహన కోసం 21,000 కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. గతేడాది డిసెంబర్ 28న తిరువనంతపురం నుంచి నడక ప్రారంభించిన వర్మ ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చేరుకుని మీడియాతో మాట్లాడారు. బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రుల్లో రక్తం కొరత లేకుండా 5 మిలియన్ల మంది రక్తదానం చేయాలని ప్రోత్సహించడానికి తానీ నడక చేపట్టినట్లు తెలిపారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీల్లోని 131 జిల్లాల మీదుగా 9,500 కి.మీ.కు పైగా ప్రయాణించి విజయవాడకి చేరుకున్నట్లు చెప్పారు. తన నడకకు మద్దతుగా పలు ప్రాంతాల్లో 74 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 12,843 యూనిట్ల రక్తాన్ని సేకరించారని వివరించారు. క్యాంప్‌లతో పాటు 3,000 మందికి పైగా రక్తదాతలు ఈ ప్రచారానికి మద్దతుగా నిలిచి రక్తదానం చేశారన్నారు. సింప్లీ బ్లడ్ సంస్థ ఏర్పాటు చేసి వర్చువల్ విధానంలో రక్తదాతలు, రక్తం కోసం అన్వేషిస్తున్న వారిని కనెక్ట్ చేస్తున్నట్లు చెప్పారు. ఛేంజ్‌విత్ వన్ ఫౌండేషన్, ఛేంజ్ విత్ వన్ మీల్ వంటివి స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కిరణ్ వర్మ తెలిపారు.

అధికారం కోసం బాబు తిప్పలు

బహుజన పరిరక్షణ సమితి



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న సమితి నేతలు

తాడికొండ: అధికారం కోసం చంద్రబాబు ప్రజలను రెచ్చగొడుతూ...వారిని మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 805వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు పలువురు హాజరై ప్రసంగించారు. అన్ని ప్రాంతాల ప్రజలు సమానంగా ఎదిగి ఆర్థికంగా, సామాజికంగా స్థిరపడాలని సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన తప్పులను తిరిగి చేయకుండా ప్రజాభీష్టం మేరకు సీఎం జగన్ తీసుకుంటున్న నిర్ణయాలను 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. రాజధాని ప్రాంతంలో పేదలకు పట్టాలు ఇచ్చి ఆదుకునేందుకు సీఎం జగన్ ముందడుగు వేస్తే దానిని కోర్టులో అడ్డుకోవడానికి యత్నిస్తున్న బాబు అండ్ కో ను తరిమి కొడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- రూ.10 కోట్లకుపైగా ఆస్తి నష్టం
- ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో ఘటన

మద్దిపాడు: కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం జరిగి రూ.10 కోట్లకుపైగా ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే...ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ప్రసాద్ ఆర్గానిక్స్ పేరుతో చెన్నైకి చెందిన ఓ వ్యక్తి ఫ్యాక్టరీ నడుపుతున్నారు. ఈ ఫ్యాక్టరీలో పర్ఫ్యూమ్స్, అగరబత్తీలలో ఉపయోగించే సిట్రినోనెల్లా, రోజ్ ఆక్సైడ్ తయారు చేస్తారు. ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫ్యాక్టరీ మొత్తం మంటలు వ్యాపించాయి. కార్మికులు బయటకు పరుగుతీశారు. సమాచారం అందుకున్న మద్దిపాడు ఎస్ఐ శ్రీరామ్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని అద్దంకి, ఒంగోలు, దర్శి ఫైర్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఐదు గంటలు శ్రమించి మంటలు అదుపుచేశారు. బాపట్ల జిల్లా ఫైర్ ఆఫీసర్ మాధవనాయుడు, ఒంగోలు డీఎస్పీ నాగరాజు, రూరల్ సీఐ రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ గానీ, బాయిలర్ పేలిపోవడం గానీ అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

క్షేమంగా భూమికి ఓరియాన్

కేప్ కెనావెరాల్: చంద్రుడిపై పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రయోగించిన ఓరియాన్ క్యాప్సూల్ ఆదివారం రాత్రి క్షేమంగా భూమికి తిరిగొచ్చింది. చంద్రుడి చుట్టూ 25 రోజులపాటు ప్రదక్షిణలు చేసిన ఓరియాన్ భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి మెక్సికోలోని బజా ద్వీపకల్పంలో పసిఫిక్ సముద్ర తీరంలో దిగింది. దీన్ని నవంబర్ 16న కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించడం తెలిసిందే.

క్లుప్తంగా...

సుప్రీంకోర్టు జడ్జిగా నేడు జస్టిస్ దత్తా ప్రమాణం



సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దీపాంకర్ దత్తా (57) సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ దత్తాతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణం చేయించనున్నారు. ఆయన ఇప్పటిదాకా బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. కలకత్తా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సలిల్ కుమార్ దత్తా కొడుకు, జస్టిస్ అమితవ్ రాయ్ బావమరిది అయిన జస్టిస్ దత్తా రాకతో సుప్రీంలో న్యాయమూర్తుల సంఖ్య 28కి పెరగనుంది.

మంచి ఉగ్రవాదముంటుందా?

పాకిస్తాన్‌పై ఐరాసలో భారత్ ధ్వజం

ఐరాస: రాజకీయ లబ్ధి కోసం ఉగ్రవాదులను మంచి, చెడు అంటూ వర్గీకరించే ధోరణికి తక్షణం తెర పడాలని భారత్ స్పష్టం చేసింది. ''ఉగ్రవాద దుశ్చర్యల్లో కొన్నింటిని ఖండించి, మరికొన్నింటిని మాత్రం మత, సిద్ధాంతపరంగా స్ఫూర్తి పొందినవంటూ కొన్ని దేశాలు వెనకేసుకు రావడం శోచనీయం. ఇలాంటి చర్యలు ఉగ్రవాదంపై పోరుకు అంతర్జాతీయ సమాజం చేస్తున్న కృషికి విఘాతం కలిగిస్తాయి'' అని పాకిస్తాన్‌ను ఉద్దేశించి విమర్శించింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ తాజాగా భద్రతా మండలికి పంపిన కాన్సెప్ట్ నోట్‌లో ఈ మేరకు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై భారత దృక్కోణం తదితరాలను అందులో వివరంగా చర్చించారు. దాన్ని సభ్య దేశాలన్నింటికీ పంపాల్సిందిగా ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌కు ఆమె లేఖ రాశారు. 15 దేశాలతో కూడిన భద్రతా మండలికి భారత్ ప్రస్తుతం అధ్యక్షత వహిస్తోంది. ఉగ్రవాద నిర్మూలన చర్యలు తదితరాలపై మండలిలో డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగే రెండు సదస్సులకు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సారథ్యం వహించనున్నారు.

ఖమేనీ కోడలికి మూడేళ్ల జైలు

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ హయాంను హంతక పాలనగా విమర్శించిన ఆయన మేనకోడలికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఖమేనీ అధికారాన్ని వ్యతిరేకిస్తున్న కుటుంబానికి చెందిన ఫరిదే మొరాద్‌ఖానీని నవంబర్ 23న పోలీసులు తీసుకెళ్లారు. పోలీస్ కస్టడీలో మరణించిన మహ్సా అమిని అనే యువతిని బహిరంగంగా సమర్థించారన్న ఆరోపణలపై న్యాయస్థానం ఆమెకు శిక్ష విధించింది.

ట్విట్టర్‌లో మళ్లీ బ్లూటిక్స్

న్యూయార్క్: ట్విట్టర్ మళ్లీ బ్లూ టిక్ సర్వీసును ప్రారంభించింది. డబ్బులు కట్టి ఈ సర్వీసు తీసుకున్న వాళ్లకి బ్లూటిక్‌తో పాటు కొన్ని ప్రత్యేక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. సోమవారం నుంచి ఈ సర్వీసు ప్రారంభం కానుంది. నెలకు 8 డాలర్లు కట్టిన వారికే బ్లూటిక్స్ ఇస్తామని సంస్థ కొత్త బాస్ ఎలన్ మస్క్ ప్రకటించడం, తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కు తీసుకోవడం తెలిసిందే.


అది ఫేక్ షెడ్యూల్: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: 10, 12వ తరగతుల పరీక్షల షెడ్యూల్ అంటూ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన సమాచారం ఫేక్ అని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. ఫిబ్రవరి 25, 2023 తర్వాత నిర్వహించబోయే పరీక్షల కోసం ఎటువంటి షెడ్యూల్‌ను ప్రకటించలేదని పేర్కొంది.

ఢిల్లీ బీజేపీ చీఫ్ రాజీనామా

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో బీజేపీ ఢిల్లీ అధ్యక్ష పదవికి ఆదేశ్ గుప్తా రాజీనామా చేశారు. దీంతో, అధిష్టానం బీజేపీ ఢిల్లీ విభాగం ఉపాధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవకు తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది.

పగటి కలలు మితిమీరితే అనర్థాలే!



లండన్: పగటి కలలు.. ప్రతి ఒక్కరి జీవితంలో సర్వసాధారణం. మనసుకు ఉల్లాసం కలిగించడంతోపాటు విసుగు, ఒంటరితనం నుంచి ఉపశమనం కల్పిస్తాయి. మనసులో మెదిలే ప్రతికూల భావాల నుంచి బయటపడడానికి కలలను ఆశ్రయిస్తుంటారు. అంతేకాదు పగటి కలలతో మనుషుల్లో సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పెరుగుతుందని గతంలో పరిశోధనల్లో తేలింది. పేదవాడు క్షణాల్లో ధనవంతుడిగా మారిపోవడం పగటి కలల్లోనే సాధ్యం. అయితే, ఇలాంటి కలలు ఒక పరిమితి వరకు అయితే ఫర్వాలేదు. మితిమీరితే అనర్థాలు తప్పవని యూకే సైంటిస్టులు చెబుతున్నారు. మేల్కొని ఉన్నప్పుడు సగం సమయం కలల్లోనే గడిపితే వాటిని మితిమీరిన పగటికలలు అంటారు. ఒక్కోసారి మనకు తెలియకుండానే ఇలా జరగొచ్చు. ఇలాంటి వాటితో పలు మానసిక రుగ్మతలు తలెత్తుతాయట. ఆందోళన, కుంగుబాటు, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్(ఓసీడీ) వంటి ముప్పు ఎదురవుతుందని సైంటిస్టులు గుర్తించారు. జనాభాలో 18 ఏళ్లు దాటిన వారిలో 2.5 శాతం మంది మితిమీరిన కలలతో ఇబ్బందులు పడుతున్నట్లు తేలింది.

అతి వ్యాయామంతో యువతలో గుండెపోటు!



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో యువతలో గుండెపోటు సంబంధిత మరణాల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అధిక బరువు, శరీరంలో అధిక కొలెస్ట్రాల్ ఇందుకు కారణమని చాలామంది భావిస్తున్నారు. కానీ, అలవాటు లేని వ్యాయామాలు లేక అతి వ్యాయామం వల్ల యువత గుండెపోటు బారిన పడుతున్నారని నిపుణులు గుర్తించారు. 25 నుంచి 50 ఏళ్లలోపు వారిలో పలువురు జిమ్‌లో మృతి చెందిన సంఘటనలు ఇటీవలి కాలంలోనే బయటపడ్డాయి. కన్నడ సినీ నటుడు పునీత్ రాజ్‌కుమార్, గాయకుడు కేకే, కమేడియన్ రాజు శ్రీవాస్తవ వ్యాయామం చేస్తూ హఠాత్తుగా కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. పెళ్లి వేడుకల్లో యువత నృత్యాలు చేస్తూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. తగిన శిక్షణ లేకుండానే కఠిన వ్యాయామాలు చేయడం లేదా అతిగా వ్యాయామం చేయడం వల్ల కరోనరీ నాళాల్లో చీలికలు ఏర్పడతాయని, అంతిమంగా గుండెపోటుకు దారితీస్తుందని మొరాదాబాద్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ విజయకుమార్ తెలిపారు. అలవాటు లేని ఎక్సర్‌సైజ్‌లకు యువత దూరంగా ఉండాలని మరో వైద్యుడు వివేక్ కుమార్ సూచించారు. ఏ వ్యాయామం ఎలా చేయాలన్న దానిపై తగిన శిక్షణ తీసుకోవాలని చెప్పారు.

జీవవైవిధ్యానికి వంతెన

పర్యావరణ పరిరక్షణ. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న మంత్రమిదే. వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోతూ ఉండడంతో జీవ వైవిధ్యాన్ని కోల్పోతున్నాం. అభివృద్ధి కార్యకలాపాల్లో ముందడుగు వేస్తూనే వన్యప్రాణుల్ని కాపాడడం కోసం అటవీ ప్రాంతాల నుంచి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌వేలను ఎకో వంతెనలతో తీర్చిదిద్దుతున్నారు. ఆ వంతెనల కథాకమామిషు చూద్దాం..



మహారాష్ట్రలో నాగపూర్, ముంబై మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించిన బాలాసాహెబ్ ఠాక్రే సమృద్ధి మహా మార్గ్ (ఎక్స్‌ప్రెస్‌వే) మొదటి దశ ఎన్నో ప్రత్యేకతలతో నిండి ఉంది. మన దేశంలో నిర్మించిన పూర్తి స్థాయి తొలి ఎకో వంతెన ఇది. రోడ్లపై వెళ్లే వాహనాలకు అడ్డంగా వచ్చే వన్యప్రాణులకి ఎలాంటి హాని కలగకుండా ఈ ఎక్స్‌ప్రెస్ వే మార్గం పచ్చగా, పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడేలా నిర్మించారు. దారిన పోయే జంతువులు, వన్యప్రాణులు నిర్భయంగా సంచరించడానికి తొమ్మిది గ్రీన్ వంతెనలు (ఓవర్ పాసెస్), మరో 17 అండర్ పాసెస్ నిర్మించారు. మొత్తం 701 కి.మీ. పొడవైన ఈ ఎక్స్‌ప్రెస్ తొలిదశలో 520 కి.మీ. పూర్తి చేసుకుంది. ఈ వంతెనతో ప్రయాణికులు వన్యమృగాల భయం లేకుండా ప్రజలు సురక్షితంగా ప్రయాణించవచ్చు. మరో వైపు అవి తిరగడానికి కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇక ఈ ఎక్స్‌ప్రెస్ వే పొడవున సంచరించే చిరుత పులులు రహదారులపైకి రాకుండా ఫెన్సింగ్ నిర్మిస్తారు. మహారాష్ట్రలో 10 జిల్లాల మీదుగా సాగే ఈ వంతెన నిర్మాణం రెండో దశ కూడా పూర్తయితే నాగపూర్, ముంబైల మధ్య 16 గంటలు పట్టే ప్రయాణ సమయం 8 గంటలు పడుతుంది.

ఏమిటీ వన్యప్రాణుల వంతెనలు?

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వన్యప్రాణుల రాకపోకలు సాగించడమే లక్ష్యంగా నిర్మించే వంతెనల్ని ఎకో వంతెనలు, వన్యప్రాణుల వంతెనలు అని పిలుస్తారు. అటవీ ప్రాంతాల్లో నిర్మించే హైవేలపై వాహనాలకు అడ్డంగా పడి జంతువులు ప్రాణాలు పోకుండా ఉండడం కోసం కూడా ఈ వంతెనల్ని నిర్మిస్తున్నారు. టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో వివిధ దేశాల్లో ఎకో వంతెనల నిర్మాణం సాగుతోంది.

ఎకో వంతెనలు ఎన్ని రకాలు ?

ఈ ఎకో వంతెనలు మూడు రకాలున్నాయి. చిన్న చిన్న పాలిచ్చే జంతువుల్ని కాపాడడం కోసం ఉద్దేశించిన కల్వర్టులు. వీటికే ఆంఫిబియాన్ వంతెనలని పిలుస్తారు. ఇక రెండో రకం కానోపి బ్రిడ్జెస్. కోతులు, ఉడతలు వంటి చెట్లపై నివసించే వాటిని రక్షించడానికి సులభంగా రాకపోకలు సాగించడానికి చెక్కలతో ఈ వంతెనల్ని నిర్మిస్తారు. ఇక కాంక్రీట్‌తో నిర్మించే అండర్‌పాసెస్, ఓవర్ పాస్ టన్నెల్స్. పులులు, ఏనుగులు వంటి పెద్ద పెద్ద జంతువులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరించడం కోసం వీటిని నిర్మిస్తారు. ఈ ఎకో వంతెనల నిర్మాణం సాగించడానికి ముందు ఆయా దేశాలకు చెందిన పర్యావరణ పరిరక్షకులు వాటిని నిర్మించే ప్రాంతం, సైజుని అధ్యయనం చేస్తారు. ప్రభుత్వం పర్యావరణ అనుమతులు ఇచ్చిన తర్వాతే వీటి నిర్మాణం సాగుతుంది.

మొదటి వంతెన ఎక్కడ ?


ఫ్రాన్స్‌లో 1950 సంవత్సరంలో ఈ ఎకో వంతెనల నిర్మాణం మొదలైంది. ఆ తర్వాత స్కాట్‌ల్యాండ్, బ్రిటన్ వంటి దేశాలు వీటి నిర్మాణంపై మక్కువ చూపించాయి. మొత్తమ్మీద యూరప్ దేశాల్లో ఈ ఎకో బ్రిడ్జీల నిర్మాణం ఎక్కువగా జరుగుతోంది. వాహనాల కింద పడి ప్రమాదవశాత్తూ జంతువులు మరణిస్తూ ఉండడంతో మన దేశంలో ఉత్తరాఖండ్‌లోని కలాధుంగి–నైనిటాల్ హైవే మధ్య రామ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్‌లో చెట్లపై తిరుగాడే జంతువుల కోసం 90 అడుగుల పొడవైన వంతెన నిర్మించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అంతరిస్తున్న జీవ జాతులు

వన్యప్రాణులు, పక్షులు, ఉభయచరాలు, సరీసృపాలు, చేపల సంపద రాను రాను తగ్గిపోతోంది. 1970–2018 మధ్య ప్రపంచవ్యాప్తంగా జీవజాతులు ఏకంగా 69% తగ్గిపోయాయని వరల్డ్ లైఫ్ ఫండ్ లివింగ్ ప్లానెట్ నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు, అడవులు కూడా కాంక్రీట్‌గా మారుతుండడంతో జీవవైవిధ్యానికి ముప్పుగా మారుతోంది. లాటిన్ అమెరికా, వెస్టిండీస్‌లలో సగటున జీవవైవిధ్యం 94% తగ్గిపోతూ ఉంటే భారత్‌లో 70% తగ్గుతోంది.

'షార్ట్‌కట్లు' మనకొద్దు: మోదీ



నాగ్‌పూర్ మెట్రోలో ప్రయాణిస్తున్న మోదీ

నాగపూర్: భారత్‌లో సుస్థిరాభివృద్ధి జరగాలని మన దేశానికి షార్ట్ కట్ పాలిటిక్స్ అవసరం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడానికి కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ప్రధాని మోదీ ఆదివారం రూ.75 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల్ని ప్రారంభించారు. నాగపూర్–ముంబై సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేలో షిర్డీ దాకా తొలి దశని ప్రారంభించిన మోదీ ఆ రహదారిపై కాసేపు కారులో ప్రయాణించారు. నాగపూర్–బిలాస్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును, నాగపూర్ మెట్రో రైలు, ఎయిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతరం ఎయిమ్స్ కేంపస్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశాభివృద్ధి విషయంలో సంకుచిత ధోరణి ప్రదర్శిస్తే అవకాశాలు పరిమితంగానే లభిస్తాయన్నారు. ''అన్ని రాష్ట్రాల సమగ్రాభివృద్ధితోనే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలబడుతుంది. సబ్‌కా సాత్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అన్న సూత్రంతోనే ముందుకు వెళుతున్నాం'' అని చెప్పారు. షార్ట్ కట్ పాలిటిక్స్ ద్వారా దేశాభివృద్ధి సాధ్యం కాదని కుండబద్దలు కొట్టారు. సుస్థిరాభివృద్ధి చేసి చూపించి ఎన్నికల్లో గెలవాలే తప్ప షార్ట్ కట్ పాలిటిక్స్ వద్దని పార్టీలకు సూచించారు.

ఆయుర్వేదం వైపు ప్రపంచం చూపు: మోదీ

పనాజీ: ప్రపంచ దేశాలన్నీ ఆయుర్వేదం వైపు చూస్తున్నాయని మోదీ చెప్పారు. గోవాలో ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, ఘజియాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యునాని మెడిసన్, ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిలను గోవా నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. గోవాలో ఆదివారం తొమ్మిదో ప్రపంచ ఆయుర్వేద కాంగ్రెస్ ముగింపులో పాల్గొన్నారు. ఆయుర్వేద వైద్యం శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.



సాధారణ ప్రయాణికుడిలా...

నాగపూర్ మెట్రోను ప్రారంభించిన ప్రధాని మోదీ సాధారణ ప్రయాణికుడిలా స్వయంగా టిక్కెట్ కొనుక్కొని అందులో ప్రయాణించారు. జీరో మైల్ ఫ్రీడమ్ పార్క్ నుంచి ఖాప్రి స్టేషన్ వరకు విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. మెట్రో రెండోదశకు శంకుస్థాపన కూడా చేశారు.



నాగ్‌పూర్‌లో డోలు వాయిస్తున్న మోదీ

హైకోర్టుల్లో ఇంకెన్నాళ్లీ ఖాళీలు?

కేంద్రం, న్యాయ వ్యవస్థ దృష్టి పెట్టాలి

- కాల పరిమితిని పట్టించుకోరా?
- ఏడేళ్లైనా ఏకాభిప్రాయం రాలేదా?
- పార్లమెంటు కమిటీ విమర్శలు
- కలసికట్టుగా పరిష్కరించండి
- పార్లమెంటుకిచ్చిన నివేదికలో సూచన

న్యూఢిల్లీ: హైకోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీల భర్తీ విషయంలో కేంద్రం ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ కాల పరిమితికి కట్టుబడకపోవడం దురదృష్టకరమని న్యాయ, సిబ్బందిపై ఏర్పాటైన పార్లమెంటు కమిటీ ఆవేదన వెలిబుచ్చింది. ''ఇదో నిరంతర సమస్యగా కొనసాగుతోంది. దీని పరిష్కారానికి కేంద్రం, న్యాయ వ్యవస్థ రొటీన్‌కు భిన్నంగా ఆలోచించాలి'' అని గురువారం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సూచించింది. కొలీజియం ద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంపై కేంద్రం, సుప్రీంకోర్టు మధ్య వివాదం నానాటికీ తీవ్ర రూపు దాలుస్తున్న నేపథ్యంలో బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ నేతృత్వంలోని కమిటీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విశేషం. హైకోర్టు న్యాయమూర్తుల ఖాళీల భర్తీకి నిర్దిష్ట కాలావధిని సూచించలేమన్న కేంద్ర న్యాయ శాఖ వ్యాఖ్యలతో తాము ఏకీభవించడం లేదని నివేదికలో కమిటీ స్పష్టం చేసింది. ''ఈ విషయంలో స్పష్టమైన కాలావధిని న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్ (ఎంఓపీ)లోనూ, రెండో జడ్జిల కేసులోనూ పేర్కొన్నారు. కానీ వాటికి న్యాయ, కార్య నిర్వాహక వ్యవస్థలు రెండూ కట్టుబడకపోవడం శోచనీయం'' అంటూ సునిశిత విమర్శలు చేసింది. ''పైగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన ఈ ఎంఓపీని సవరించే అంశం కేంద్రం, సుప్రీంకోర్టు మధ్య దాదాపు ఏడేళ్లుగా పరిశీలనలో ఉంది. ఇంతకాలమైనా దానిపై ఏకాభిప్రాయానికి రావడంలో అవి విఫలమవడం నిజంగా ఆశ్చర్యకరం'' అంటూ ఆక్షేపించింది. ఇప్పటికైనా పరస్పరామోదంతో ఎంఓపీని సవరించి మరింత సమర్థంగా, పారదర్శకంగా తీర్చిదిద్దాలని సూచించింది. ''2021 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం తెలంగాణ, పట్నా, ఢిల్లీ హైకోర్టుల్లో సగానికి పైగా, మరో 10 హైకోర్టుల్లో 40 శాతానికి పైగా న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనాభాతో పోలిస్తే న్యాయమూర్తుల నిష్పత్తి అసలే చాలా తక్కువగా ఉంది. అలాంటప్పుడు ఇలా పలు పెద్ద రాష్ట్రాల హైకోర్టుల్లో ఇన్నేసి ఖాళీలుండటం చాలా ఆందోళనకరం'' అని అభిప్రాయపడింది.


హైకోర్టుల్లో ఖాళీలెన్నో...

దేశవ్యాప్తంగా 25 హైకోర్టులున్నాయి. గత డిసెంబర్ 5 నాటికి వాటిలో 1,108 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా 778 మందే ఉన్నారు. హైకోర్టు న్యాయమూర్తులుగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన 20 పేర్లను పునఃపరిశీలించాలంటూ కేంద్రం నవంబర్ 25న తిప్పి పంపడం తెలిసిందే.

సుఖ్వీందర్ అను నేను...

హిమాచల్ సీఎంగా ప్రమాణస్వీకారం


సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్ 15వ ముఖ్యమంత్రిగా సుఖ్వీందర్ సింగ్ సుఖు (58) ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు. రాష్ట్రానికి తొలి ఉప ముఖ్యమంత్రిగా ముకేశ్ అగ్నిహోత్రి (60) ప్రమాణం చేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ హాజరయ్యారు. సుఖు తల్లి, భార్య, కూతుళ్లతోపాటు కాంగ్రెస్‌కు చెందిన ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ సీఎంలు భూపేశ్ బఘేల్, అశోక్ గహ్లోత్ కూడా పాల్గొన్నారు. సుఖుకు ప్రధాని మోదీ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రమాణస్వీకారం సందర్భంగా తల్లితో సుఖ్వీందర్

గుజరాత్ సీఎంగా నేడు భూపేంద్ర ప్రమాణం

కార్యక్రమానికి హాజరు కానున్న ప్రధాని మోదీ



అహ్మదాబాద్: గుజరాత్ సీఎంగా బీజేపీ నేత భూపేంద్ర పటేల్(60) వరుసగా రెండోసారి సోమవారం ప్రమాణం చేయనున్నారు. గాంధీనగర్‌లోని కొత్త సెక్రటేరియట్ సమీపంలో ఉన్న హెలిప్యాడ్ మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ గుజరాత్ 18వ సీఎంగా భూపేంద్రతో ప్రమాణం చేయించనున్నారు. కార్యక్రమానికి ప్రధాని మోదీతోపాటు హోం మంత్రి అమిత్ షా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. భూపేంద్ర పటేల్‌తోపాటు కొందరు నూతన మంత్రులుగా ప్రమాణం చేస్తారని భావిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 182 సీట్లకు గాను 156 స్థానాల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

కశ్మీర్‌లో 'ఫ్యామిలీ ఐడీ'

అన్ని కుటుంబాలతో డేటాబేస్

జమ్మూ: కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో అన్ని కుటుంబాల సమగ్ర వివరాలతో డేటాబేస్ సిద్ధం చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రతి కుటుంబానికి విశిష్టమైన అల్ఫా–న్యూమరిక్ కోడ్‌తో 'ఫ్యామిలీ ఐడీ' ఇవ్వనున్నారు. దీనితో లబ్ధిదారులను సులభంగా గుర్తించవచ్చని అధికారులు చెబుతున్నారు. జమ్మూకశ్మీర్ విజన్ డాక్యుమెంట్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, హరియాణా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ ఇటీవల విడుదల చేయడం తెలిసిందే. కుటుంబాల డేటాబేస్‌ను వారి అనుమతితో డిజిటల్ రూపంలో సేకరించి భద్రపర్చనున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ ఫ్యామిలీ ఐడీ ఉన్నవారు ప్రభుత్వ పథకాల కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. అర్హులు, అనర్హులు ఎవరన్నది వెంటనే తెలిసిపోతుంది. అర్హులకు పథకాలు అందుతాయి. హరియాణాలో 'పరివార్ పెహచాన్ పత్ర' పేరిట ఇలాంటి విధానమే అమల్లో ఉంది. జమ్మూకశ్మీర్‌లో ఫ్యామిలీ ఐడీ ఆలోచనను బీజేపీ స్వాగతించింది. డేటాబేస్ సిద్ధమైన తర్వాత ప్రజలు ప్రభుత్వ పథకాల కింద లబ్ధి పొందడం సులభతరం అవుతుందని పేర్కొంది. అయితే, ఈ డేటాబేస్‌పై కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) తదితర పార్టీలు మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆచరణ సాధ్యమేనా? ఇందులో ఏదైనా మతలబు ఉందా? ఇప్పటికే పౌరులకు 'ఆధార్' ఉండగా, మరో గుర్తింపు కార్డు ఎందుకు? అని ప్రశ్నిస్తున్నాయి.



ఆదివారం గ్వాటెమాలాలోని ఫ్యూగో అగ్నిపర్వతం బద్దలైన దృశ్యం

బ్రిటన్ గజగజ

- మైనస్ 10 నుంచి 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- రోడ్లపై ప్రయాణాలకు అంతరాయాలు
- రైళ్లు, విమానాలు సైతం రద్దు



లండన్: మైనస్ 10 నుంచి 12 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలతో బ్రిటన్ గజగజ వణికిపోతోంది. ఈ సీజన్‌లో ఐస్‌ల్యాండ్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చలిపులి పంజా విసురుతోంది. విపరీతంగా కురుస్తున్న మంచుతో రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకదానికొకటి ఢీకొంటున్నాయి. ముందున్న వాహనం కూడా కనిపించని పరిస్థితి. వాహనాలతో రోడ్లపైకి రావొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రయాణాలు మానుకోవాలని చెప్పారు. చాలాచోట్ల యజమానులు తమ కార్లను రహదారుల పక్కన వదిలేసి వెళ్లిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కాట్స్‌వాల్డ్, బ్రిస్టల్, సౌత్ వేల్స్, హియర్‌ఫోర్డ్‌షైర్, కాంబ్రియా, షెఫీల్డ్ తదితర ప్రాంతాల్లో మంచు పెద్ద ఎత్తున పేరుకుపోయింది. కొన్నిచోట్ల పట్టాలపై మంచు కప్పేయడంతో రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఇక లండన్‌లోని హీత్రూ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం ఏకంగా 48 విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. కొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. హీత్రూ ఎయిర్‌పోర్ట్‌లో జనం బారులు తీరారు. కెంట్, ఎస్సెక్స్, లండన్‌లో భారీగా మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. లండన్‌ సహా సౌత్, సెంట్రల్ ఇంగ్లాండ్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. స్కాట్లాండ్‌లో మైనస్ 15 డిగ్రీలు నమోదైంది. దీనికి ఆర్కిటిక్ బ్లాస్ట్ కారణ మని నిపుణులు చెబుతున్నారు. ''ధ్రువాల వద్ద తక్కువ పీడనం వల్ల ఇలా జరుగుతుంది. వాతావరణంలో తీవ్ర మార్పులు, ఉష్ణోగ్రతలు హఠాత్తుగా పడిపోవడం ఆర్కిటిక్ బ్లాస్ట్ ప్రభావమే'' అంటున్నారు.



భారత్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం రాజస్తాన్‌లోని కోట్‌ఖుర్ద్ గ్రామంలో ఎడ్లబండి నడుపుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

సాక్షి
విజయనగరం
సోమవారం । 12 । డిసెంబర్ । 2022



ఆవేదనకు అంతం ఎప్పుడు?
గమ్యస్థానాలకు చేరాల్సిన వారి ప్రాణాలు మధ్యలోనే గాలిలో కలిసిపోతున్నాయి. - 8లో



ఐయ్యో రామా..!
తాజాగా ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులతో పాటు కళ్లకలక పొంచి ఉంది. - 8లో



క్రికెట్ ప్రీమియర్‌లీగ్ ప్రారంభం
జగనన్న ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నీ ఉత్సాహ భరిత వాతావరణంలో ఆదివారం ప్రారంభమైంది. - 8లో

న్యూస్‌రీల్

రామతీర్థంలో వైభవంగా ఆదిత్య హృదయ హోమం



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం యాగశాలలో ఆదిత్య హృదయ హోమాన్ని వైభవంగా జరిపించారు. సుదర్శన, సుందరకాండ, ధన్వంతరి తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పరోక్ష సేవలో భాగంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతుల పేరిట అర్చకులు స్వామి కల్యాణ మహోత్సవాన్ని చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీల ప్రచార పత్రం విడుదల చేస్తున్న జేవీవీ సభ్యులు

విజయనగరం అర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వివిధ దశలలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలు స్థానిక సత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లా స్థాయి పరీక్షల విజేతలు వచ్చే జనవరి 8, 9 తేదీలలో కడప జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల పోటీలో జిల్లా తరపున పోటీ పడతారని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల ప్రచార పత్రాన్ని విడుదల చేశారు. సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాయిదేవమణి, వేదిక ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, జిల్లా నాయకులు మురళీబాబు, శశిధర్, నిర్మల, సునీల్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : జేసీ



విజయనగరం అర్బన్: అకాల వర్షాల పరిస్థితులను రైతులు ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని జేసీ మయూర్ అశోక్ తెలిపారు. మండూస్ తుపాను నేపథ్యంలో జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలకు పంట పాడవకుండా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ద్వారా ముందుగానే రైతులకు తెలియజేస్తామని తెలిపారు. జిల్లాలో ఎక్కడెక్కడ ధాన్యం తడిసిపోయే అవకాశం ఉందో ఆయా ప్రాంతాలలో వ్యవసాయ శాఖ/పౌర సరఫరాల శాఖ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేసి రైతులకు సూచనలు జారీ చేసి తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో వాతావరణ మార్పులు దృష్ట్యా మార్పిడి అయిన ధాన్యం మేరకు గోనె సంచులను సరఫరా చేసి సంబంధిత మండల అధికారుల సహాయంతో సురక్షిత ప్రాంతాలలో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం తడిసిన సందర్భంలో అటువంటి ధాన్యం తరలించడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా రవాణా శాఖ ద్వారా వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఏ సహాయం కావాలన్నా సంబంధిత మండల అధికారులకు/ఆర్‌బీకే సిబ్బందికి తెలియపరచాలని లేదా జిల్లా కంట్రోల్ రూమ్ 89789 75284 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

విజయమే లక్ష్యంగా..
ముందుకు సాగుదాం..

- 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలి
- జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం పెద్దపీట
- పార్టీ పటిష్టతే ధ్యేయంగా త్వరలో గృహ సారథుల వ్యవస్థ
- టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేద్దాం..: మంత్రి బొత్స
- విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

విజయనగరం:

సాంస్కృతిక రాజధాని... మహాకవి గురజాడ పుట్టిన గడ్డ... పైడితల్లమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండే విజయనగరం జిల్లా అభివృద్ధి పథంలో నడిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అందరం కలిసిగట్టుగా పని చేద్దామని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. 2024 ఎన్నికలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల దిశా నిర్దేశం చేశారని, పార్టీ ఆదేశానుసారం ప్రతి ఒక్కరు కష్టించి పని చేయాలన్నారు. నగర శివారుల్లో గల ఫూల్‌బాగ్ జగన్నాథ కల్యాణ మండపం ప్రాంగణంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైవీ సుబ్బారెడ్డితో పాటు జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో విశాఖలో పరిపాలన ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానం చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పంపించాలని నిర్ణయించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించిన ఇన్‌చార్జిలను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ఉత్సాహంగా పని చేయాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో పార్టీ సాధించిన విజయమే స్ఫూర్తిగా 2024 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని చెప్పారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయటంలో భాగంగా ప్రభుత్వానికి సమాంతరంగా పార్టీలో సమన్వయకర్తలు, గృహ సారథుల వ్యవస్థను తీసుకురావటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు సమన్వయకర్తలు, ఒక్కో వలంటీర్ పరిధిలో ఉన్న 50 ఇళ్లకు ఇద్దరు గృహ సారథులను నియమించటం జరుగుతుందన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు.

నవరత్నాలతో మేలు

అధికారంలోకి రాకముందు 3648 కిలోమీటర్ల మేర రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పటి ప్రభుత్వం ప్రజలకు పెడుతున్న కష్టాలు తెలుసుకుని వాటిని తీర్చటంలో భాగంగానే నవరత్నాలను మేనిఫెస్టోలో పెట్టి చిత్తశుద్ధితో అమలు చేయటం జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో 75 శాతం హామీలను అమలు చేయగా.. గడిచిన మూడున్నరేళ్లలో 98 శాతం ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని గర్వంగా ప్రజలకు చెప్పాలని సూచించారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సచివాలయాల ద్వారా పారదర్శకంగా పథకాలు అమలు చేయటం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మఒడి పథకం ప్రవేశపెట్టడంతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతు భరోసా విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్న ఘనత మనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో నూతనంగా 14 మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. విజయనగరం జిల్లాలో రూ.450 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల ఇళ్లు నిర్మిస్తుంటే ఉమ్మడి విజయనగరం జిల్లాలో లక్ష ఇళ్లు పేదల కోసం నిర్మిస్తున్నామన్నారు.

జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట

విజయనగరం జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాకే తలమానికంగా చెప్పుకునే భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తాగు, సాగు నీటి అవసరాల కోసం ఆలోచించి జిల్లాలో తోటపల్లి, జంఝావతి వంటి ప్రాజెక్టులు నిర్మిస్తే...మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.850 కోట్లతో జల జీవన్ మిషన్ పేరిట ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్‌లు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వెనుకబడిన ప్రాంతాలైన విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల అభివృద్ధే ధ్యేయంగా మూడు రాజధానుల పేరిట విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందడుగు వేస్తుంటే... ఒక సామాజిక వర్గం అభివృద్ధి కోసం అమరావతి పేరిట రాజధాని నిర్మించేందుకు పోరాటాలు చేయటాన్ని గమనించాలన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా త్వరలోనే విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం : మంత్రి బొత్స



18 నెలల్లో ఎన్నికలు రాబోతున్న తరుణంలో పార్టీ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయటంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఉన్న బూత్ కమిటీల స్థానంలో గృహ సారథులను నియమించటం జరుగుతుందన్నారు. సచివాలయ స్థాయిలో ముగ్గురు సమన్వయకర్తలను నియమించి వారి ద్వారా నిత్య పర్యవేక్షణ చేయటం జరుగుతుందన్నారు. సమన్వయకర్తల నియామక ప్రక్రియను ఈ నెల 20లోగా పూర్తి చేసి జిల్లా పార్టీకి అందజేయాలని సూచించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గత ప్రభుత్వంలా బిల్లులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు చెల్లింపులు చేయటం జరుగుతుందన్నారు. దివంగత వైఎస్సార్ హయాంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న తాటాకుల ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించుకోవటం జరిగిందని, తాజాగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరిట టౌన్‌షిప్‌లు నిర్మించుకోవటం జరుగుతుందన్నారు. వలసల నివారణకు అమలు చేస్తోన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 55 కోట్ల బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికారం కల్పించాలనే మంచి ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం 80 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు లభించాయన్నారు. విశాఖలో రాజధాని వస్తే మీకు వద్దా.. రాజుగారు అంటూ మాజీ కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజుకు మంత్రి బొత్స ప్రశ్నించారు. విమానయాన మంత్రిగా ఎన్నికైన అశోక్‌గజపతిరాజు జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు. దొడ్డిదారిన దర్శనాలకు వెలుతున్న వారిని అడ్డుకుని సాధారణ భక్తులకు దర్శనం కల్పించటానికి బాధ్యతగా పని చేస్తే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అమ్మవారి పండగ రోజున గేట్లుకు తాళాలు వేసి జేబులో పెట్టుకున్నారంటూ విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. మీ హయాంలో మీ తాబేదారులకు తాళాలు ఇచ్చి సాధారణ భక్తులకు ఇబ్బందులు పెట్టడం మా పద్ధతి కాదన్నారు. రాజుగారికి పిచ్చి పట్టిందా అంటూ వ్యాఖ్యానించారు. మేము మహరాజులం.. మేము ఏమి మాట్లాడినా ప్రజలు వింటారనుకోవటం సరి కాదన్నారు. సామాన్యుల కష్టాల తీర్చిన వారినే ప్రజలు నాయకుడిగా కోరుకుంటారన్నారు.

సమావేశంలో ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, నియోజకవర్గ పరిశీలకులు నరేష్‌కుమార్ అగర్వాల్, పేడాడ తిలక్, కరిమి రాజేశ్వరరావు, అంధవరపు సూరిబాబు, తైనాల విజయ్‌కుమార్, డాక్టర్ నిమ్మాన దాసు, మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, జీసీసీ చైర్మన్ డాక్టర్ శోభా స్వాతీరాణి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినవెంకటరామునాయుడు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, పార్టీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, ఎంఎల్ఎన్ రాజు, ఆశపు వేణు, ఎస్.బంగారునాయుడుల తో పాటు వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఎన్నికలకు సమాయత్తం కావాలి



2024 ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలి. 2019 ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9 ఎమ్మెల్యేలు, 3 ఎంపీలు స్థానాలు క్లీన్‌స్వీప్‌గా గెలుచుకున్నాం. 2024లో మరల ఆ రికార్డును మనమే తిరగరాసుకుందాం. మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనపై ప్రజాదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్షలు వారి అనుకూల మీడియాతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలి. ఇందుకోసం ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం. త్వరలో నియమించబోయే గృహ సారథులు రానున్న ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలి. జనవరిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన జరగనుంది. తారకరామతీర్థసాగర్‌ను పూర్తి చేస్తాం. సారిపల్లి నిర్వాసితులకు రూ.72 కోట్ల ప్యాకేజీ త్వరలో మంజూరు చేస్తాం. ప్రతి ఇంటికి తాగు నీటి కుళాయిలు కల్పిస్తాం. ఇప్పటికే వేలాదిగా ఇళ్లు మంజూరు చేశాం. ప్రజల్లోకి ప్రభుత్వ పాలనను విస్తృతంగా తీసుకువెళ్లాలి.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, జెడ్పీ చైర్మన్, విజయనగరం

చంద్రబాబు పాలన మన ఖర్మ



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు విస్మరించి.. మరల ప్రజలను మభ్యపెట్టేందుకు కొత్త హామీలు ఇవ్వటం చంద్రబాబు రాజకీయ నైజం. ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలించటం మనం చేసుకున్న ఖర్మ. అమరావతి పేరు చెప్పి ప్రజలను భ్రమల్లో ముంచేశారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపు వైఎస్సార్‌సీపీదే. అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించటంలో విజయవంతమయ్యాం. ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మిస్తుంటే లబ్ధిదారులకు అసత్యాలు చెప్పి నిర్మాణాలు అడ్డుకునే స్థాయికి టీడీపీ నేతలు దిగజారిపోవటం సిగ్గు చేటు.

– పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం, సాలూరు ఎమ్మెల్యే

కష్టపడి పని చేద్దాం



రానున్న ఏడాదిన్నర కాలం ఎంతో కీలకం. ఎన్నికలకు సమీపిస్తున్న తరుణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా చిత్తశుద్ధితో పాటిస్తూ జిల్లాలో 7 ఎమ్మెల్యే, మూడు ఎంపీ స్థానాలను గెలుచుకోవాలి.

– శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, బొబ్బిలి ఎమ్మెల్యే

అందరికీ సంక్షేమ ఫలాలు



కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. మన ప్రభుత్వ సిద్ధాంతాలు ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాయి. ఇదే ప్రభుత్వ ఉత్తమ పాలనకు నిదర్శనం.

– కంబాల జోగులు, రాజాం ఎమ్మెల్యే

అన్ని స్థానాలూ గెలవాలి



అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని తొలగించేందుకు నిరంతరం విమర్శలు చేస్తున్న టీడీపీ, ఎల్లో మీడియా ప్రచారాలను తిప్పికొట్టాలి. జిల్లాలో రూ. 450 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నాం. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో జిల్లా మరింత అభివృద్ధిపథంలో దూసుకువెళ్లనుంది. జిల్లాలో అన్ని స్థానాలను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– బెల్లాన చంద్రశేఖర్, ఎంపీ, విజయనగరం

చంద్రబాబు 420



ప్రతిపక్ష నేత చంద్రబాబు 420. చీటర్. రాష్ట్ర ప్రజలు ఆయన్ను, టీడీపీ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమల్లో ప్రజలను మోసం చేసి పబ్బంగడుపుకున్నారు. అందుకే ప్రజలు 2019 ఎన్నికల్లో 23 సీట్లకే పరిమితం చేశారు. తాజాగా బాదుడే.. బాదుడు, ఇదేం ఖర్మ పేరిట ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. మరల అధికారం కల్పిస్తే అది చేస్తాం... ఇది చేస్తాం అంటూ హామీలు ఇస్తున్నారు. అధికారంలో ఉండగా అమలు చేయని హామీలు... మరల కొత్తగా ప్రకటించటాన్ని ప్రజలు స్వాగతించారు. మూడు రాజధానుల కు మద్దతుగా ఎంతటి పోరాటానికైనా సిద్ధం కావాలి. జిల్లాలో మంత్రి బొత్స సత్యనారాయణ సారథ్యంలో 2024 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేసుకుందాం.

– కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్

ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలి



ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు, అందిస్తున్న సంక్షేమ ఫలాలను వారికి అర్థమయ్యేలా వివరించి నమ్మకాన్ని పెంపొందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మూడున్నరేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1.75 లక్షల కోట్లు సంక్షేమ పథకాల రూపంలో రాష్ట్ర ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయటం జరిగింది. పేదలకు మంచి చేసే ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాలి.

– కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, ఎస్.కోట

ఇచ్చిన హామీలన్నీ అమలు



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. మూడున్నరేళ్లలో 98 శాతం హామీలు అమలు చేశాం. ముఖ్యమంత్రిగా మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవటం మనందరి బాధ్యత.

– బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్యే, గజపతినగరం

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు గుర్ల విద్యార్థులు



కుస్తీ పోటీలకు ఎంపికైన వారితో కోచ్‌లు

గుర్ల: రాష్ట్ర స్థాయి పోటీలకు గుర్ల విద్యార్థులు ఎంపికైనట్టు కుస్తీ కోచ్ కర్రోతు జగదీశ్, ఉదయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. అండర్ – 14, అండర్ – 17లకు గుర్ల ప్రభుత్వ కళాశాల లో శిక్షణ పొందుతున్న తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన వారిలో పి. పావని, వి.యమున, ఎల్.శ్వేత, ఆర్.అనూష, ఎల్.రష్మిత, పి.ఉష, ఎస్.భావని, కె.రమణమ్మ, సీహెచ్ మేఘన, కె.శివ, సీహెచ్ వాసు, తరుణ్, ఎం. కోటి, చందు, మహదేవ్ ఉన్నారని తెలిపారు. ఎంపికైనా క్రీడాకారులు ఈ నెల 18 నుంచి 20 వరకు తిరుపతి, రేణిగుంటలో జరగనున్న రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

లక్ష్యం దిశగా 'ప్రయోగాలు'

ఖరీఫ్ వరి పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే వచ్చేటట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో దిగుబడుల లెక్క కట్టేందుకు వ్యవసాయాధికారులు విస్తృతంగా పంటకోత ప్రయోగాలు చేస్తున్నారు. లక్ష్యానికి చేరువవుతున్నారు. దీంతో దిగుబడుల లెక్క తేలనుంది.

- చేయాల్సిన పంట కోత ప్రయోగాలు 2024
- ఇంత వరకు చేసినవి 1632
- ఎకరానికి 26 నుంచి 30 బస్తాల దిగుబడి
- ఖరీఫ్‌లో 87వేల హెక్టార్లలో వరి సాగు
- 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం

విజయనగరం ఫోర్ట్: ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు అనుకూలించడంతో వరి పంట బాగా పండింది. సాగు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు సాగునీరు పుష్కలంగా లభించడంతో పాటు వాతావరణం అనుకూలించడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ క్రమంలో ధాన్యం దిగుబడులను అంచనా వేసేందుకు వ్యవసాయ అధికారులు జిల్లా వ్యాప్తంగా పంట కోత ప్రయోగాలు చేపట్టారు. ఇప్పటికే 81 శాతం ప్రయోగాలు చేశారు. ఒకటి రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్ల దిగుబడి బాగానే వస్తుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరి పంట ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం 90 వేల హెక్టార్లు కాగా ఈ ఏడాది 87 వేల హెక్టార్లలో సాగు జరిగింది.



ధాన్యం తూకం వేస్తున్న వ్యవసాయ సిబ్బంది

81 శాతం పూర్తి

పంట కోత ప్రయోగాలు జిల్లా వ్యాప్తంగా చేపడుతున్నాం. ఇప్పటికే 81 శాతం పూర్తయ్యాయి. వారం, 10 రోజుల్లో ప్రయోగాలు పూర్తవుతాయి. దిగుబడి ఆశాజనకంగానే ఉంది. రైతులకు ధాన్యం విక్రయించుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పించాం. – వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

పంట కోత ప్రయోగాల లక్ష్యం 2024

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట కోత ప్రయోగాలు లక్ష్యం 2024 కాగా, ఇంతవరకు 1632 పంట కోత ప్రయోగాలు చేశారు. ఇప్పటికే 81 శాతం పంట కోత ప్రయోగాలు పూర్తయ్యాయి. పంట కోత ప్రయోగాలను రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, వ్యవసాయ అధికారి సమక్షంలో చేస్తున్నారు.

హెక్టార్‌కు 5300 నుంచి 6000 కేజీల ధాన్యం

ఖరీఫ్‌లో 87 వేల హెక్టార్లలో వరి పంట సాగైంది. ప్రస్తుతం నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లో హెక్టార్‌కు 5300 నుంచి 6000 కేజీల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన 26 నుంచి 30 బస్తాలు వచ్చే అవకాశం ఉంది. కొన్ని చోట్ల 32 నుంచి 35 బస్తాల దిగుబడి కూడా వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా 5 లక్షల నుంచి 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

పంట కోత ప్రయోగ ఫలితాలిలా..

మండలం	దిగుబడి బస్తాల్లో (ఎకరాకు)
నెల్లిమర్ల	30
చీపురుపల్లి	29
మెరకముడిదాం	29
గుర్ల	29
దత్తిరాజేరు	28
విజయనగరం	28
సంతకవిటి	28
గజపతినగరం	27
పూసపాటిరేగ	27
డెంకాడ	27
జామి	27
బొండపల్లి	27
బొబ్బిలి	27
గంట్యాడ	27
తెర్లాం	27

క్లుప్తంగా

కోడిపందాల శిబిరంపై పోలీసుల దాడి

మెరకముడిదాం: మండలకేంద్రం సమీపంలో ఆదివారం నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై బుదరాయవలస ఎస్సై నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో శిబిరంలో కోడిపందాలు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు.

త్రుటిలో తప్పిన ముప్పు



కాలువ సమీపంలోకి దూసుకుపోయిన బస్సు

బొబ్బిలి రూరల్: విజయనగరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ పట్టేయడంతో మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామం వద్ద కాలువవద్దకు దూసుకుపోయింది. డ్రైవర్ కృష్ణ అప్రమత్తమై బస్సును అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో బస్సులో ఉన్నవారికి కానీ, సమీపంలో ఉన్నవారికి కానీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ కృష్ణ అందరినీ కాపాడారని ఆయన ముందుజాగ్రత్తను అందరూ కొనియాడారు. ప్రయాణికులంతా బస్సునుంచి జాగ్రత్తగా దిగిబయటకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. బస్సుకు తాత్కాలికంగా మరమ్మతులు చేసి డిపోకు తరలించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



దుర్గాప్రసాద్ మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన దాసరి దుర్గాప్రసాద్ (29) ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. దాసరి దుర్గాప్రసాద్‌కు జూన్ నెలలో వీరఘట్టం మండలం నడుకూరు గ్రామానికి చెందిన గాయత్రితో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె 5 నెలల గర్భిణి. అయితే వేరే యువతిలో ప్రేమలో ఉన్నట్లు భర్త తనతో చెప్పాడని మృతుని భార్య తెలిపింది. అత్తమామలతో తామిద్దరం కలిసి ఉంటున్నామని, ఎటువంటి ఉద్యోగం లేక మనస్తాపం చెంది ఉరివేసుకుని మృతిచెందినట్లు భర్త మేనమామ చెప్పడంతో తెలిసిందని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మృతుడి భార్య పేర్కొంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు.

విజయనగరంలో రంజీ మ్యాచ్

- 13 నుంచి తలపడనున్న ఆంధ్రా–ముంబై జట్లు
- హాజరుకానున్న అంతర్జాతీయ క్రీడాకారులు

విజయనగరం: క్రీడలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన విజయనగరం జిల్లా కేంద్రం రంజీ క్రికెట్ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు టెస్ట్ మ్యాచ్ తరహాలో జరగనున్న మ్యాచ్‌లో అతిథ్య ఆంధ్రా, ముంబై జట్లు తలపడున్నాయి. ఈనెల 13న ఉదయం 9 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుండగా..ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో పలువురు అంతర్జాతీయ క్రికెటర్‌లు ఆడనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు తెలిపారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రేక్షకులకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తరఫున హనుమ విహారి (కెప్టెన్), రిక్కీబుయ్, సీఆర్.జ్ఞానేశ్వర్, యుఎంఎస్ గిరినాథ్, అభిషేక్ రెడ్డి, ఎస్‌కె రషీద్, కరణ్‌షిండే, నితీష్‌కుమార్ రెడ్డి, షోయబ్‌ఖాన్, లలిత్ మోహన్, కేవీ శశికాంత్ తదితరులు ఆడనున్నట్లు తెలిపారు. అలాగే ముంబై జట్టు తరఫున అజింక్యారహానే (కెప్టెన్) పృథ్వీషా, యశస్వి జైశ్వాల్, సర్ఫరాజ్‌ఖాన్, ప్రసాద్ పవర్, ములాని, తనుష్, హర్దిక్ తమోర్, రోయస్టన్, తుషార్ దేశ్‌పాండే, అర్మన్‌జాఫర్, ముషీర్‌ఖాన్, శశాంక్ , సిద్ధార్థ్ రాట్, మోహిత్, సువిద్‌పార్కర్, సూర్యాన్స్‌లు ఆడనున్నట్లు తెలిపారు.

ఆవేదనకు అంతం ఎప్పుడు?

- ప్రమాదాలకు నిలయంగా 16వ నంబర్ జాతీయ రహదారి
- ఏడాదిలో 30 ప్రమాదాలు..15 మందికి పైగా మృత్యువాత
- నివారణ చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

2017 నుంచి 2002 వరకు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణించిన, గాయాలపాలైన వారి వివరాలు

సంవత్సరం	మరణించిన వారి సంఖ్య	గాయాలపాలైన వారు
2017	20	50
2018	13	31
2019	08	27
2020	22	15
2021	18	22
2022	12	18



భోగాపురం 16వ నంబర్ జాతీయ రహదారి



జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న లారీ



సవరవిల్లి జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

భోగాపురం: గమ్యస్థానాలకు చేరాల్సిన వారి ప్రాణాలు మధ్యలోనే గాలిలో కలిసిపోతున్నాయి. ప్రతిరోజూ ఎవరో ఒకరిని మత్యువు కబళిస్తోంది.పూసపాటిరేగ, భోగాపురం మండలాల పరిధిలో రాజాపులోవ మొదలుకుని కందివలసగెడ్డ వరకు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో 15 మంది చనిపోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. ఇదీ 16వ నంబర్ జాతీయ రహదారి దుస్థితి.

18 కి.మీ ఆదమరిస్తే అంతే

జిల్లా సరిహద్దు రాజాపులోవ మొదలుకుని కందివలస వరకూ దాదాపు 18 కి.మీ మేర ఉన్న జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పద్దెనిమిది కి.మీ ప్రయాణం సాఫీగా సాగిపోతే దాదాపు ప్రయాణాలు ప్రశాంతంగా సాగిపోయినట్లేనని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో మరణించిన వారు దాదాపు ఇతర ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో వెళ్తున్న 16 నంబర్ జాతీయ రహదారిపై ఎక్కువగా ఒకే చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్‌లు సూచించినా ప్రమాదాలు ఆగడం లేదు. రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది, రవాణాశాఖ అధికారులు ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగేచోట అకకడక్కడా ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. అయితే వాహన వేగాన్ని నిరోధించే స్పీడ్ బ్రేకర్లు ఎక్కడా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

నిబంధనలు పాటించకపోవడం వల్లనే..

ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు అంటున్నారు. రోడ్లుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను ఆపడం, సర్వీస్ రోడ్లను వినియోగించుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. మరోవైపు రాత్రి పూట వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుండడం కూడా ప్రమాదాలు సంభవిస్తుండడానికి కాణంగా చెబుతున్నారు. ముఖ్యంగా టిప్పర్లు, ట్రావెల్ ప్రైవేట్ బస్సులు, కార్లు వేగంగా వెళ్తుంటాయని, ఆ వాహనాల వేగానికి కళ్లెం వేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి



16వ నంబర్ జాతీయ రహదారిలోని రాజాపులోవ, లింగాలవలస, పోలిపల్లి, సవరవిల్లి, భోగాపురం, పేరాపురం, కనిమెళ్ల, కందివలస ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా రాత్రి, తెల్లవారు జామున సమయాల్లో జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి సమయాల్లో, తెల్లవారు జామున స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని వాహదారులపై చర్యలు తీసుకుంటున్నాం. భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆటోల్లో ప్రయాణం సురక్షితం కాదు. ఆటోలలో అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలిస్తున్నారు. వాటిపైనా దృష్టి సారించాం. బ్లాక్ స్పాట్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాహనాల వేగని యంత్రణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం.

కేకేవీ విజయనాథ్, సీఐ, భోగాపురం

అ'పూర్వ' కలయిక

- 1995– 2002 బ్యాచ్ కోరుకొండ సైనిక విద్యార్థుల సమావేశం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులతో పాఠశాల అధికారులు

విజయనగరం రూరల్: రెండు దశాబ్దాల క్రితం తాము విద్యనభ్యశించిన సైనిక పాఠశాలను సందర్శించి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఉద్యోగాలు, ఇతరత్రా రంగాల్లో చేరినా, తాము చదువుకున్న పాఠశాలను మరోసారి చూడాలని, ప్రాంగణమంతా కలియదిరిగి ఉత్సాహంగా వారంతా గడిపారు 1995– 2002 బ్యాచ్‌కు చెందిన 75 మంది పూర్వ విద్యార్థులు 11 ఏళ్ల చిరుప్రాయంలో కోరుకొండ సైనిక పాఠశాలలో చేరి వేర్వేరు సెక్షన్‌లు, వేర్వేరు వసతి గృహాల్లో స్నేహితులుగా ఉండి ఒకే తరగతి గదుల్లో విద్యనభ్యశించారు. పాఠశాల విద్య అనంతరం ఉన్నత చదువులు చదువుకుని అనేకమంది దేశ రక్షణ రంగం, ఇంజినీరింగ్, వ్యాపారాల్లో రాణించగా మరికొంత మంది విదేశాల్లో స్థిర నివాసం ఏర్పరుకున్నా వారి చిన్ననాటి పాఠశాల గుర్తులను మరోసారి అంతా కలిసి కుటుంబ సమేతంగా వచ్చి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అద్భుతం

పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి పూర్వ ప్రసంగించారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు నేడు దేశ రక్షణ, ఇంజినీరింగ్, వ్యాపార, వైద్య, విద్యారంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకోవడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఇంతమంది ఉన్నతులను తీర్చిదిద్దిన పాఠశాల రుణం తీర్చుకోవడానికి, వారి గత స్మృతులను మరోసారి జ్ఞప్తికి తెచ్చుకోవడానికి పాఠశాలకు వస్తున్న పూర్వ విద్యార్థులు అభినందనీయులన్నారు. ప్రస్తుత విద్యార్థులు వారందరినీ ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ ఎస్.కేశవన్, పరిపాలనాధికారి, లెఫ్టినెంట్ కమాండర్, అభిలాష్ బాలచంద్రన్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐయ్యో రామా..!

- కలవరపెడుతున్న కళ్లకలక
- నియంత్రణే వైద్యం
- తక్షణమే వైద్యులను సంప్రదించాలి
- జిల్లాలో ఏడాదికి సగటున 300 మందికి కలకలు
- శీతాకాలంలో మరింత వ్యాపించే ఆస్కారం
- జాగ్రత్తలు తప్పనిసరి



మెద్రాస్ ఐ పోకిన కళ్లు



నేత్ర వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న, డాక్టర్ నగేష్ రెడ్డి

పార్వతీపురం టౌన్: తాజాగా ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులతో పాటు కళ్లకలక పొంచి ఉంది. ఇది ప్రమాదకరం కాకపోయినా అంటు వ్యాధి కావడంతో విద్యార్థులకు సోకితే వారి చదువులకు ఆటంకం కలగకతప్పదు. కళ్లు వాపు, ఎరుపెక్కి ..నేత్రాల్లో ఇసుక వేసినట్లు తీవ్రమైన మంటగా ఉండడం దీని ప్రధాన లక్షణం. అడినో అనే వైరస్ కళ్ల కలకకు కారణం. ఇది రుతువులు మారే సమయంలో విస్తరిస్తుంది. సాధారణంగా వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగి, వేడి గాలులు వీచే సమయంలో, శీతాకాలంలో ఎక్కువగా ప్రబలుతుంది. ఇది పిలవకుండా వచ్చిపోయే అతిథి లాంటింది. దీనిని 'పింక్ ఐ'గా పిలుస్తారు. 1918వ సంవత్సరంలో నాటి మద్రాస్‌లో కొత్తరకం కళ్లవ్యాధి వేగంగా వ్యాపించింది. దానికి గల కారణాన్ని పరిశోధించి అడినో వైరస్ అని గుర్తించారు. మద్రాసులో మొదట గుర్తించడం వలన దీనికి మెద్రాస్ ఐ అని పేరుపెట్టారు. వాతావరణంలో దుమ్ము, ధూళివల్ల అతి సులభంగా అలర్జీ ఎర్పడుతుంది. దీంతో కళ్లకు జిల వస్తుంది. రుద్దితే కళ్లు ఎర్రగా మారి వాచిపోతాయి. కొన్ని సార్లు కళ్లలో నుంచి నీరు కారుతూనే ఉంటుంది. జలుబు చేసి, గొంతులో సమస్యలు ఏర్పడతాయి. ఇది మెల్లగా ఒక కంటికి సోకి, తరువాత మరో కంటికి పాకుతుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే కళ్ల నుంచి చీము వంటి ద్రవం కారుతుంది. నిద్ర లేచినప్పుడు కళ్లు తెరవలేని పరిస్థితి ఏర్పడుతుంది. రెండు కనురెప్పలు అంటుకుపోతాయి. మెద్రాస్ ఐ రెండు నుంచి ఐదు రోజుల్లో తగ్గిపోతుంది. కొన్ని సందర్భాల్లో తగ్గనట్లయితే వైద్యులను సంప్రదించి చికిత్స విధానాలు పాటించాల్సి ఉంటుంది. నేత్ర వైద్యులను సంప్రదించినట్లయితే వ్యాధి తీవ్రతను బట్టి మందులు ఇస్తారు.

జిల్లాలో ఏడాదికి 300 మందికి కలక

జిల్లాలో సంవత్సరానికి సగటున 300 మందికి కళ్ల కలక వస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లాలో గిరిజన గ్రామాలు ప్రజలు ఎక్కువగా మాఢనమ్మకాలు, నాటు వైద్యం చేయించుకుని మరింత అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

సులభంగా నియంత్రణ

రద్దీ ప్రాంతాలకు వెళ్లకూడదు. మెద్రాస్ ఐ సోకిన కళ్లను నేరుగా కళ్లతో చూస్తే అంటుకోదు. చేతులను తాకడం ద్వారా సోకుతుంది. కనుక చేతులను తరచూ సబ్బుతో కడగడం మంచిది. టిష్యూ పేపర్‌ను ఉపయోగించుడం శ్రేయస్కరం. ఇతరులకు సోకకుండా కళ్లకు నల్లటి అద్దాలను ధరించాలి. అప్పుడప్పుడు చల్లటి నీటితో కళ్లను కడుగుతుండాలి. టీవీలు, కంప్యూటర్లు చూడడం, పేపరు చదవడం వంటివి చేయకుండా ఎక్కువ వెలుతురు పడని విధంగా విశ్రాంతి తీసుకోవాలి. క్రిములతో కూడిన కళ్ల నుంచి కారే నీళ్లు ఇతరుల చేతులపై పడితే వెంటనే వారికి కూడా సోకుతుంది. రోగుల చేతిరుమాళ్లు, పరుపులు, టవల్, దుస్తులను ఇతరులు ఉపయోగించ కూడదు. కళ్లకు వేసే చుక్కల మందును వైద్యుల సూచనల మేరకు రోజుకు 6 నుంచి 8 సార్లు వేసేకోవాలి. నీరు కారేటప్పుడు కళ్లను శుభ్రపరుచుకోవడానికి చేతి రుమాలు మాత్రమే ఉపయోగించాలి.

ఆందోళన అవసరం లేదు



కళ్లను చల్లటి మంచి నీటితో కడుక్కోవాలి. మెత్తటి చేతి రుమాలుతో కళ్లు తుడుచుకోవాలి. వైద్యుల సూచనల మేరకు సిప్లాక్స్, లూబ్రికేటెడ్ ఐడ్రాప్స్ వాడితే సరిపోతుంది. యాంటీ బయాటిక్ చుక్కల మందును గంటకు ఒకసారి రెండు చుక్కలు వేసుకోవాలి. పిల్లలకు వస్తే ఆందోళన చెందాల్సిన పనిలేదు. మొదటి రెండు రోజులు పాఠశాలకు పంపకూడదు.

– డాక్టర్ నగేష్ రెడ్డి, వైఎస్సార్ కంటివెలుగు వైద్యాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

జనసంచారంలో తిరగ వద్దు



చలికాలంలో కళ్లు పాడిబారడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఎక్కువగా జన సంచారంలో తిరగకూడదు. మిగిలిన వారికి కూడా ప్రబలే ఆస్కారం ఉంది. ఒకరు వాడిన బట్టలు మరొకరు ఉపయోగించకుండా, నదీ స్నానాలు వంటివి ఆచరించకుండా ఉండాలి. ఈ వ్యాధి బారిన పడిన వారు 5 రోజుల్లో తగ్గకుంటే వైద్య నిపుణులను సంప్రదించాలి.

–డాక్టర్ బి.వాగ్దేవి, డీసీహెచ్‌ఎస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం మన్యం జిల్లా

జగనన్న క్రికెట్ ప్రీమియర్‌లీగ్ ప్రారంభం

- హాజరైన జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జేపీఎల్ క్రికెట్ టోర్నీలో పాల్గొన్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



స్వాగత నృత్యంలో చిన్నారులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలో తలపెట్టిన జగనన్న ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నీ ఉత్సాహభరిత వాతావరణంలో ఆదివారం ప్రారంభమైంది. డీసీఎంఎస్ ఛైర్మన్ అవనాపు భావన, వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్ సారథ్యంలో అయోధ్యామైదానం వేదికగా 10 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన టోర్నీని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులు ముఖ్యతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి టోర్నీని లాంఛనంగా ఆరంభించారు. టోర్నీలో 50 జట్లు పోటీ పడుతుండగా...విజేతలుగా నిలిచే జట్లకు ప్రథమ బహుమతి కింద రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు నగదు బహుమతులను ప్రదానం చేయనున్నారు. ఇదిలా ఉండగా మొదటి రోజు 8 మ్యాచ్‌లు నిర్వహించగా..35వ డివిజన్‌కు చెందిన స్టార్ లెవెన్స్, 3వ డివిజన్‌కు చెందిన వజ్రపు లెవెన్స్, 22వ డివిజన్‌కు చెందిన డీకే యూత్, 28వ డివిజన్‌కు చెందిన వినయ్ లెవెన్స్ జట్లు విజేతలుగా నిలిచాయి. అంతకుముందు కార్యక్రమంలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక నగరంలో 50 టీమ్‌లు తయారు చేయడం, పోటీలు నిర్వహించడం సాధారణ విషయం కాదని ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అవనాపు విక్రమ్ భావన దంపతులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌కోట వైస్ ఎంపీపీ సుధారాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, ప్రెస్ అకాడమీ కార్యదర్శి తిలక్, వైఎస్సార్ సీపీ నాయకుడు కాళ్ల గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేద్కర్ గురుకులంలో జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం జరిగింది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వి.రామారావు, జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడా కార్యదర్శి మల్లేశ్వర్రావుల ఆధ్వర్యంలో జరిగిన క్రీడాకారుల ఎంపికకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 200 మంది హాజరయ్యారు. చివరికి వి.మహేశ్వరి, ఎస్.నిత్యశ్రీ, పి.వనప్రియ, పి.నవ్యశ్రీ, టి.భాగ్య, పి.విజయలక్ష్మి, సీహెచ్.శ్రావణి, ఎస్.లక్ష్మీదేవి, పి.యమున, ఎ.జ్ఞానప్రసన్న, వి.గీతిక, ఎన్. జ్యోత్స్న, ఎం.జ్యోత్స్న, వై.హారిక, రుచిత, కె.హారికలు జట్టులోకి ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా ఎం.దీపిక, ఎ.గ్లోరీలను ఎంపిక చేశారు. బాలుర టీమ్‌లో 30 మంది ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావుతో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన సైనికులకు అభినందన



ఉద్యోగాలు పొందిన వారిని అభినందిస్తున్న శిక్షకుడు రావు శ్రీనివాసరావు

బొబ్బిలి: పట్టణంలోని స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు, క్రీడా శిక్షకుడు రావు శ్రీనివాసరావు వద్ద ఉచిత శిక్షణ పొందిన అంటిపేట, దిబ్బగుడివలస గ్రామాలకు చెందిన ఇద్దరు అగ్నిపథ్ రక్షణ సైనికులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని శిక్షకుడు, ఇతరులు ఆదివారం అభినందించారు. కఠోర శ్రమ ఉంటే ఏదైనా సాధ్యమేనని శిక్షకుడు శ్రీనివాసరావు వారినుద్దేశించి అన్నారు. ఢిల్లీ రైఫిల్స్‌కు ఎంపికైన వేణు, భానుప్రసాద్‌లను ప్రశంసించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 545.00
విజయనగరం	రూ. 549.00
శ్రీకాకుళం	రూ. 549.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,280–00
బంగారం(22సి. 10గ్రా.)	49,750–00
వెండి (కిలో)	72,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

క్లుప్తంగా

బదిలీల జీఓ సవరించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ఉపాధ్యాయ బదిలీల జీఓను సవరించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలన్నింటినీ చూపించాలన్నారు. డైట్ నుంచి బలవంతంగా పంపించిన ఉపాధ్యాయులకు స్పెషల్ పాయింట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటరమణ, ఎ.సదాశివరావు, ఆర్.కృష్ణ, ఎన్వీ పైడిరాజు, ఏవీ శ్రీనివాసరావు, వై.మధుసూధనరావు, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు పీవీజీ చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంపీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



వనంగుడి ఆవరణలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1993–94 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పూడమ్మతల్లి వనంగుడిలో కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమతో చదువుకున్న స్నేహితుల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితులను ఆదుకోవాలని తీర్మానం చేశారు. అనంతరం అంతా భోజనాలు చేసి సందడి చేశారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: పట్టణంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీ శివారులో పేకాటాడుతున్న ఆరుగురు వ్యక్తులను రూరల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 1320 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు.

ఘనంగా మెస్సియా మార్చ్



మెస్సియా మార్చ్ ర్యాలీలో ఒంటెలపై వెళ్తూ క్రిస్మస్ సందేశాన్నిస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మెస్సియా మార్చ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి వద్ద నుంచి ప్రారంభమైన క్రిస్మస్ ర్యాలీ రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, కోట, మూడులాంతర్లు, గంటస్తంభం మీదుగా చర్చి వద్దకు చేరుకుంది. ర్యాలీలో ఒంటెలు, గుర్రాలు, పొడుగు మనుషులు, క్రిస్మస్ తాతలు, క్రిస్మస్ సందేశాలతో ర్యాలీ చేపట్టారు. సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో క్రీస్తు సహోదరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌వాక్



పట్టణవీధుల్లో నిర్వహిస్తున్న సైన్స్ వాక్

విజయనగరం అర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో నిర్వహించిన సైన్స్ వాక్ ఆకట్టుకుంది. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు స్థానిక తోటపాలెంలోని సత్యా డిగ్రీ కళాశాల వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవ జీవనానికి ఉపయోగపడే సైన్స్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, వి.రాజగోపాల్, కె.మురళీబాబు, పి.సత్యం నాయుడు, కె.శశధర్, జి.నిర్మల, సునీల్, భువన, కిరణ్, ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజహితాన్ని కోరుకోవాలి

- మంత్రి బొత్స సత్యనారాయణ



ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం ఫూల్‌బాగ్: సమాజహితాన్ని కోరుతూ సంఘాన్ని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక కామాక్షినగర్‌లోని తూర్పుకాపు సామాజిక వేదిక భవనం ప్రాంగణంలో తూర్పుకాపు ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ, ఒకరినొకరు తెలుసుకోవడానికి, బంధుత్వాలు కలుపుకోవడానికి, వ్యాపార రంగంలో సహకరించుకోవడానికి ఇటువంటి సందర్భాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఒకరికొకరు సహకరించుకుంటూ సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, పతివాడ నారాయణస్వామినాయుడు, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, పల్సస్ అధినేత గేదెల శ్రీనుబాబు, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు కె.రవికుమార్, కిమిడి నాగార్జున, మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు రొంగలి రామారావు, ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, కోశాధికారి టి.వెంకటరమణ, నడిపిల్లి ఆదినారాయణ, పి.సత్యనారాయణ, పి.సూర్యనారాయణ, అంబళ్ల అప్పలనాయుడు, బి.రామకృష్ణ, మంత్రి రమణమూర్తి, కె. శ్రీనివాసరావు, ఎస్.సాంబ, కోట్ల మూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: ఉచిత గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులు సద్వినియోగపరుచుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీఎం ఉజ్వల యోజన పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత మహిళలు గ్యాస్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు రూ.40 లక్షల బీమా సౌకర్యాన్ని బీమా సంస్థ కల్పించిందని చెరప్పారు. నాసిరకమైన రెగ్యులేటర్లను ఉపయోగించవద్దని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో వ్యాక్సిన్లు



ఎస్ఎన్‌సీయూ సిబ్బందితో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: పుట్టిన బిడ్డలకు భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు రాకుండా సకాలంలో వ్యాక్సిన్లు వేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఆదివారం స్థానిక ఘోషా ఆస్పత్రిలోని నియోనటల్, ఎస్ఎన్‌సీయూ యూనిట్లను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలకు డిస్పోజబుల్ సిరంజిలు వాడాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీసీ కెమేరాలు అన్ని వేళలా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టిన వెంటనే పిల్లలకు వెంటనే ట్యాగ్‌లు పెట్టాలని తెలిపారు. గర్భిణులు, పిల్లలకు ఇబ్బందులు కలిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనధికార వ్యక్తులను వార్డుల్లోకి అనుమతించవద్దని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ స్నేహ, బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి యాళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు కావాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఈఆర్ఓ సూర్యనారాయణ, తదితరులు

విజయనగరం రూరల్: రానున్న జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కూడా ఓటర్లుగా నమోదు కావాలని విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్ఓ), ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్వీ.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. నగరంలోని 129, 224, 228, 229, 231 పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదుపై యువతీ యువకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజయనగరం తహసీల్దార్ సీహెచ్.బంగారురాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బి.సంజీవ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి తిరువీధి నిర్వహిస్తున్న భవానీలు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం పరిధిలో ఉన్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆలయ అర్చకులు ప్రసాద్‌బాబు, కృష్ణబాబు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమ్మవారిని జి.అగ్రహారంతో పాటు పట్టణంలోని వీధుల్లో ఊరేగించారు. తిరవీధి ఉత్సవంలో భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారికి క్షీరాభిషేకం



చీపురుపల్లి: పట్టణంలోని లావేరు రోడ్డులోని శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఆదివారం దేవస్థానం కమిటీ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

సుపథ ప్రతిభా పరీక్షలకు విశేష స్పందన



గెలుపొందిన విద్యార్థులతో సుపథ నిర్వాహకులు

విజయనగరం టౌన్: సుపథ ప్రతిభా పరీక్షలకు విశేష స్పందన లభించిందని మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యులు తెలిపారు. యూవీఎస్ రాజు ఆధ్వర్యంలో సుపథ ప్రతిభా పరీక్షలను ఆదివారం స్థానిక విజ్ఞానభారతి పాఠశాలలో నిర్వహించారు. పరీక్షలకు 16 పాఠశాలల నుంచి 534 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పఠనం, శ్లోక పఠనం, దేశ భక్తి గేయాలు, మన విలువలు, ప్రశ్నోత్తర రామాయణంపై పోటీలు నిర్వహించారు. పోటీలను జగద్గురు పీఠం సోదర బృందం బి.నరసింగరావు, జె. వెంకన్న, తదితరులు పర్యవేక్షించారు. విజేతలకు విజయభావన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ జీఎస్‌పీ.నరసింహం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వెదుళ్లవలస విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 9న పారాది ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో గంట మణికంఠ, మడపాన దుర్గాప్రసాద్, బేస్‌బాల్ పోటీల్లో కోన జశ్వంత్, బీంపల్లి గణేష్, కోండ్రో తు కిరణ్‌కుమార్ ప్రతిభ చూపారు. బేస్‌బాల్‌లో బాలికల విభాగంలో పడాల ఈశ్వరమ్మ, నమిరి మోహనలక్ష్మి, సాఫ్ట్ బాల్ పోటీల్లో పడాల ఝాన్సీ ప్రతిభకనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.
ఈనెల 20,21,22 తేదీల్లో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. విద్యార్థులను హెచ్ఎం సీహెచ్.వెంకటరావు ,ఇన్‌చార్జ్ ఉపాధ్యాయుడు టి.విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.సూర్యనారాయణ ఆదివారం అభినందించారు.

ఏపీ ఇరిగేషన్ ఎన్‌జీఓ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ విజయనగరం జిల్లా బ్రాంచ్ ఎన్నికలు ఆ శాఖ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ముగిశాయి.
విజయనగరం డివిజన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడిగా కేవీ శ్రీధర్.. అసోసియేట్ అధ్యక్షుడిగా జీవీవీఎస్ఎస్ ప్రభాకర్, సెక్రటరీగా సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.గోపాలకృష్ణ, ట్రెజరర్‌గా ఎస్.రాము, వైస్ ప్రెసిడెంట్‌లుగా జేవీ అప్పలరాజు, టి. ప్రవీణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నోడల్ అధికారి బాలభాస్కర్ ఆధ్వర్యంలో మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శన(సైన్స్ ఎగ్జిబిషన్) సోమవారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. మండలంలోని అన్ని హైస్కూళ్లు, కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అయిదు ఉత్తమ ప్రదర్శనలను జనవరి 27, 28 తేదీల్లో నిర్వహించనున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.



వనమిత్ర కేంద్రం

- నందన వనంలా బొండపల్లి వనమిత్ర కేంద్రం
- జిల్లాలోని మిగతా రెండు కేంద్రాల కంటే ఆదర్శంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన అధికారులు
- పూజల కోసం ప్రత్యేకంగా నక్షత్ర వనం
- పెరటి తోటల్లో పెంచుకునేందుకు 40 వేల మెడిషన్ మొక్కలతో నర్సరీ



నర్సరీలో పెంచుతున్న మొక్కలు, వాటి వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు

ఆహ్లాదం.. ఆదర్శం



వనమిత్ర కేంద్రంలోని నక్షత్ర వనం

బొండపల్లి: స్థానిక వనమిత్ర కేంద్రాన్ని అటవీ శాఖ అధికారులు నందన వనంలా తీర్చిదిద్దారు. ఈ కేంద్రంలో అడుగుపెట్టగానే నర్సరీకి కాకుండా పార్కుకు వెళ్లామన్న అనుభూతి కలిగించేలా, పర్యాటకులను సైతం ఆకర్షించేలా ఆహ్లాదరకంగా తయారు చేశారు. ఉపాధి నిధులతో ఇక్కడ నర్సరీ నిర్వహిస్తున్నారు. పెరటి తోటల్లో పెంచుకునేందుకు ఔషధ మొక్కలతో పాటు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగం రోడ్లకు ఇరువైపులా నాటేందుకు అవసరమైన మొక్కలను ఇక్కడ పెంచుతున్నారు. ఈ వనమిత్ర కేంద్రం నుంచి ఏటా కొన్నివేల మొక్కలను అటవీశాఖ అధికారులు ప్రజలకు, పంచాయతీలకు, రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. మొన్నటి వరకు ఈ కేంద్రం డొంకలు, తుప్పలతో ఉండేది. కేవలం నర్సరీగానే కనిపించేది. అయితే ఇటీవల కేంద్రం నిర్వాహకులు డొంకలు,తుప్పలు తొలగించడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేశారు.

మిగతా రెండింటికంటే మిన్నగా..

జిల్లా వ్యాప్తంగా మూడు వనమిత్ర కేంద్రాలు ఉన్నాయి. ఒకటి బొండపల్లిలో ఉండగా మిగతా రెండింటిలో ఒకటి జిల్లా కేంద్రం విజయనగరంలో మరొకటి కొత్తవలస మండలంలోని కంటకాపల్లి గ్రామం వద్ద ఉన్నాయి. స్థానిక వనమిత్ర కేంద్రాన్ని మిగతా రెండిం టికంటే ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఇక్కడ పర్యాటకులు సేదతీరేందుకు విశ్రాంతి భవనం, పిల్లలు ఆడుకునేందుకు పార్కుల్లో మాదిరిగా క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. అలాగే వన్య ప్రాణుల గురించి తెలియజేసేలా ఒక ప్రత్యేక హాలును ఏర్పాటు చేసి అందులో వివిధ జంతువులు,జీవరాశులకు సంబంధించిన సమాచారంతో కూడిన ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఎక్వేరియంలు ఏర్పాటు చేసి వివిధ రకాల చేప పిల్లలను పెంచుతున్నారు.



వన్య ప్రాణుల ఫొటో గ్యాలరీ హాల్

సుమారు 70 వేల మొక్కలతో నర్సరీ

రోడ్లకు ఇరువైపులా నాటుకునేందుకు ఉపాధి హామీ నిధులతో 15 వేలు, అటవీ శాఖ కంపర్స్ స్కీము కింద మరో 15 వేలు వివిధ రకాల మొక్కలను నర్సరీలో పెంచుతున్నారు. ఇవి కాకుండా పెరటి తోటల్లో పెంచుకునేందుకు ఉపయోగ పడే ఔషధ మొక్కలను 40 వేల వరకు పెంచుతున్నారు. ఉసిరి, ఇన్సులిన్, తులసీ, వాము ఆకు, నేరేడు, వేప, గోరింట, మామిడి తదితర మొక్కలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉచితంగా పంపిణీ చేయనున్నారు. నర్సరీలో పూర్తిగా సేంద్రియ ఎరువులతో మొక్కలను పెంచుతున్నారు.

నక్షత్ర, నవగ్రహ వనాలు

ఈ వనమిత్ర కేంద్రానికి మరోక ప్రత్యేకత ఉంది. ఇక్కడ నక్షత్ర వనం, నవగ్రహ వనాలను ఏర్పాటు చేశారు. పర్వదినాల్లో ఆయా వనాల్లోని చెట్ల వద్ద భక్తులు పూజలు చేస్తుంటారు. నవ గ్రహ వనంలో దర్బ గడ్డి, గరిక, జమ్మిచెట్టు, ఉత్తరేణి, తెల్ల జిల్లేడు, తంగ్ర, రావి వంటి చెట్లను పెంచుతున్నారు. నక్షత్ర వనంలో తంగ్ర, మామిడి, రావి, కాను, భోగడ తదితర చెట్లను పెంచు తున్నారు. స్థానిక వనమిత్ర కేంద్రాన్ని పర్యాటకంగా, అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ఇటీవల వనమిత్ర కేంద్రాన్ని సందర్శించిన ఎఫ్ఆర్ఓ జె.సింధు తెలిపారు.



నవగ్రహవనంలో చెట్లు

రూపు రేఖలు మార్చాం

గతంతో పోల్చితే వనమిత్ర కేంద్రం రూపు రేఖలు పూర్తిగా మారాయి. డొంకలు, తుప్పలను తొలగించడంతో పాటు పర్యాటకులు వచ్చినప్పుడు సేదతీరడానికి షెడ్డులు ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం. నర్సరీలో పెంచే మొక్కలను ఒక క్రమ పద్ధతిలో పెంచుతున్నాం ఏయే మొక్కలు ఎక్కడ ఉన్నాయో తెలిపే బోర్డులు కూడా ఏర్పాటు చేశాం. కేంద్రం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– కె.అప్పలరాజు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, బొండపల్లి

తెలంగాణ

సౌత్ గ్రూప్‌తో సంబంధమేంటి?

ఎమ్మెల్సీ కవితను విచారించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్‌: ఢిల్లీ లిక్కర్‌ స్కామ్‌కు సంబంధించిన కేసులో శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితను సీబీఐ అధికారుల బృందం ఆదివారం సుదీర్ఘంగా ప్రశ్నించింది. ఈ సందర్భంగా లిక్కర్‌ స్కామ్‌లో సౌత్‌గ్రూప్‌గా పేర్కొంటున్న వారితో ఏమైనా పరిచయం ఉందా? ఎప్పుడైనా కలిశారా? ఇటీవల ఫోన్లు ఎందుకు మార్చాల్సి వచ్చింది? వంటి అంశాలపై ఆరా తీసినట్టు తెలిసింది. ఉదయం 10.50 గంటలకు కవిత నివాసానికి చేరుకున్న డీఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో ఓ మహిళ సహా ఐదుగురు సభ్యుల బృందం కవిత వ్యక్తిగత కార్యాలయంలో సాయంత్రం 6.30 గంటల వరకు విచారించింది. మధ్యాహ్నం 45 నిమిషాల పాటు భోజన విరామం ఇచ్చారు. సుమారు ఏడున్నర గంటల పాటు కవిత నివాసంలోనే ఉన్న సీబీఐ విచారణ బృందం ఢిల్లీ లిక్కర్‌ స్కామ్‌కు సంబంధించి పలు కీలక ప్రశ్నలను సంధించినట్లు సమాచారం. విచారణలో భాగంగా లిక్కర్‌ కేసులో నిందితుడైన అమిత్‌ అరోరా ప్రకటన ఆధారంగా, ఈడీ కోర్టుకు సమర్పించిన రిపోర్టు ఆధారంగా పలు ప్రశ్నలు వేసి వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలిసింది. కాగా సీబీఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో కానీ, ఫిర్యాదు పత్రంలో కానీ తన పేరు లేని విషయాన్ని విచారణ సందర్భంగా కవిత మరోమారు గుర్తు చేసినట్లు సమాచారం. ప్రస్తుతానికి విచారణ ముగిసినా, అందుబాటులో ఉండాలంటూ సీఆర్పీసీ సెక్షన్‌ 91 కింద ఆమెకు సీబీఐ నోటీసు అందజేసింది.

విచారణ అనంతరం ప్రగతిభవన్‌కు..

సీబీఐ బృందం విచారణ ముగిసిన తర్వాత రాత్రి 8 గంటలకు కవిత తన నివాసం నుంచి సీబీఐ బృందం విచారణ తీరుతెన్నులను కేసీఆర్‌కు కవిత వివరించినట్లు సమాచారం.



వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ అకౌంట్ లేదా షార్ట్ మెసేజ్ సర్వీస్ (ఎస్ఎంఎస్) ద్వారా మీకో మెసేజ్ పంపిస్తారు. ప్రముఖ కంపెనీలో స్వల్ప పెట్టుబడి పెడితే.. రూ.లక్షలు మీ సొంతమవుతాయంటూ వల వేస్తారు. రూ.వంద నుంచి మొదలు పెట్టి.. రూ.లక్షల్ని కొట్టేస్తారు.ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ముగ్గులో దించుతూ.. కాసులు కొల్లగొడుతున్న కేసులు నిత్యం పెరుగుతూనే ఉన్నాయి. ఒక్క విజయవాడ నగర పరిధిలోనే నెలకు సగటున 10 వరకు కేసులు వెలుగులోకి వస్తున్నాయి.

-విజయవాడ (స్పోర్ట్స్)

సైబరాసురులు దోచేస్తున్నారు

ప్రముఖ కంపెనీల పేరుతో వల

- ఇంట్లోనే కూర్చుని రూ.లక్షలు సంపాదించవచ్చని ముగ్గులోకి దించుతున్న నేరగాళ్లు
- ప్రతినెలా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

'ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టి ఇంట్లోనే కూర్చుని నెలకు లక్షలాది రూపాయల్ని సంపాదించే అవకాశం' అంటూ విజయవాడ మాచవరం ప్రాంతానికి చెందిన ఓ వివాహిత ఫోన్‌కు రెండు నెలల క్రితం మెసేజ్ వచ్చింది. ఆశతో మెసేజ్ కింద ఉన్న వెబ్‌లింక్‌ను క్లిక్ చేయగా.. ఓ ప్రముఖ కంపెనీ పేరిట వెబ్‌సైట్ తెరుచుకుంది. కంపెనీలో పెట్టుబడి పెట్టే వారికి లాభాలు పంచుతామని అందులో పేర్కొనడంతో.. ఆమె రూ.వెయ్యి పెట్టుబడి పెట్టింది. మరుసటి రోజున రూ.15 వేలు లాభం వచ్చినట్టు ఆమె పేరిట ఉన్న ఆ కంపెనీ వాలెట్‌లో ఆ మొత్తాన్ని జమ చేసినట్టు చూపించారు. వాలెట్‌లోని నగదు విత్‌డ్రా చేయాలంటే మరో రూ.5 వేలు పెట్టుబడి పెట్టాలనే మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె రూ.5 వేలను పెట్టుబడి పెట్టింది. ఇలా ప్రతి రోజూ ఆమె పేరిట ఉండే వాలెట్‌లోని నగదు పెరగడం.. ఆ మొత్తాన్ని తీసుకోవాలంటే మరికొంత నగదు జమ చేయాలనే ఆంక్షల రూపంలో మెసేజ్‌లు రావడం పరిపాటిగా మారింది. ఇలా నెల రోజుల వ్యవధిలోనే ఆమె వాలెట్‌లో 1,13,42,181 రూపాయలు చేరాయి. ఈ నగదు తీసుకునే నిమిత్తం విడతల వారీగా రూ.9 లక్షలు సమర్పించాక మోసపోయానని గ్రహించిన ఆ మహిళ సైబర్ పోలీసులను ఆశ్రయించింది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. భర్త చనిపోవడంతో టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. డబ్బులు వస్తే పిల్లల చదువుకు ఉపయోగపడతాయనే ఆశతో బంగారాన్ని అమ్మేసి మరీ సైబర్ ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతోంది. విజయవాడ నగరంలో ఇలాంటి మోసాలకు సంబంధించి నెలకు సగటున 10 వరకు కేసులు నమోదవుతుండటంతో సైబర్ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఆశ చూపి లూటీ చేస్తున్నారు

అమెజాన్, ఈబే, లవ్ లైఫ్, క్రిప్టో, స్నాప్ డీల్, ఫ్లిప్‌కార్ట్, ఓలా తదితర బడా కంపెనీల్లో స్వల్ప పెట్టుబడి పెడితే భారీగా లాభాలొస్తాయంటూ పలువురి ఫోన్లకు మెసేజ్‌లు పంపించి సైబరాసురులు ఆకర్షిస్తున్నారు. ఇంట్లోనే కూర్చుని నెలకు రూ.లక్షలు సంపాదించవచ్చంటూ మెసేజ్‌ల ద్వారా సూచిస్తారు. నమ్మకం కుదరకపోతే రూ.లక్షలు సంపాదించిన వారి వీడియోలు చూడండి అంటూ.. వారే తయారు చేసిన కొన్ని వీడియోలను యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ద్వారా లింక్‌లను పంపుతారు. మొత్తం ఆన్‌లైన్ అయిపోయిందని, భవిష్యత్ వ్యాపారం పూర్తిగా ఆన్‌లైన్ వేదికగానే జరుగుతుందంటూ ముగ్గులోకి దించుతారు. ముందుగా రూ.100 పెట్టుబడి పెట్టి పరీక్షించుకోండంటూ బంపర్ ఆఫర్ ఇస్తారు. వారు పంపిన వెబ్‌లింక్ క్లిక్ చేయగానే వారే రూపొందించిన ఆయా కంపెనీల నకిలీ వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్తారు. తరువాత ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు. అక్కడ మన కోసం ఒక వాలెట్‌ను రూపొందించి పెట్టుబడులను పలు రకాలైన ఆఫర్లతో ఆకర్షిస్తారు. రూ.100 పెట్టుబడి పెట్టిన 24 గంటల్లోపే లాభం రూ.1,500లకు పైగా వచ్చిందని వాలెట్‌లో చూపిస్తారు. ఆ నగదు మీ బ్యాంక్ ఖాతాకు చేరాలంటే మరో రూ.500 పెట్టుబడి పెట్టాలంటూ ఆంక్షలు విధిస్తారు. ఇలా వాలెట్‌లో నగదు అంకెలను పెంచుకునిపోతూ ఆశను పెంచేసి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షలు గుంజుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

క్యాష్ ఇన్వెస్ట్‌మెంట్ తరహా సైబర్ నేరాలు జరుగుతున్నాయి. కేసులు నమోదు చేసి సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నాం. ఈ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజలు అవసరం లేని వెబ్‌లింక్‌ల జోలికి పోకూడదు.

– యేలేటి శ్రీరచన, ఎస్‌ఐ, సైబర్ క్రైం, విజయవాడ

తెలంగాణ

నేడు ఢిల్లీకి సీఎం కేసీఆర్‌

- 14న బీఆర్‌ఎస్‌ కేంద్ర కార్యాలయం ప్రారంభం
- ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న వేముల, సంతోష్‌

సాక్షి, హైదరాబాద్‌, సాక్షి, న్యూఢిల్లీ: భారత్‌ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్‌) కేంద్ర కార్యాలయాన్ని ఈ నెల 14న ప్రారంభించనున్న నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కే.చంద్రశేఖర్‌రావు సతీసమేతంగా సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఢిల్లీలో పటేల్‌ మార్గ్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ తాత్కాలిక కేంద్ర కార్యాలయ ప్రారంభానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించేందుకు శనివారమే మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ సంతోష్‌కుమార్‌ ఢిల్లీకి చేరుకున్నారు. కార్యాలయ ప్రారంభోత్సవంలో భాగంగా యాగం నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా ఏర్పాట్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. యాగశాల నిర్మాణం, కార్యాలయంలో చేపట్టాల్సిన మరమ్మతులు, ఇతరత్రా పనులపై ప్రముఖ వాస్తు నిపుణులు సుద్దాల సుధాకర్‌తేజతో చర్చించారు. పార్టీ కార్యాలయం ప్రారంభ సందర్భంగా నిర్వహించే హోమంలో కేసీఆర్‌ దంపతులు పాల్గొంటారు. నాలుగు రోజుల పాటు సీఎం కేసీఆర్‌ ఢిల్లీలో మకాం వేసే అవకాశముందని బీఆర్‌ఎస్‌ వర్గాలు వెల్లడించాయి.

ఢిల్లీ బాట పట్టిన బీఆర్‌ఎస్‌ నేతలు

కేసీఆర్‌ ఆదేశాల మేరకు ఈ నెల 14న జరిగే పార్టీ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు టీఆర్‌ఎస్‌ ముఖ్య నేతలు ఢిల్లీ బాట పడుతున్నారు. విమానాల్లో రద్దీని దృష్టిని పెట్టుకుని పలువురు నేతలు సోమవారం సాయంత్రానికే ఢిల్లీకి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. శీతాకాలం నేపథ్యంలో ఢిల్లీకి వెళ్తున్న నేతలకు బస, ఇతర వసతుల కల్పన బాధ్యత పార్టీ ఎంపీలకు అప్పగించారు. ఈ నెల 14న కార్యాలయం ప్రారంభం అనంతరం వసంత్‌ విహార్‌లో నిర్మాణంలో ఉన్న పార్టీ కేంద్ర కార్యాలయం శాశ్వత భవన నిర్మాణ పనులు కూడా కేసీఆర్‌ పరిశీలిస్తారు.

అపోలోలో చికిత్స పొందుతున్న షర్మిల

సాక్షి, హైదరాబాద్‌: వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిల అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తన పాదయాత్రకు అనుమతి ఇవ్వాలంటూ ఆమె చేపట్టిన ఆమరణ దీక్షను పోలీసులు శనివారం అర్ధరాత్రి భగ్నం చేసి.. ఆస్పత్రికి తరలించడం తెలిసిందే. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వైద్యులు ఆదివారం హెల్త్‌ బులిటెన్‌ విడుదల చేశారు. ఆమె డీహైడ్రేషన్‌, ఆర్థోస్టాటిక్‌ హైపోటెన్షన్‌తో బాధపడుతున్నట్టు తెలిపారు. తీవ్రమైన ఒలిగురియా, అధిక అయాన్‌ గ్యాప్‌ మెటబాలిక్‌ అసిడోసిస్‌, ప్రీ-రీనల్‌ అజోటిమియా కూడా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోందని, సోమవారం ఉదయం డిశ్చార్జి చేసే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆమె 2–3 వారాలపాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కాగా, ఆస్పత్రిలో షర్మిల మీడియాతో మాట్లాడారు. ప్రజలపక్షాన న్యాయం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే తనను, తమ పార్టీ కార్యకర్తలను బందీలుగా చేశారని అన్నారు. 'వైఎస్సార్‌ బిడ్డను పంజరంలో పెట్టి బంధించవచ్చని కేసీఆర్‌ అనుకుంటున్నారు. అది ఆయన తరం కాదు' అని స్పష్టం చేశారు. తన పాదయాత్రకు హైకోర్టు అనుమతి ఇచ్చినా కేసీఆర్‌ పోలీసుల భుజాన తుపాకీ పెట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

నవీన్‌ కోసం ఖాకీ వేట

ఇబ్రహీంపట్నం రూరల్‌: వైద్య విద్యార్థిని కిడ్నాప్‌ కేసులో నవీన్‌రెడ్డి కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధి మన్నెగూడలో నివసించే దామోదర్‌రెడ్డి, నిర్మల దంపతుల కూతురుపై దాడికి పాల్పడి, ఎత్తుకెళ్లిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. గంటల వ్యవధిలోనే పోలీసులు కేసును ఛేదించి, దాడికి పాల్పడిన 32 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కిడ్నాప్‌ కథ సుఖాంతం అయినప్పటికీ ప్రధాన నిందితుడు నవీన్‌రెడ్డి మాత్రం నేటికీ పోలీసులకు చిక్కలేదు. దీంతో రాచకొండ పోలీస్‌ కమిషనరేట్‌ అడిషనల్‌ సీపీ సుధీర్‌బాబు నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎస్‌ఓటీ, టాస్క్‌ఫోర్స్‌ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానం ఉన్న చోట జల్లెడ పడుతున్నారు. నవీన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఇప్పటివరకు అతని ఆచూకీ లభించలేదని, కుటుంబ సభ్యులకు సైతం వివరాలు తెలియలేదని తెలిసింది. కాగా, నవీన్‌రెడ్డిపై అతని స్వగ్రామంలో చీటింగ్‌ కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

రాష్ట్ర సరిహద్దులు దాటిన నవీన్‌రెడ్డి..?

కనిపిస్తే ఎన్‌కౌంటర్‌ చేసే ప్రమాదం ఉందని కుటుంబ సభ్యులు నవీన్‌రెడ్డికి తెలపడంతో మాల్‌ నుంచి హాలియా మధ్యలో వైద్య విద్యార్థిని వదిలేసి వెళ్లాడు. నల్లగొండ జిల్లా సరిహద్దుల్లో 9వ తేదిన సాయంత్రం కారును స్నేహితులకు వదిలేసి ద్విచక్ర వాహనం లిఫ్ట్‌ అడిగి పారిపోయినట్లు సమాచారం. నవీన్‌రెడ్డితో ఉన్న చందు, సిద్ధు, రుమెన్‌ కారుతో ఉడాయించారు. వారంతా ఫోన్లు స్విచ్ఛాఫ్‌ చేసి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పంజాబ్‌ రాష్ట్రాల వైపు వెళ్లి తలదాచుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో చిక్కే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

స్వచ్ఛంద సేవకులపై అంత విద్వేషమా?

- రామోజీరావుపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ధ్వజం
- వారు సేవాభావంతో, ముఖ్యమంత్రిపై అభిమానంతో వస్తున్నారు
- వారు ఉద్యోగులేమీ కాదు.. గౌరవ పారితోషికమే ఇస్తున్నాం
- జన్మభూమి కమిటీల ఆగడాలకు అడ్డుకట్ట పడిందనేగా మీ అక్కసు?

సాక్షి, అమరావతి/దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా) : తెలుగుదేశం పార్టీ నాయకుల ఇళ్లకు కూడా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై 'ఈనాడు' అమానుష రాతలు రాయడం దుర్మార్గమని ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్‌ గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు మండిపడ్డారు. మార్గదర్శి మోసాలు బట్టబయలు కాకుండా ప్రజలను మోసం చేస్తున్న రామోజీరావు.. డ్రామోజీ రావుగా పేరు మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన దేవరాపల్లి మండలం తారువలోని తన క్యాంప్‌ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ''వలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులేమీ కాదు. వాళ్లకు చెల్లిస్తున్నది కేవలం గౌరవ పారితోషికం. వాళ్లంతా సేవాభావంతో... ముఖ్యమంత్రిపై అభిమానంతో, ప్రభుత్వ పథకాలను పేదలకు చేర్చటం ద్వారా సమాజ పురోగతిలో తామూ భాగం కావచ్చన్న సదుద్దేశంతో సేవలందిస్తున్నారు. అలాంటి వారిని వేగులంటూ... పూర్తిగా రాజకీయ కార్యకలాపాలే చేస్తున్నారంటూ 'ఈనాడు' రాయటం చాలా దుర్మార్గం'' అని వ్యాఖ్యానించారు. అర్హతలను బట్టి స్థానిక అధికారులే వలంటీర్లను నియమిస్తున్నారని, రిజర్వేషన్లను పక్కాగా పాటిస్తున్నారని, అందుకే 2.61 లక్షల మంది వలంటీర్లలో 83 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలున్నారని తెలియజేశారు. ''రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వంపై ఈనాడు బురదచల్లుతుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారు. పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్న వలంటీర్‌ వ్యవస్థపై తప్పుడు రాతలు భావ్యం కాదు. ప్రతి నెల ఒకటినే వృద్ధులకు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తుండటం కళ్లెదుటే కనిపిస్తున్నా, వారిపై నిందలు మోపడం దారుణం'' అని మండిపడ్డారు.

వ్యవస్థను గాడిలో పెట్టారని కక్ష

చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో రౌడీలను తయారు చేసినప్పుడు రామోజీరావు ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. జన్మభూమి కమిటీల ద్వారా సమాజంలో పేరుకుపోయిన అవినీతికి చరమగీతం పాడినందుకే కక్షకట్టి.. తప్పుడు రాతలు రాస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ప్రభుత్వం వ్యవస్థను అవినీతి మయం చేయడమే కాకుండా, గ్రామీణాభివృద్ధి గాడి తప్పేలా చేసిందని.. ఇప్పుడు ఆ వ్యవస్థను సీఎం గాడిలో పెట్టారని చెప్పారు. అందుకే కక్షకట్టి దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ పాలనలో పథకాలను అమ్ముకుంటే.. ఈ ప్రభుత్వ పాలనలో వలంటీర్లు ఇంటింటికీ అందజేస్తున్నారని స్పష్టం చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



ఉరివేసుకున్న పెంకి రూపేష్‌

అక్కిరెడ్డిపాలెం (గాజువాక): కుటుంబంలో నెలకొన్న సమస్యలతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం విశాఖపట్నంలోని శ్రీనగర్‌ సుందరయ్య కాలనీలో జరిగింది. గాజువాక పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన భార్య వివాహేతర సంబంధం ఏర్పర్చుకోవడంతో డాక్‌యార్డ్‌లో కాంట్రాక్ట్‌ వర్కర్‌గా పని చేస్తున్న పెంకి రూపేష్‌ (23) ఆమెతో తరచూ గొడవ పడుతుండేవాడు. శనివారం రాత్రి భార్యతో అత్తారింట్లో గొడవ పడి శ్రీనగర్‌లోని సుందరయ్యకాలనీలో తాను ఉంటున్న ఇంటికి వచ్చాడు. ఇంట్లో చీరలు, దుస్తులను తగుల బెట్టి అనంతరం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గాజువాక పోలీసులు తెలిపారు. మృతుని తండ్రి చంటి ఫిర్యాదు మేరకు గాజువాక సీఐ ఎల్‌.భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రూపేష్‌ స్వస్థలం బొబ్బిలి.

వెయ్యి మంది పేదలకు వస్త్రదానం

గార: మండల పరిధిలోని శాలిహుండం పంచాయతీ కొంక్యానపేటలో కొన్న చిన్నమ్మడు, చిన్నారావుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆదివారం వెయ్యి మంది పేదలకు వస్త్రదానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ నాయకుడు, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు, గుండ భాస్కరరావులు మాట్లాడుతూ ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్‌, సర్పంచ్‌ కొంక్యాన ఆదినారాయణ, బీజేపీ నాయకులు అట్టాడ రవిబాబ్జి, పూడి తిరుపతి రావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, కొన్న రమణ, కొన్న మధు, పూడి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

జి.సిగడాం: సంక్షేమ పథకాలే జగనన్నకు శ్రీరామరక్షని న్యాయవాది, వైఎస్సార్‌ సీపీ నాయకుడు పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. ఆదివారం చీడిపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పథకం ప్రజలకు చేరువయ్యేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ కృషితో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. విజయనగరం జిల్లా వైఎస్సార్‌ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పురాతన శాస్త్రాలపై అధ్యయనం చేయాలి



ప్రారంభ గీతాలాపనలో గవర్నర్‌ గణేషీలాల్‌, ముక్తికాంత మిశ్రా, డీఎన్‌ రావు తదితరులు

- ఒడిశా గవర్నర్‌ గణేషీలాల్‌ పిలుపు
- ఘనంగా సెంచూరియన్‌ వర్సిటీ 10వ స్నాతకోత్సవం

పర్లాకిమిడి: విద్యార్థులు డిగ్రీలు, మాస్టర్‌ డిగ్రీలు, పీహెచ్‌డీలు సాధించడమే కాకుండా అనాదిగా భారతీయులకు లభించిన పురాతన శాస్త్రాలపై అధ్యయనం చేసినప్పుడే పరిపూర్ణ జ్ఞానం లభిస్తుందని ఒడిశా గవర్నర్‌ ప్రొఫెసర్‌ గణేషీలాల్‌ పిలుపునిచ్చారు. పర్లాకిమిడిలోని సెంచూరియన్‌ వర్సిటీ ప్రధాన క్యాంపస్‌లో ఆదివారం జరిగిన 10వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ లింగరాజ్‌ పండా, వర్సిటీ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ఆచార్య డీఎన్‌ రావు, వైస్‌ చాన్సలర్‌ ప్రొఫెసర్‌ సుప్రియా పట్నాయక్‌, ఇతర విభాగాధిపతులు సాదరంగా ఆహ్వానం పలికారు. అంతకుముందు భువనేశ్వర్‌ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో క్యాంపస్‌కు చేరుకున్న గవర్నర్‌.. సెంచూరియన్‌ వర్సిటీ వెటర్నరీ కాంప్లెక్స్‌ భవనాన్ని ఆవిష్కరించారు. అనంతరం పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు మొత్తం 22 మందికి గౌరవ డాక్టరేట్లు అందజేశారు. వీరిలో ఒకరు వైస్‌ ఛాన్సలర్‌ ఉత్తమ పరిశోధన అవార్డుకు ఎంపికయ్యారు. 12మంది గ్రాడ్యుయేట్లకు బంగారు పతకాలు అందజేశారు. అనంతరం 2021లో ఉత్తీర్ణత చెందిన బీటెక్‌, బీఎస్సీ, బీఎస్సీ(అగ్రికల్చర్‌), ఐటీఐ డిప్లొమో పూర్తి చేసిన 2298 మంది విద్యార్థులకు కలెక్టర్‌ లింగరాజ్‌ సమక్షంలో ధ్రువపత్రాలు అందించారు. స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆస్ట్రేలియా లోని డికిన్‌ యూనివర్సిటీ వైస్‌ ఛాన్సలర్‌ ఇయాన్‌ మార్టిన్‌ మాట్లాడుతూ.. సెంచూరియన్‌ వర్సిటీతో తమకున్న అనుబంధం, ఇక్కడి విద్యార్థుల నాయకత్వ లక్షణాలు, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు రూ.500 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే స్విట్జర్లాండ్‌కు చెందిన ఇలియా ఫౌండేషన్‌ ఫర్‌ ఇథిక్స్‌ ఇన్‌ గ్లోబలైజేషన్‌ వ్యవస్థాపకులు పీటర్‌ వఫ్లీ గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో నోట్ల మార్పిడి, జీఎస్టీ అమలు చేసిన తరువాత అనేక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ అనితా పాత్రో, డీన్‌(అకాడమిక్స్‌) డాక్టర్‌ ప్రొఫెసర్‌ ఎస్పీ నందా, విశ్వవిద్యాలయం డీన్లు, అధ్యాపకులు, భువనేశ్వర్‌ క్యాంపస్‌కు చెందిన అల్యూమినా విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



గవర్నర్‌ చేతులమీదుగా పీహెచ్‌డీ పట్టా స్వీకరిస్తున్న విద్యార్థిని

మొక్కజొన్న సాగుపై మక్కువ



రాజాం మండలంలోని సీఎస్‌ఆర్‌ పురంలో విస్తారంగా మొక్కజొన్న సాగు

రాజాం: ఖరీఫ్‌ సీజన్‌ ముగుస్తుండడంతో రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగుపై రైతులు మక్కువ (ఆసక్తి) కనబరుస్తున్నారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని రైతులు పోటాపోటీగా పొలాల్లో ఈ పంటను వేస్తున్నారు. ఇప్పటికే రాజాం మండలంలోని గడిముడిదాం, సీఎస్‌ఆర్‌పురం, శ్యాంపురం, నందబలగ, పొగిరి గ్రామాల్లో ఈ పంట సాగులో ఉంది. రేగిడి, సంతకవిటి, వంగర మండలాల్లో ఇప్పుడిప్పుడే మొక్కజొన్న విత్తనాలు పొలాల్లో వేసి, సాగు ప్రారంభిస్తున్నారు. నియోజకవర్గంలో గతేడాది 12 వేల ఎకరాల్లో రబీలో మొక్కజొన్న సాగు చేయగా, ఈ ఏడాది 10 వేల ఎకరాలకు పైగా పంట పొలాల్లో రైతులు మొక్కజొన్న విత్తనాలు చల్లారు. మరో 3 వేల ఎకరాలకు పైగా సాగు జరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ రాజాం ఏడీ కె.చంద్రరావు తెలిపారు. మూడు నెలల్లో చేతికందే ఈ పంటతో రబీలో రైతులకు సాగు సులభంగా ఉండి, మంచి ఆదాయం వస్తుందని ఏడీ వివరించారు. ఆరుతడి పంటల్లో భాగంగా ఈ పంట సాగు చేయవచ్చని, ఎకరాకు రూ.20 వేలకు పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన



రణస్థలం: ట్రాఫిక్‌ నిబంధనలు తెలియజేస్తున్న ఎస్సై రాజేష్‌

రణస్థలం: వాహనచోదకులు విధిగా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని జె.ఆర్‌.పురం ఎస్సై రాజేష్‌ ఆదేశించారు. పైడిభీమవరం-రణస్థలం ఆటో జంక్షన్‌ వద్ద ఆదివారం ట్రాఫిక్‌ నిబంధనలపై డ్రైవర్లకు వీడియోరూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపవద్దన్నారు. సర్వీస్‌ రోడ్డు, రద్దీ ప్రదేశాల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఒకవైపు మాత్రమే పార్కింగ్‌ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌ నిబంధనలు ఉల్లంఘిస్తే సీసీ కెమెరాలు ఆటోమెటిగ్గా రికార్డు చేస్తాయని, వాహన యజమానికి అపరాధ రుసుం మెసేజ్‌ రూపంలో వెళ్తుందని చెప్పారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనచోదకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణపై దృష్టి..

ఎచ్చెర్ల క్యాంపస్‌: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. జాతీయ రహదారిపై అరిణాం అక్కివలస, చిలకపాలెం, ఎచ్చెర్ల, ఎస్‌ఎంపురం, కేశవరావుపేట, ఫరీదుపేట, నవభారత్‌, కుశాలపురం బైపాస్‌ కూడళ్లలో ట్రాఫిక్‌ నిబంధనలను ఆదివారం పర్యవేక్షించారు. గ్రామాల నుంచి జాతీయ రహదారి వైపు ప్రవేశించే చోట స్పీడ్‌ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అతివేగం, డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌, రాంగ్‌ రూట్‌ డ్రైవింగ్‌ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

కషాయంతో కత్తెర పురుగు నివారణ

లావేరు: విషమూసిడి కషాయం ద్వారా మొక్కజొన్న పంటకు ఆశించే కత్తెర పురుగును నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం మండల యాంకర్‌ అప్పారావు అన్నారు. బొంతుపేటలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం విషమూసిడి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును విషమూసిడి కషాయం ద్వారా పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో పీఏపీ పూర్ణిమ, ఎన్‌ఎఫ్‌ఎంటీ కృష్ణ, ఎస్‌డీపీ సురేష్‌, రాంబాబు, శేఖర్‌, శివశంకర్‌, రైతులు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

ఎచ్చెర్ల క్యాంపస్‌/ఎచ్చెర్ల: ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు హాజరై కథలు పుస్తకాలు చదివి వినిపించారు. విజేతలకు లైబ్రేరియన్‌ చంద్రశేఖర్‌ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు, వార్తా పత్రికలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు.

● స్వామియే శరణం అయ్యప్ప..!



గుర్రాల రథంపై అయ్యప్పస్వామి



ఆకట్టుకున్న వేషధారణలు



నెమలి నాట్యం చేస్తున్న కళాకారులు

శ్రీకాకుళం నగరంలోని ధర్మశాస్తా సన్నిధానం ట్రస్టు ఆధ్వర్యంలో పూర్ణపుష్కలాంబ సమేత హరహరపుత్ర అయ్యప్ప స్వామి మహాతిరువీధి మహోత్సవం ఆదివారం ఆర్భాటంగా జరిగింది. కేరళ పంచ వాయిద్యాల నడుమ కథాకళి నృత్యాలు, శివుడు, అమ్మవారి వేషధారణలు, నెమలి నృత్యాలు, సన్నాయి వాయిద్య బృందాల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పాతబస్టాండు నుంచి ఏడు రోడ్ల కూడలి, మహిళా కళాశాల, అరసవల్లి కూడలి మీదుగా పాత శ్రీకాకుళంలోని అయ్యప్ప ఆలయం వరకు తిరువీధి కొనసాగింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు సన్నిధానం వద్ద హాజరై పూజలు చేశారు. అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు, భవానీస్వాములు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్‌

రామశేషు హత్యకు నిరసనగా మౌన ప్రదర్శన



మౌనప్రదర్శన చేస్తున్న కళింగ వైశ్యులు

శ్రీకాకుళం (పీఎన్‌ కాలనీ): వైస్‌ ఎంపీపీ బరాటం రామశేషు మృతి కళింగవైశ్యుల జాతికే తీరని లోటని కళింగవైశ్యుల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. రామశేషు హత్యకు నిరసనగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌ కూడలి వద్ద మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ హత్యచేసిన వారు ఎంతటి వారినైనా విడిచిపెట్టకుండా దర్యాప్తు వేగవంతం చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. పార్టీలకతీతంగా కళింగవైశ్యులంతా ఏకమవ్వాలన్నారు. కళింగవైశ్య కార్పొరేషన్‌ చైర్మన్‌ అంధవరపు సూరిబాబు, కోణార్క్‌ శ్రీను పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
సన్నిధి
శ్రీకాకుళం
సోమవారం ॥ 12-12-2022

మంచి మాట

దిద్దుకోవలసిన తప్పులు

మానవ జీవనాన్ని, మానవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న వాటిల్లో ప్రధానమైనవి తప్పులు. ఆచరణల్లోని తప్పులు మాత్రమే కాదు ఆలోచనల్లోని తప్పులు కూడా మానవాళికీ, ప్రపంచానికీ అనాదిగా హానిచేస్తూనే ఉన్నాయి.

ఆత్మావలోకనం చేసుకుంటే మనం చేసిన తప్పులవల్ల మనకు ఎంత హాని జరిగిందో, మన తప్పులవల్ల ఇతరులకు ఎంత హాని జరిగిందో మనకే తెలిసిపోతుంది. చరిత్రను అవలోకిస్తే దేశాలకూ, ప్రపంచానికీ తప్పులు ఎంత హాని చేశాయో తెలిసిపోతుంది. హిట్లర్ తప్పులవల్ల ప్రపంచయుద్ధమే జరిగి తత్ఫలితంగా కలిగిన వినాశనం మనకు తెలిసిందే. పెద్ద స్థాయిల్లో జరిగిన తప్పులవల్ల సామాన్య ప్రజలు విలవిలాడిపోయిన కథనాన్ని చరిత్ర మనకు చెబుతూనే ఉంది. కళ, భాష, సాంస్కృతిక రంగాలకూ తప్పులవల్ల హాని జరుగుతూనే ఉంది. కొన్ని దశాబ్దుల క్రితం చోటు చేసుకున్న తప్పులవల్ల తెలుగు సాహిత్యానికే కాదు భాషకు కూడా జరిగిన పెనుహాని ఇవాళ క్షేత్రవాస్తవంగా మనకు తెలుస్తూనే ఉంది. తప్పులవల్ల మనం తప్పులతోనే ప్రయాణం చేస్తున్నాం; తప్పులవైపే ప్రయాణం చేస్తున్నాం; తప్పులతో మనం మమైకమైపోయాం.

తప్పులకు ప్రతి మనిషీ గురయ్యాడు; బలయ్యాడు. విద్యలోని తప్పులు, వృత్తిలోని తప్పులు, వ్యవహారాల్లోని తప్పులు, ఆచారాల్లోని తప్పులు, మతపరమైన తప్పులు, విశ్వాసాల్లోని తప్పులు, ప్రవర్తనల్లోని తప్పులు వీటివల్ల మనిషి జీవితం తప్పులమయం అయిపోయింది.

ఫలితంగా మనిషి ఒక తప్పుడు జీవి అయిపోయాడు! మనిషి చేస్తున్నట్లుగా, చేస్తున్నంతగా జంతువులు తప్పులు చెయ్యడం లేదు! మనుషులు చేసిన, చేస్తున్న తప్పులవల్ల మానవప్రపంచానికే కాదు జంతుజాలానికి కూడా హాని జరుగుతోంది.

చాల తప్పులు చలామణిలోకి వచ్చేశాయి.

చాపకింద నీరులా తప్పులు మనలోకి రావడం కాదు కొనసాగుతున్న వానలా తప్పులు మనపై పడ్డాయి, పడుతున్నాయి...అందువల్ల మనం తడిసిపోతూ ఉండడం కాదు, ఆ తప్పులు చప్పుడు చెయ్యని నిప్పులుగా అయిపోవడం వల్ల మనం మనకు తెలియకుండానే వాటికి కాలిపోతూ ఉన్నాం.

చాల కాలంగా తప్పులతో, తప్పులలో, తప్పుల కోసమే బతుకుతున్నామా అన్నట్లుగా మనం బతుకుతున్నాం. దానికి పర్యవసానంగా చాల కాలంగా తప్పులు మనల్ని శిక్షిస్తున్నాయి... బతకుతున్నాం అనడానికి ఋజువుగా నిత్యమూ మనం తప్పులవల్ల శిక్షను అనుభవిస్తూ ఉన్నాం.

అయినా మనకు తప్పుల విషయమై ఉండాల్సిన అవగాహన రావడంలేదు.

చరిత్రలోని తప్పులు, తప్పుల చరిత్ర... వీటి నుంచి మనం పాఠాలు నేర్చుకోలేదు. అందుకే మనల్ని భయాలు, అందోళనలు, ఆపదలు, గందరగోళం చుట్టుముట్టాయి, చుట్టుముడుతున్నాయి. గతంలోని తప్పులతో మనం పోరాడడం లేదు. వర్తమానంలోని తప్పుల గురించి మనం ఆలోచించడంలేదు. భవిష్యత్తులో తప్పులవల్ల జరగనున్న విపత్తుల్ని గ్రహించడం లేదు.

తప్పు జరగడం, తప్పు చెయ్యడం అనేవి మనిషికి సహజమైనవే. కానీ తప్పే జరుగుతూ ఉండడం, తప్పే చేస్తూ ఉండడం సహజం కాకూడదు. మన తప్పుల్ని, మనలోని తప్పుల్ని తెలుసుకోలేకపోతే మనం నేరస్థులం అవుతాం.తప్పులవల్ల వర్తమాన, భవిష్యత్తుల్లో మనం ముప్పులపాలు కాకూడదు.



'నువ్వు తప్పు చేసినప్పుడు దాన్ని దిద్దుకోవడానికి సంశయించకు' అని అన్న తత్త్వవేత్త కన్ఫ్యూషస్ 'తప్పులను నేరాలుగా మార్చకు' అనీ అన్నారు. ఆ మాటల్ని మనం అవగతం చేసుకోవాలి. తప్పులకు కాదు మనం దిద్దుబాటుకు మాలిమి అవ్వాలి. దిద్దుకోబడని తప్పులు మనిషికీ, సమాజానికీ కాలం చేసే గాయాలు అవుతాయి. తప్పు తగిలితే దేనికైనా తప్పకుండా తప్పు అంటుకుంటుంది. తప్పులు చెయ్యకపోవడం, తప్పుల్ని పరిహరించుకోవడం ఎలాగో మనం ఉన్నపళాన నేర్చుకోవాలి.

ప్రతి సంవత్సరమూ ధనుర్మాసంలో మన ముందుకు వస్తూ ఉండే తిరుప్పావై పాసురాలలో ఒక చోట ఆణ్డాళ్ చెప్పింది: 'దామోదరుణ్ణి నోరారా గానం చేసి, మనసారా ధ్యానిస్తే జరిగిపోయిన తప్పులూ, జరగబోయే తప్పులూ మంటల్లో దూదిపింజలైపోతాయి'. జరిగిన, జరగబోయే తప్పులు కాలి భస్మం అయిపోవాలని 1,200 యేళ్ల క్రితమే ఇలా ఇంత గొప్పగా ఆశంసించడం జరిగింది. మన తప్పులు, మన చుట్టూ ఉన్న తప్పులు కాలిపోకపోతే ఆ తప్పులకు మనం కాలిపోతాం.

సరైన మనస్తత్వంతో, వివేకంతో మనలోని తప్పుల్ని తొలగించుకోవాలి; మనం ఒప్పుల్ని ఒంటబట్టించుకోవాలి;

ఆపై మనం క్షేమంగానూ, మేలైనవాళ్లంగానూ బతకాలి.

– రోచిష్మాన్

అమ్మ మాట

- దుఃఖానికి చరమదశ సంతోషమే.
- అమ్మ అంటే అడ్డులేనిది. అంతులేనిది.
- నడక అంటే నడవడమే. నడత అంటే ఆ నడకనే నడిపించేది.
- వెలుతురుకు ఆధారం చీకటి.
- చింతకు కారణం నా సొంతం అనుకోవటం.

– జిల్లెళ్లమూడి అమ్మ

గురువాణి



అదొక విచిత్ర బంధం

లోకంలో ఒక బంధనం ఉన్నది. బంధం అంటే కట్టేయడం. ఒక తాడేసి కాళ్లూచేతులూ కట్టేసామనుకోండి. కదలలేం కదా! కాళ్ళువిరిగిపోయిన వాడో, నడవలేనివాడో ఎలా కూర్చుండిపోతారో అలా బంధనం పడినవాడు కదలలేక ఒక చోటే ఉండిపోతాడు. కానీ లోకంలో మరో ఆశ్చర్యకర బంధనం కూడా ఉన్నది. ఏమిటది? ఆశానామ మనుష్యాణాం/కాచిదాశ్చర్య శృంఖలా/యయా బద్ధా ప్రధావన్తి/ముక్తాస్తిష్ఠ పంగువత్... అన్నది హితవాక్కు.

ఆశ అనే బంధం, దానిచేత కట్టబడినవాడు పరుగులు తీస్తుంటాడు. కట్టినప్పుడు కదలికలు ఆగిపోవాలి కానీ, ఈ బంధం పడినప్పుడు పరుగులు తీస్తుంటాడు. కట్టు విప్పినప్పుడు స్వేచ్ఛగా పరుగెత్తాలి. కానీ ఆశాబంధాన్ని విప్పదీస్తే వాడు హాయిగా కూర్చుండిపోతాడు. పరమ ప్రశాంతంగా నిశ్చల చిత్తంతో ఉండిపోతాడు. ఇదొక విచిత్ర బంధం. ఆశకు అంతేమిటి! ఎన్ని ఉన్నా ఇంకా ఏదో కావాలని ఆరాటపడడం. లోకంలో సర్వం స్వంతమయినా, ఎంత గొప్పగా అన్నీ పొందినా... ఇంకా ఏదో కావాలని మరేదో పొందాలన్న కోరిక స్థిరంగా ఉండనీయదు. అందుకే ఆ పరుగులు. అయితే ఆశ లేకుండా ఉండడం సాధ్యం కాదు. మంచిదీ కాదు. ఒక స్థితిలో మనిషికి ఆశ ఉండాలి.

నేను బాగా చదువుకోవాలి, ఒకరి దగ్గర చేయి చాచకుండా బతకాలి, ధార్మికంగా బతకాలి, ఎన్నో పుణ్యకార్యాలు చేయాలి... ఈ ఆశలన్నీ మనిషికి ఉండొచ్చు. అయితే ఆశ కలిగినప్పుడు చేయవలసినది. దాని పరిశీలన. దేన్ని పరిశీలించాలి.. అలా ఆశపడిన దానిని సాధించుకోవడానికి మనకున్న సమర్థతను పరిశీలించకుండా ప్రతిదాని కోసం ఆశపడడం, వెంపర్లాడడం, తన సమర్థత సరిపోక నిరాశా నిస్పృహలు పొందుతూ ఉండడం మంచిది కాదు. తన సమర్థతను పరిశీలించుకోవడానికి తనకన్నా యోగ్యుడు మరొకడుండడు. పరిశీలించడం రాకపోతే... మంట దగ్గరకు వెళ్ళి...నెయ్యి ఏదో, నీరేదో తెలుసుకోలేక ఒకదానికి బదులు మరొకటి వేస్తే భగ్గున మండుతుంటుంది. కాబట్టి ఆ విచక్షణ అవసరం. వివేకంతో కూడిన సమర్థత ఎంత ముఖ్యమో ప్రయత్నం కూడా అంతే ముఖ్యం. ఆశ ఉంది, సమర్థత ఉంది.. కానీ ప్రయత్నం లేకపోతే వృథా.

తాను ఒక స్థితికి చేరిపోయిన తరువాత తాను ప్రశాంతంగా ఉండాలి. దానిని రాగద్వేషాలు పాడు చేస్తాయి. రాగము అంటే.. కోరిక, అది తీరకపోతే అశాంతి. తీరినా అశాంతే. ఎందుకంటే మళ్ళీమళ్ళీ కావాలని పెట్టే పరుగుల వల్ల. రాగద్వేషాలు లేనివాడిలో కదలికలుండవు, పరుగులుండవు, ఒక వయసులో, ఒక స్థితిలో, వృద్ధాప్యంలో.. అంటే జీవన పరిపూర్ణత్వానికి ఈ రెండోకోణం పరిశీలన అవసరం. ఈ స్థితికి రావాలంటే.. పట్టువిడుపులు తెలియాలి. ఇది తెలిస్తే, అలవాటయితే ఎప్పుడు ఏది పొందాలో అది పొందుతారు. పూవు కావాలనుకుంటే పూవు అవుతారు, పిందె కావాలనుకుంటే పిందెవుతారు. కాయవుతారు, పండవుతారు, బాగా పండిపోయి రంగు మారి చెట్టునుండి వదిలిపెట్టేస్తారు. వారంతటవారుగా విడిపోతారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కాబట్టి మనందరం ఎప్పుడు పరుగెత్తాలో అప్పుడు పరిగెత్తాలి. దాన్ని విశ్లేషించుకొంటూ, ప్రయత్నించుకొంటూ, సాధించి తృప్తి, భోగం, కీర్తి పొంది ఒకానొక వయసు వచ్చిన తరువాత పరిణతి చేత శాంతిని పొంది ఆశాపాశాలనుండి విముక్తిని పొంది జీవనసాఫల్యాన్ని పొందాలి.

ఇస్లాం వెలుగు

అశాంతికి కారణం ఏమిటి?



ఈ భూప్రపంచంపై పుట్టిన ప్రతి ఒక్కరికీ కొన్ని హక్కులు ఉన్నాయి. కొన్ని బాధ్యతలూ ఉన్నాయి. మనుషులంతా సమాజంలో కలసీ మెలసీ సహజీవనం చేస్తున్నప్పుడు, వారి జీవితాలు భద్రంగా, సుఖ సంతోషాలతో, ప్రశాంతంగా సాగి పోవాలంటే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తెరగాలి. ఇతరుల హక్కుల్ని గౌరవించాలి. ఎవరికివారు ఇతరుల హక్కులను, తమ బాధ్యతలను గుర్తించి నిర్వర్తించడం పైన్నే సామాజిక మనుగడ ఆధారపడి ఉంది. హక్కులు, బాధ్యతలు తెలుసుకొని విలువల పునాదులపై మనుగడ సాగిస్తే, మానవ సమాజం సుఖ సంతోషాలతో, శాంతీ సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తిలేదు. కాని మానవుల్లో హక్కులు, బాధ్యతల పట్ల సరైన స్పృహ, అవగాహన లేకపోవడం, నైతిక విలువలు లోపించడం మూలంగా మనిషి సాటి మనిషిని గురించి, వారి హక్కుల్ని గురించి పట్టించుకోవడం లేదు. చిన్న చిన్న కారణాలకే సాటి మనిషి హక్కుల్ని హరించి వేస్తున్నాడు. కేవలం తన కులం కాదనో, తన మతం కాదనో సాటి సోదరుడిని కాటికి పంపడానికికూడా వెనుకాడడం లేదు. సృష్టి మొత్తంలో విజ్ఞాన సంపన్నుడైన మనిషి కేవలం తన సంకుచిత ఆలోచనల కారణంగా, సాటి మనిషిపట్ల ప్రవర్తిస్తున్నట్లు సృష్టిలోని ఏ జంతువూ మరో జంతువు పట్ల అలా ప్రవర్తించడంలేదు. కేవలం అధికార కాంక్షతో ఒక జీవి మరోజీవిపై దాడి చేసి తన అధికారాన్ని స్థాపించుకోవాలని చూడడం మనకు కనిపించదు. ఒక జంతువు మరో జంతువుపై దాడి గనక చేసిందీ అంటే, ప్రకృతి ఆ జంతువును దానికి ఆహారంగా నిర్ణయించిందన్నమాట. కేవలం ఆకలి తీర్చుకోడానికి మాత్రమే అది దాడి చేస్తుంది తప్ప, అకారణంగా ఒక జంతువు మరో జంతువుపై దాడి చేయదు. అందుకే మహనీయ ముహమ్మద్ ప్రవక్త (సం):'పశువుకూడా ప్రవర్తించని విధంగా మీరు ప్రవర్తించకండి. సృష్టి మొత్తంలో మీరు (మానవులు) అత్యుత్తమ జీవరాసిగా సృష్టించబడ్డారు. పవిత్ర ఖురాన్ గ్రంథం మిమ్మల్ని 'అష్రఫుల్ మఖ్ లూఖ్' అని అభివర్ణించింది. ఎట్టిపరిస్థితిలోనూ నైతికతను కాపాడుకోండి. సాటి మానవులే కాదు, సృష్టిలోని సమస్త జీవరాసులతో ఉత్తమంగా మసలుకోవడమే నైతికత.' అని ఉపదేశించారు. కనుక ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతలను గుర్తెరిగి, తోటి ప్రజల హక్కులను సక్రమంగా నెరవేరుస్తూ విలువలతో కూడిన జీవితం గడిపితేనే దేవుని ప్రేమ, ఆయన ప్రసన్నత ప్రాప్తమవుతాయి. సమాజం సుఖశాంతులతో సుభిక్షంగా వర్ధిల్లుతుంది.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా

పులి వెనకడుగు వేస్తే...



● అల్లు అర్జున్

'ఆర్య', 'ఆర్య 2' చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'పుష్ప'. రెండుభాగాలుగా తెరకెక్కుతున్న ఈ సినిమా తొలిపార్టు 'పుష్ప: ది రైజ్' గత ఏడాది విడుదలై ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం 'పుష్ప' మలిపార్టు 'పుష్ప: ది రూల్'ను తెరకెక్కిస్తున్నారు అల్లు అర్జున్, సుకుమార్. అయితే 'పుష్ప: ది రూల్' రెగ్యులర్ షూటింగ్‌ను నేటి(సోమవారం) నుంచి చిత్రయూనిట్ ప్లాన్ చేసిందని ఫిల్మ్‌నగర్ టాక్. హైదరాబాద్‌లో జరిగే ఈ 15 రోజుల షెడ్యూల్ తర్వాత చిత్రీకరణ కోసం విదేశాలకు వెళ్లనుందట యూనిట్. కాగా ''అడవిలో జంతువులు నాలుగు అడుగులు వెనక్కి వేసాయంటే పులి వచ్చిందని అర్థం.. అదే పులి నాలుగు అడుగులు వెనక్కి వేసిందంటే పుష్పరాజ్ (సినిమాలో అల్లు అర్జున్ పాత్రపేరు) వచ్చాడని అర్థం'' అనే డైలాగ్ 'పుష్ప: ది రూల్'లో ఉంటుందని, అతి త్వరలో విడుదలకానున్న ఈ మూవీ ప్రచార వీడియోలోనే ఈ డైలాగ్ ఉందని టాక్. దీనిపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 2024 వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం.

సుగుణసుందరితో ఆటా పాట


ప్రేయసితో ఆడి పాడారు వీరసింహారెడ్డి.



● శ్రుతీహాసన్, బాలకృష్ణ

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. శ్రుతీహాసన్ హీరోయిన్. ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్ కుమార్, దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని 'సుగుణ సుందరి..' అనే పాటని ఈ నెల 15న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, ఈ పాటలోని ఓ స్టిల్‌ను రిలీజ్ చేసింది. ''ఈ చిత్రంలోని చివరిపాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తవుతుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చందు రావిపాటి.

డబుల్ ధమాకా



● రవితేజ

రవితేజ ద్విపాత్రాభినయం చేసిన తాజా చిత్రం 'ధమాకా'. 'డబుల్ ఇంపాక్ట్' అనేది క్యాప్షన్. నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. కాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 15న విడుదల చేస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''ధమాకా'లో రవితేజ చేసిన క్లాస్, మాస్ పాత్రలు వినోదాత్మకంగా ఉంటాయి. యాక్షన్‌తో పాటు ఇతర అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం హై ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

ఎమోషనల్ థ్రిల్లర్



● వరలక్ష్మి

వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శబరి'. ఈ మూవీతో అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్‌పై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ- ''నేను పనిచేసిన బెస్ట్ ప్రొడ్యూసర్లలో మహేంద్రగారు ఒకరు. ఆయన ఇచ్చిన ప్రతి రూపాయిని అనిల్ తెరపైకి తీసుకొచ్చారు. రెండు మూడు రోజుల్లో ఈ సినిమా డబ్బింగ్ ప్రారంభిస్తా'' అన్నారు. ''ఇదొక స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో నిర్మించాం. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు మహేంద్రనాథ్ కూండ్ల. ''స్వతంత్ర భావాలున్న ఆధునిక యువతి శబరి పాత్రలో వరలక్ష్మి నటించారు'' అన్నారు అనిల్ కాట్జ్. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపీ సుందర్.

అలాంటి కూతురు ఉంటే బాగుంటుంది

\- అల్లు అరవింద్



● సూర్యప్రతాప్, బన్నీ వాసు, నిఖిల్, అల్లు అరవింద్, అనుపమ, గోపీ సుందర్

''నిఖిల్ చాలా అంకిత భావంతో పనిచేస్తాడు. సహజంగా నటించే అనుపమ అంటే నాకు చాలా ఇష్టం. తనను చూసినప్పుడల్లా అలాంటి కూతురు ఉంటే బాగుండు అనిపిస్తుంది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా సూర్య ప్రతాప్ పల్నాటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '18 పేజెస్'. డైరెక్టర్ సుకుమార్ కథను అందించారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలవుతోంది. గోపీ సుందర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఏడురంగుల వాన..' అనే పాటను అల్లు అరవింద్ విడుదల చేశారు. శ్రీమణి రాసిన ఈ పాటను సిద్ శ్రీరామ్ ఆలపించారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''ఒక విచిత్రమైన లవ్ స్టోరీ చేద్దామంటూ సుకుమార్ నాతో చెప్పడంతో '18 పేజెస్' తీశాం. ఇది మామూలు ప్రేమకథ కాదు'' అన్నారు. ''జానపద పాటలు రాసే తిరుపతిగారిని ఈ సినిమాతో పాటల రచయితగా లాంచ్ చేస్తున్నాం'' అన్నారు బన్నీ వాసు. ''గీతా ఆర్ట్స్‌లో డైరెక్షన్ చేయడం పెద్ద గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు సూర్య ప్రతాప్ పల్నాటి. ''ప్రతి నటుడికి గీతా ఆర్ట్స్‌లో పని చేయాలి అనేది ఓ కల. ఇలాంటి మంచి కథకు నన్ను ఎంచుకున్న దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు నిఖిల్. ''ఈ చిత్రంలో నేను చేసిన నందిని పాత్ర వైవిధ్యంగా ఉందని ప్రివ్యూ చూసిన వారు అంటుంటే సంతోషంగా అనిపించింది'' అని అనుపమ పరమేశ్వరన్ అన్నారు.

నటుడు శరత్‌కుమార్‌కు అస్వస్థత



● శరత్‌కుమార్

ప్రముఖ నటుడు, 'సమత్తువ కట్చి' పార్టీ అధ్యక్షుడు శరత్ కుమార్ ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. విజయ్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'వారిసు'(తెలుగులో 'వారసుడు') సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రీకరణలో పాల్గొంటున్నారు శరత్ కుమార్. కాగా డయేరియా కారణంగా ఆయన డీ హైడ్రేషన్‌కు గురవడంతో ఆస్పత్రిలో చేర్పించారని, ఆయనకి తోడుగా భార్య రాధిక, కుమార్తె వరలక్ష్మి ఉన్నట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. దీంతో శరత్ కుమార్ ఫ్యాన్స్ ఆందోళనకు గురయ్యారు. అయితే ప్రతి ఆరునెలలకు ఓసారి శరత్ కుమార్ సాధారణ వైద్య పరీక్షలు చేయించుకుంటారని, అందులో భాగంగానే 'వారిసు' షూటింగ్‌లో పాల్గొన్న తర్వాత ఆసుపత్రికి వెళ్లారని సమాచారం. వైద్య పరీక్షల అనంతరం ఆయనకు ఎలాంటి సమస్య లేదని వైద్యులు తెలపడంతో హైదరాబాద్ నుంచి చెన్నైలోని తన ఇంటికి బయలుదేరారని, ఆయన ఆరోగ్యంపై ఫ్యాన్స్ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శరత్‌కుమార్ సిబ్బంది పేర్కొన్నారు.

సామాజిక సందేశం



● ఇంద్రసేన, ఐశ్వర్యారాజ్

ఇంద్రసేన, ఐశ్వర్యారాజ్ జంటగా వేణు మడికంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శాసనసభ'. సాబ్రో ప్రొడక్షన్స్ పతాకంపై తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మించిన ఈ సినిమా తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని మాట్లాడుతూ-''ప్రతి పౌరుడు చూడాల్సిన సామాజిక సందేశాత్మక చిత్రమిది. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం మా మూవీకి ప్రధాన ఆకర్షణ. ఆంధ్ర, తెలంగాణలో మా సినిమాని రిలీజ్ చేస్తున్న నిర్మాత ఎస్‌వీ ప్రసాద్‌గారికి థ్యాంక్స్'' అన్నారు. ''చిన్న బడ్జెట్‌తో మొదలుపెట్టిన ఈ సినిమా నిర్మాతల ప్రోత్సాహంతో పాన్ ఇండియా మూవీ అయింది'' అన్నారు వేణు మడికంటి. ''పవిత్రమైన శాసనసభ గౌరవాన్ని పెంచితే బాగుంటుందనే ఆలోచన నుంచే ఈ చిత్ర కథ పుట్టింది'' అని చిత్ర కథ, మాటల రచయిత రాఘవేందర్ రెడ్డి అన్నారు. ''పొలిటికల్ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అని ఇంద్రసేన, ఐశ్వర్యారాజ్ అన్నారు.

19వ శతాబ్దంలో...



● సిజు విల్సన్

సిజు విల్సన్, కాయాదు లోహర్ జంటగా నటించిన మలయాళ చిత్రం 'పాథోన్పథం నూట్టండు'. ఈ ఏడాది సెప్టెంబరు 8న విడుదలైన ఈ చిత్రాన్ని తెలుగులో 'పులి:19వ శతాబ్దంలో..' అనే టైటిల్‌తో నిర్మాత సీహెచ్ సుధాకర్ బాబు విడుదల చేయనున్నారు. ''మంచి థియేట్రికల్ అనుభూతిని అందించే చిత్రం ఇది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు సుధాకర్ బాబు. అనూప్ మీనన్, పూనమ్ బజ్వా కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు ఎస్‌కే రామచంద్రనాయక్ సహనిర్మాత.

ఆ రోజు ఏం జరిగింది?



● మౌనిక, చైతన్య రావు

సునీల్, చైతన్య రావు మదాడి, మౌనిక ప్రధాన పాత్రల్లో అనిల్ గోపిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాలెంటైన్స్ నైట్'. తృప్తి పాటిల్, సుధీర్ యాళంగి, మహీందర్ నారల నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని నటుడు, రచయిత-దర్శకుడు హర్షవర్ధన్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే హాలీవుడ్ ఫిల్మ్ చూసిన ఫీలింగ్ కలిగింది. దర్శకుడిగా అనిల్ ప్రయత్నం సఫలీకృతం కావాలి'' అన్నారు. ''ఈ మూవీలో నా పాత్ర చాలెంజింగ్‌గా అనిపించింది'' అన్నారు చైతన్య రావు. ''ఈ సినిమా షూటింగ్ 90శాతం రాత్రివేళ జరిగింది. వాలెంటైన్స్ నైట్ రోజు 14 పాత్రల మధ్య ఏం జరిగిందన్నదే కథ'' అన్నారు అనిల్. ''సినిమాను థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు సుధీర్ యాళంగి.



రోహిత్ శర్మ స్థానంలో అభిమన్యు ఈశ్వరన్

బంగ్లాదేశ్‌తో జరిగే తొలి టెస్టు కోసం భారత కెప్టెన్ రోహిత్ శర్మ స్థానంలో బెంగాల్ ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. బంగ్లాదేశ్, భారత్ 'ఎ' జట్ల మధ్య జరిగిన రెండు అనధికారిక టెస్టుల్లో ఈశ్వరన్ (141, 157) సెంచరీలతో అదరగొట్టాడు. 'బొటన వేలి గాయానికి గురైన రోహిత్ స్పెషలిస్టు వైద్యులను సంప్రదించేందుకు ముంబై వచ్చాడు. అనంతరం బోర్డు మెడికల్ టీమ్ కూడా అతన్ని పరీక్షించి రెండో టెస్టుకల్లా కోలుకునేది లేనిది నిర్ధారిస్తుంది' అని బీసీసీఐ తెలిపింది.



భారత మహిళల హాకీ జట్టు శుభారంభం

నేషన్స్ కప్ అంతర్జాతీయ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. స్పెయిన్‌లోని వాలెన్సియా నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం జరిగిన పూల్ 'బి' తొలి మ్యాచ్‌లో భారత్ 3–1 గోల్స్‌తో చిలీ జట్టును ఓడించింది. భారత్ తరఫున సంగీత (2వ ని.లో), సోనిక (10వ ని.లో), నవనీత్ కౌర్ (31వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చిలీ జట్టుకు విలాగ్రన్ (43వ ని.లో) ఏకైక గోల్ అందించింది. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత జపాన్‌తో భారత్ ఆడుతుంది.

మన అమ్మాయిలే 'సూపర్'

ఆస్ట్రేలియా మహిళల జట్టు భారత్ పాలిట దుర్భేద్యమైన ప్రత్యర్థి. ప్రపంచకప్, పతకం (కామన్వెల్త్ గేమ్స్) తెచ్చే మ్యాచ్‌ల్లో మనల్ని రన్నరప్‌గా మార్చిన జట్టు. ఒత్తిడిలో చిత్తుచేసే అలాంటి ఘనమైన ప్రత్యర్థిని ఈసారి భారత మహిళలు చిత్తు చేశారు. మొదట భారీ స్కోరు చేస్తే దాన్ని మనమ్మాయిలు సమం చేశారు. తొలిసారి 'సూపర్ ఓవర్' ఒత్తిడిని భారత్ జయిస్తే... ఆసీస్ మూడోసారి తడబడి ఓడింది. అమ్మాయిల క్రికెట్ అంటే మనం ఏ ప్రపంచ కప్పో లేదంటే ఫైనల్ మ్యాచో ఉంటేనే కన్నేస్తాం! సాధారణ ద్వైపాక్షిక సిరీస్‌లు ఎన్ని ఆడినా అటువైపే కన్నెత్తి చూడం. ఇకపై ఈ చిన్నచూపు మాయం కానుంది. ఎందుకంటే భారత అమ్మాయిల ఆట కూడా 'సూపర్' టెన్షన్ తెస్తోంది. కాబట్టి మనందరి అటెన్షన్ మారబోతోంది.

- ఉత్కం'టై'న పోరులో ఆసీస్ ఓటమి
- చెలరేగిన స్మృతి, రిచా ఘోష్
- బెత్ మూనీ, తాలియా పోరాటం వృథా





ముంబై: అట్లుంటది మనతోని! అని ఇన్నాళ్లు పురుషుల క్రికెటే భారత్‌లో కాలర్ ఎగరేసింది. ఉత్కంఠ రేపినా... ఒకే ఓవర్లో 6 సిక్సర్లు కొట్టినా... 'సూపర్ ఓవర్' అయినా పురుషాధిక్య క్రికెట్టే శాసించింది. తొలిసారి ఉత్కంఠ ఉరిమి, భారీస్కోర్లు సమమైతే... 'సూపర్ ఓవర్' కిక్‌లో తామేమీ తక్కువ కాదని భారత అమ్మాయిల క్రికెట్ జట్టు నిరూపించింది. తమకెదురైన భారీ స్కోరుకు దీటుగా మెరుపులు మెరిపించిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (49 బంతుల్లో 79; 9 ఫోర్లు, 4 సిక్సర్లు), రిచా ఘోష్ (13 బంతుల్లో 26 నాటౌట్; 3 సిక్సర్లు) ఉత్కంఠభరిత పోరులో భారత్‌ను నిలబెట్టారు. 'సూపర్ ఓవర్లో'నూ భారీ షాట్లతో భారత్‌ను గెలిపించారు. ఎవరి ఊహకందని ఈ మహిళల రెండో టి20 మ్యాచ్‌లో భారత్ 'సూపర్ ఓవర్'లో 4 పరుగుల తేడాతో ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాపై గెలిచింది. మొదట ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 187 పరుగులు చేసింది. బెత్ మూనీ (54 బంతుల్లో 82 నాటౌట్; 13 ఫోర్లు), తాలియా మెక్‌గ్రాత్ (51 బంతుల్లో 70 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) దంచేశారు. అనంతరం భారత్ కూడా 20 ఓవర్లలో 5 వికెట్లకు సరిగ్గా 187 పరుగులు చేసింది. స్మృతి, రిచా ధనాధన్ ఆట ఆడారు. దీంతో మ్యాచ్ 'టై' కాగా ఫలితం తేల్చేందుకు 'సూపర్ ఓవర్' ఆడించారు. ఇందులోనూ రిచా సిక్స్ కొట్టి నిష్క్రమించగా, స్మృతి 4, 6లతో అదరగొట్టింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రస్తుతం రెండు జట్లు 1–1తో సమంగా ఉన్నాయి. మూడో టి20 మ్యాచ్ బుధవారం జరుగుతుంది.

చితగ్గొట్టిన మూనీ, తాలియా

తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు... ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ (15 బంతుల్లో 25; 5 ఫోర్లు) వికెట్‌ను ఆరంభంలోనే కోల్పోయింది. ధాటిగా ఆడిన ఆమెను దీప్తి శర్మ బోల్తా కొట్టించింది. కానీ ఆ తర్వాత బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్ ఆఖరి 20వ ఓవర్‌దాకా ఆటాడుకున్నారు. బౌండరీలతో భారత బౌలర్ల భరతం పట్టారు. దీంతో 13వ ఓవర్లోనే ఆసీస్ స్కోరు 100 దాటింది. మొదట తాలియా 37 బంతుల్లో (8 ఫోర్లు, 1 సిక్స్), కాసేపటికి మూనీ 38 బంతుల్లో (8 ఫోర్లు) అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత కూడా వీరి జోరు పెరిగిందే తప్ప ఏమాత్రం తగ్గలేదు. దీంతో అబేధ్యమైన రెండో వికెట్‌కు వీరిద్దరు 158 పరుగులు జోడించారు.

స్మృతి ధనాధన్...

షఫాలీ వర్మ (23 బంతుల్లో 34; 4 ఫోర్లు, 1 సిక్స్)తో ఓపెనింగ్‌కు దిగిన స్మృతి దంచేసింది. ఇద్దరు 8.4 ఓవర్లలోనే 76 పరుగులు చేశారు. జెమీమా (4) నిరాశపరచగా, హర్మన్‌ప్రీత్ (22 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) అండతో స్మృతి చెలరేగింది. 37 బంతుల్లో (8 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. వరుస ఓవర్లలో హర్మన్, స్మృతి నిష్క్రమించగా... భారత్ విజయానికి 21 బంతుల్లో 39 పరుగులు కావాలి. ఓటమి ఖాయమైన దశలో రిచా భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. ఆఖరి ఓవర్లో 14 పరుగులు కావాల్సి ఉండగా... రిచా, దేవిక తొలి 5 బంతుల్లో 9 పరుగులు చేశారు. ఇక ఆఖరి బంతికి విజయం కోసం 5 పరుగులు అవసరం కాగా, బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా దేవిక బౌండరీ బాదడంతో స్కోర్లు సమమయ్యాయి.

'సూపర్ ఓవర్' సాగిందిలా...

భారత్ 20/1	బంతి	ఆస్ట్రేలియా 16/1
రిచా ఘోష్ (6)	1	అలీసా హీలీ (4)
రిచా ఘోష్ (అవుట్)	2	అలీసా హీలీ (1)
హర్మన్‌ప్రీత్ (1)	3	గార్డెనర్ (అవుట్)
స్మృతి మంధాన (4)	4	తాలియా (1)
స్మృతి మంధాన (6)	5	అలీసా హీలీ (4)
స్మృతి మంధాన (3)	6	అలీసా హీలీ (6)
బౌలర్: హీతెర్ గ్రాహమ్		బౌలర్: రేణుక సింగ్

1 ఈ ఏడాది టి20 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా ఓడిపోవడం ఇదే తొలిసారి. ఈ సంవత్సరం ఆసీస్ 13 మ్యాచ్‌లు ఆడింది. 9 విజయాలు అందుకోగా, మరో మూడు రద్దయ్యాయి.

1 భారత జట్టు ఇప్పటివరకు 154 టి20 మ్యాచ్‌లు ఆడగా.. అందులో ఓ మ్యాచ్ 'టై' కావడం ఇదే ప్రథమం.

20 మహిళల టి20 క్రికెట్‌లో 'సూపర్ ఓవర్'లో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత్ నిలిచింది.

2 అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఆడిన మ్యాచ్‌లు 'టై' కావడం ఇది రెండోసారి. గతంలో 1997లో ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే 'టై'గా ముగిసింది.

187 అంతర్జాతీయ టి20ల్లో ఛేజింగ్ చేస్తూ భారత్ చేసిన అత్యధిక స్కోరు.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 187/1 (20 ఓవర్లలో) (అలీసా హీలీ 25, బెత్ మూనీ 82 నాటౌట్, తాలియా మెక్‌గ్రాత్ 70 నాటౌట్, దీప్తి శర్మ 1/31).
భారత్ ఇన్నింగ్స్: 187/5 (20 ఓవర్లలో) (స్మృతి మంధాన 79, షఫాలీ వర్మ 34, హర్మన్‌ప్రీత్ 21, రిచా ఘోష్ 26 నాటౌట్, దేవిక వైద్య 11 నాటౌట్, హీతెర్ గ్రాహమ్ 3/22).

సెమీఫైనల్లో ఫ్రాన్స్

- ఎదురులేని డిఫెండింగ్ చాంపియన్
- క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గెలుపు
- పెనాల్టీ కిక్‌ను వృథా చేసిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్



ఫ్రాన్స్ గోల్ స్కోరర్లు చువమెని (జెర్సీ నంబర్ 5), ఒలివియర్ జిరూడ్ (జెర్సీ నంబర్ 9)

దోహా: యువ, అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన ఫ్రాన్స్ జట్టు ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీలో ఏడోసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన చివరి క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్ 2–1 గోల్స్ తేడాతో 1966 విశ్వవిజేత ఇంగ్లండ్ జట్టును ఓడించింది. ఫ్రాన్స్ తరఫున చువమెని (17వ ని.లో), ఒలివియర్ జిరూడ్ (78వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్ హ్యారీ కేన్ (58వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. ఇంగ్లండ్ 1–2తో వెనుకబడిన దశలో 84వ నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను హ్యారీ కేన్ వృథా చేశాడు. కేన్ కొట్టిన షాట్ గోల్‌పోస్ట్ పైనుంచి బయటకు వెళ్లిపోయింది. లేదంటే ఇంగ్లండ్ 2–2తో స్కోరును సమం చేసేది.

సెమీఫైనల్స్ షెడ్యూల్

డిసెంబర్ 13: అర్జెంటీనా X క్రొయేషియా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

డిసెంబర్ 14: ఫ్రాన్స్ X మొరాకో
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

7 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో అత్యధికంగా ఏడుసార్లు క్వార్టర్ ఫైనల్లో ఓడిన జట్టుగా ఇంగ్లండ్ నిలిచింది.

2 వరుసగా రెండు ప్రపంచకప్ టోర్నీలలో సెమీస్ చేరడం ఫ్రాన్స్‌కిది రెండోసారి మాత్రమే. చివరిసారి ఆ జట్టు వరుసగా 1982, 1986 ప్రపంచకప్‌లలో సెమీస్ చేరింది.

2 మిచెల్ బిలెక్ (చెకోస్లొవేకియా: 1990లో అమెరికాపై) తర్వాత ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఒక పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచి, రెండో పెనాల్టీ కిక్‌ను వృథా చేసిన రెండో ప్లేయర్‌గా హ్యారీ కేన్ గుర్తింపు పొందాడు.

ఇండియన్ రేసింగ్ లీగ్ విజేత అఖిల్



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్)లో హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ జట్టుకు చెందిన అఖిల్ రవీంద్ర డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించాడు. మొత్తం ఆరు జట్లు పోటీపడిన ఈ లీగ్ ఆదివారం ముగిసింది. ఈ లీగ్‌లో అఖిల్ మొత్తం 147 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. గాడ్‌స్పీడ్ కొచ్చి జట్టుకు చెందిన అలిస్టర్ యాంగ్ (142 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచాడు. ట్యాంక్‌బండ్ రోడ్‌లోని హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్‌లో ఆదివారం జరిగిన రేసుల్లో అలిస్టర్ యాంగ్, నిఖిల్ బోరా విజేతలుగా నిలిచారు. 445.5 పాయింట్లతో గాడ్‌స్పీడ్ కొచ్చి జట్టు టీమ్ టైటిల్‌ను సొంతం చేసుకోగా... 397 పాయింట్లతో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రన్నరప్‌గా నిలిచింది.

ఆసీస్ క్లీన్‌స్వీప్

అడిలైడ్: వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. నాలుగు రోజుల్లోనే ముగిసిన డే నైట్ రెండో టెస్టులో ఆసీస్ 419 పరుగులతో భారీ విజయాన్ని సాధించింది. 497 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 77 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 38/4 తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ మరో 39 పరుగులు జోడించి మిగతా వికెట్లు కోల్పోయింది.

పాకిస్తాన్ లక్ష్యం 355

ముల్తాన్: ఇంగ్లండ్, పాకిస్తాన్‌ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు రసవత్తరంగా మారింది. మూడో రోజు 355 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన ఆతిథ్య పాక్ ఆట ముగిసే సమయానికి 64 ఓవర్లలో 4 కీలక వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. విజయానికి పాక్ 157 పరుగుల దూరంలో ఉండగా, చేతిలో 6 వికెట్లున్నాయి. అంతకుముందు 202/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 275 పరుగుల వద్ద ఆలౌటైంది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ వైద్యశాఖలో 1147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య సేవల నియామక సంస్థ.. ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రకటనను విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,147
» **విభాగాలు:** అనాటమీ, ఫిజియాలజీ, పాథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బయోకెమిస్ట్రీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, అనెస్థీషియా, సైకియాట్రీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, ఎండోక్రైనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరాలజీ తదితరాలు.
» **అర్హత:** పీజీ డిగ్రీ, డిప్లొమా, డీఎన్‌బీ అర్హతలను స్పెషాలిటీ పోస్టులకు అర్హతగా పరిగణిస్తారు. దరఖాస్తు చేసుకోబోయే అభ్యర్థులందరూ తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలిలో తమ అర్హత ధ్రువపత్రాలను నమోదు చేసుకోవాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 44ఏళ్లు మించకూడదు. టీఎస్ఆర్టీసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.68,900 నుంచి రూ.2,05,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** పోస్ట్ గ్రాడ్యుయేట్/సూపర్ స్పెషాలిటీ పరీక్షల్లో పొందిన మార్కుల శాతం ఆధారంగా గరిష్ఠంగా 80 పాయింట్లు నిర్ధారిస్తారు. మిగిలిన 20 పాయింట్లను ప్రభుత్వ వైద్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఒప్పంద, పొరుగు సేవల్లో పనిచేసిన వారికి వెయిటేజీగా కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.12.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.01.2023.
» **వెబ్‌సైట్:** mhsrb.telangana.gov.in

టీఎస్‌పీఎస్సీలో 247 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ).. టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్వీసులోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 247
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.12.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.01.2023
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** tspsc.gov.in

పర్సనాలిటీ టెస్ట్‌లో.. పట్టు సాధించాలంటే!

» సివిల్స్-2022 మెయిన్ ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ
» చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు 2,529 మంది ఎంపిక
» తెలుగు రాష్ట్రాల నుంచి 80 మంది వరకు ఉంటారనే అంచనా
» జనవరి/ఫిబ్రవరిలో ఇంటర్వ్యూలు మొదలయ్యే అవకాశం



సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా..19 కేంద్ర సర్వీసుల్లోకి పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ! మొత్తం మూడు దశలుగా ఉండే.. ఈ ప్రక్రియలో.. సివిల్ సర్వీసెస్-2022కు సంబంధించి కీలకమైన రెండో దశ మెయిన్ పరీక్ష ఫలితాలను యూపీఎస్సీ వెల్లడించింది. మరికొద్ది రోజుల్లో పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) షెడ్యూల్ విడుదల చేస్తామని పేర్కొంది. 2023 జనవరి/ఫిబ్రవరిలో సివిల్స్-2022 ఇంటర్వ్యూలు మొదలయ్యే అవకాశముంది! ఈ నేపథ్యంలో.. మెయిన్ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థులు.. పర్సనాలిటీ టెస్ట్‌లోనూ విజేతలుగా నిలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహం..

- **2,529:** మెయిన్‌లోనూ విజయం సాధించి.. చివరి దశ పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు ఎంపికైన అభ్యర్థుల సంఖ్య. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 80 మంది వరకు ఇంటర్వ్యూకు అర్హత సాధించి ఉంటారని అంచనా.
- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియ మొత్తం 2025 మార్కులకు జరుగుతుంది. చివర దశలో నిర్వహించే ఇంటర్వ్యూకు 275 మార్కులు కేటాయించారు. ఇందులో సాధించే ప్రతి మార్కు ఎంపిక ప్రక్రియలో విజయానికి అత్యంత కీలకం. కాబట్టి అభ్యర్థులు ఇంటర్వ్యూలో రాణించేందుకు వ్యూహాత్మకంగా కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

మొత్తం పోస్టులు 1,011

గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది సివిల్ సర్వీసెస్ పోస్టుల సంఖ్య పెరిగింది. వాస్తవానికి నోటిఫికేషన్ సమయంలో 861 ఖాళీలు అని పేర్కొన్నప్పటికీ.. పోస్టుల సంఖ్య 1,011కి పెరిగిందని యూపీఎస్సీ ఈ ఏడాది ఫిబ్రవరిలో చేసిన ప్రకటనలో తెలిపింది. ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ పేరుతో కొత్త సర్వీసుకు సంబంధించి 150 ఖాళీలను పేర్కొనడంతో.. మొత్తం పోస్టుల సంఖ్య 1,011కు పెరిగింది. ఒక్కో పోస్టుకు దాదాపు 2.5 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు.

డిసెంబర్ 14 వరకు డీఏఎఫ్

సివిల్స్-2022 మెయిన్స్ ఫలితాలను వెల్లడించిన యూపీఎస్సీ..త్వరలోనే ఇంటర్వ్యూ షెడ్యూల్ ప్రకటిస్తామని పేర్కొంది. డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్(డీఏఎఫ్)ను డిసెంబర్ 8 నుంచి డిసెంబర్ 14 వరకు అందుబాటులో ఉంచుతామని తెలిపింది. అభ్యర్థులు ప్రాధామ్యతా క్రమంలో.. జోన్లు, సర్వీసులను ఆన్‌లైన్ విధానంలో డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్‌లో తెలియజేయాలని సూచించింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. ఇంటర్వ్యూలను జనవరి మూడో వారం లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించే అవకాశముందని పేర్కొంటున్నారు. అభ్యర్థులు సన్నద్ధత పొందడానికి కొంత తక్కువ సమయమే ఉందని చెప్పొచ్చు.

వ్యక్తిగత అంశాలపై ప్రత్యేకంగా

సివిల్స్ ఇంటర్వ్యూకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు.. అకడమిక్స్, ఉద్యోగం చేస్తున్నట్లయితే ప్రొఫెషన్, కుటుంబ నేపథ్యం తదితర వ్యక్తిగత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. దీంతోపాటు మెయిన్స్ పరీక్షకు ముందు అందించిన డీఏఎఫ్-1, ఇంటర్వ్యూకు ముందు ఇవ్వాల్సిన డీఏఎఫ్-2లలో పొందుపరిచిన వివరాలపై సమగ్ర అవగాహన ఉండాలి.

మీ గురించి చెప్పమంటే

సివిల్స్ ఇంటర్వ్యూలలో ముందుగా మీ గురించి చెప్పండి అంటూ ప్రారంభిస్తారు. తర్వాత క్రమంగా డీఏఎఫ్‌లో పేర్కొన్న అంశాలు, సర్వీస్ ప్రాధామ్యతలు, సమకాలీన అంశాల వైపు ఇంటర్వ్యూ కొనసాగుతుంది. సివిల్ సర్వీసెస్‌నే ఎంపిక చేసుకోవడానికి కారణం ఏంటి? అనే ప్రశ్న ఎదురయ్యే అవకాశముంది. దీనికి సమాధానం ఇచ్చే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చాలా మంది ఈ ప్రశ్నకు సామాజిక సేవ లక్ష్యం అనే సమాధానం చెబుతారు. ఈ సమాధానాన్ని సమర్థించుకునేందుకు బలమైన కారణాలు, వ్యక్తీకరణ నైపుణ్యం పొందాలి. ముఖ్యంగా టెక్నికల్, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్స్.. 'సోషల్ సర్వీస్ లక్ష్యంగా సివిల్స్ ఎంపిక' అనే సమాధానం చెప్పే విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఈ రోజు పేపర్ చదివారా

అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, ఆసక్తులు తెలుసుకునేందుకు సంధించే తొలి ప్రశ్నలతో మొదలయ్యే ఇంటర్వ్యూ.. నిర్దిష్టంగా ఇంటర్వ్యూ తేదీ రోజు వరకు జరిగిన సమకాలీన అంశాలవైపు కూడా మళ్లుతుంది. ఉదాహరణకు... 'ఈ రోజు పేపర్ చదివారా? అం దులో మీకు బాగా ఆకట్టుకున్న వార్త ఏంటి?' వంటి ప్రశ్నలు లేదా ఈ రోజు వార్తల్లో నిలిచిన ము ఖ్యాంశాలు ఏంటి? వంటి ప్రశ్నలు సైతం ఎదురవు తాయి. కాబట్టి అభ్యర్థులు ఇంటర్వ్యూ రోజున ప్రామాణిక దినపత్రికలు కనీసం రెండు చదవాలి. వాటిలో ముఖ్యమైన అంశాలకు సంబంధించిన వివరాలు గ్రహించాలి.

కరెంట్ ఇష్యూస్

సివిల్స్ ఇంటర్వ్యూ అభ్యర్థులు సమకాలీన అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. ఉక్రెయిన్–రష్యా యుద్ధం, అణ్వాయుధ ప్రయోగాల వల్ల ఏర్పడే పరిణామాలు? రష్యా విషయంలో మన దేశం అనుసరిస్తున్న వైఖరి, దీనిపై ఇతర దేశాల నుంచి ఎదురవుతున్న విమర్శలు వంటి వాటి గురించి సమగ్రంగా తెలుసుకోవాలి. వాటికి సంబంధించి మన దేశ విధానంపై స్పష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోవాలి. జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారుతున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ఎల్ఐసీ ఐపీఓ, బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు తదితరాల గురించి కూడా తెలుసుకోవాలి.

'స్థానిక' పరిస్థితులు

సివిల్స్ ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తమ స్వస్థలానికి సంబంధించిన సామాజిక, చారిత్రక నేపథ్యంపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ప్రస్తుతం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాల గురించి తెలుసుకోవాలి.

హాబీలు.. అప్రమత్తంగా

సివిల్స్ ఇంటర్వ్యూ అభ్యర్థులు..తాము అప్లికేషన్‌లో పేర్కొన్న హాబీలపై ఇప్పటి నుంచే కసరత్తు చేయాలి. చాలామంది బుక్ రీడింగ్, వాచింగ్ టీవీ, వాచింగ్ మూవీస్, సింగింగ్, ప్లేయింగ్ వంటి వాటిని పేర్కొంటారు. ఇంటర్వ్యూలో వీటిపైనా ప్రశ్నలు అడుగుతారనే విషయాన్ని గమనించాలి. బుక్ రీడింగ్ హాబీకి సంబంధించి నిర్దిష్టంగా ఒక రచయిత పేరును పేర్కొన్న అభ్యర్థులు.. మరింత శ్రద్ధగా వ్యవహరించాలి. సదరు రచయిత ప్రచురణల్లో ముఖ్యమైనవి, వాటిలో పేర్కొన్న ముఖ్యమైన కొటేషన్లు, వాటి అర్థాలు, సదరు రచన సారాంశం లేదా ఉద్దేశం వంటి వాటి గురించి తెలుసుకోవాలి. బోర్డ్‌లో పలు నేపథ్యాల వ్యక్తులు ఉంటారు. వారు సదరు రచయిత రాసిన ఫలానా పుస్తకం చదివారా? అందులో మీకు బాగా నచ్చిన అంశం ఏంటి? లేదా అందులో వివాదాస్పదమైన అంశం ఏంటి? వంటి ప్రశ్నలు అడిగే అవకాశముంది.

బలాలు, బలహీనతలు

సివిల్ సర్వీస్ ఆఫీసర్ అంటే.. ఒక విభాగానికి, లేదా ఒక ప్రాంతానికి పూర్తి స్థాయి అధికార పర్యవేక్షణ చేయాల్సిన హోదా. అందుకే వ్యక్తిగత లక్షణాలు కూడా కీలకంగా నిలుస్తాయి. ఇటీవల కాలంలో అభ్యర్థుల వ్యక్తిగత బలాలు, బలహీనతలపైనా ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అభ్యర్థులు త మ బలహీనతల గురించి చెప్పే విషయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలి. 'అగ్రెసివ్‌నెస్', 'సహనం తక్కువ' వంటివి అస్సలు చెప్పకూడదని గుర్తించాలి.

సూటిగా.. స్పష్టంగా

- ఇంటర్వ్యూలో అభ్యర్థుల వ్యక్తిగత వ్యవహార శైలి సైతం విజయాన్ని నిర్దేశిస్తుంది. ప్రధానంగా అభ్యర్థులు తమ అభిప్రాయాలను సూటిగా, స్ప ష్టంగా చెప్పగలిగే సామర్థ్యం అలవర్చుకోవాలి. సానుకూల లేదా ప్రతికూల..అభిప్రాయం ఏదైనా సరే ఎదుటి వారిని మెప్పించే రీతిలో చెప్పాలి.
- ఇంటర్వ్యూ అంటే ప్రశ్న, సమాధానం అనే కోణంలోనే కాకుండా.. ఒక చర్చా వేదికగానూ భావించి ముందడుగు వేయాలి. కారణం.. 20 నుంచి 25 నిమిషాల వ్యవధిలో నిర్వహించే ఇంటర్వ్యూలో..ఆ వ్యవధి మొత్తం ఒకే అంశంపై చిన్నపాటి చర్చ మాదిరిగా ప్రశ్న–సమాధానాలు ఎదురవుతున్నాయి. కాబట్టి అభ్యర్థులు ముఖ్యమైన టాపిక్స్ కూలంకషంగా తెలుసుకోవడం ఎంతో అవసరం. అప్పుడే చర్చలో సమర్థంగా మాట్లాడే వీలుంటుంది.

సమయస్ఫూర్తి

సివిల్స్ అభ్యర్థులు సమయస్ఫూర్తి, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను అలవరచుకోవాలి. గత రెండు, మూడేళ్లుగా ఇంటర్వ్యూల శైలిని పరిగణనలోకి తీసుకుంటే.. బోర్డ్ సభ్యులు.. అభ్యర్థుల్లోని ఈ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు.. 'మీరు ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. ఆ ప్రాంతంలో ఫలానా సమస్య ఎదురైంది? దీనికి తక్షణ పరిష్కారంగా మీరు ఎలాంటి చర్యలు తీసు కుంటారు?' వంటి ప్రశ్నలు ఎదురవుతాయి. ఇలాం టి వాటికి సమాధానం చెప్పేటప్పుడు చాలా జాగ్ర త్తగా వ్యవహరించాలి. ఎదుటి వారిని మెప్పించే వి ధంగా సమాధానం చెప్పాలి. ప్రభుత్వ విధానాలను గౌరవిస్తూనే.. వాటికి అనుగుణంగా పరిష్కార చర్య లు చేపడతామనే విధంగా సమాధానాలు చెప్పాలి.

ఆహార్యం.. ఎంతో ముఖ్యం

ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వ్యక్తిగత ఆహార్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి. హుందాగా ఉండేలా వ్యవహరించాలి. పురుష అభ్యర్థులు లైట్ కలర్ షర్ట్స్ ధరించడం హుందాగా ఉంటుంది. అదే విధంగా మహిళా అభ్యర్థులు శారీ, లేదా సల్వార్ కమీజ్‌లను ధరించి ఇంటర్వ్యూకు హాజరవడం ఎదుటి వారిలో సదభిప్రాయం కలుగజేస్తుంది. ఇంటర్వ్యూలో సమాధానాలిచ్చేటప్పుడు బాడీ లాంగ్వేజ్ కూడా ఎంతో ముఖ్యం. భావోద్వేగా లను, హావ భావాలను నియంత్రించుకోవాలి.

275 మార్కులే.. కానీ విజయానికివే కీలకం

వాస్తవానికి మొత్తం 2025 మార్కులకు నిర్వహించే మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో.. ఇం టర్వ్యూకు కేటాయించింది 275 మార్కులే. కాని ఇవే తుది జాబితాలో నిలపడంలో కీలకంగా మారుతున్నా యి. కారణం.. ఇంటర్వ్యూ అంతా ముఖాముఖి విధా నంలో ఉండడం, బోర్డ్ సభ్యులు అడిగిన ప్రశ్నలు లేదా ఆయా అంశాలపై అవగాహనను, వ్యక్తిత్వ లక్ష ణాలను పరిశీలించే విధంగా ఇంటర్వ్యూ జరగడమే. ఈ విషయంలో ఏ మాత్రం తడబాటుకు గురైనా..కొద్ది మార్కుల తేడాతో విజయం చేజారే ప్రమాదం ఉంది. లేదా కోరుకున్న సర్వీసు రాకపోయే పరిస్థితులు ఏర్పడతాయి. కాబట్టి ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు సమకాలీన పరిణామాలపై పట్టుతోపాటు సమయ స్ఫూర్తి, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపరచు కునేందుకు కృషి చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	389	62,182
నిఫ్టీ ▽	113	18,497

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,005	▽	77
డోజోన్స్	33,476	▽	305
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,477	△	4
డాక్స్	14,371	△	106
షాంఘై	3,207	△	10
నికాయ్	27,901	△	327

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసిఈ	81.08	83.25
£	యూరో	ఎసిఈ	84.49	87.12
€	బ్రిటన్ పౌండ్	ఎసిఈ	98.76	101.02
¥	జపాన్ ఎన్ (100)	ఎసిఈ	60.03	61.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎసిఈ	55.06	55.93
S$	సింగపూర్ డాలర్	ఎసిఈ	60.01	61.68
SAR	సౌదీ రియాల్	ఖామనర్	20.94	22.62
UAE D	యూఏఈ దిర్హామ్	ఖామనర్	21.50	23.30
¥	చైనా యువాన్	ఖామనర్	10.07	12.73

మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) నేడు ఇన్వెస్టర్లకు ఇష్టమైన ఎంపిక. వారి భవిష్యత్తు లక్ష్య సాధనకు సిప్ ఇప్పుడొక పవర్‌ఫుల్ సాధనం. ప్రతి నెలా రూ.12 వేల కోట్లకు పైగా పెట్టుబడులు సిప్ రూపంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి వస్తున్నాయంటే దీని పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న ఆదరణ ఎంతన్నది అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, ఇప్పుడు స్టాక్ సిప్ కూడా ప్రాచుర్యంలోకి వస్తోంది. సిప్ ద్వారా ప్రతి నెలా కోరుకున్న కంపెనీ షేరును కొనుగోలు చేసుకోవడం ఇందులోని సౌలభ్యం. మ్యూచువల్ ఫండ్స్ సిప్, స్టాక్ సిప్ రెండూ ఒకే విధమైన సాధనాలే. కానీ, వీటి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. అది తెలుసుకుంటే ఎవరికి ఏది అనుకూలమన్నది తెలుస్తుంది.

ఏ 'సిప్'లో ఏముంది?




ప్రతి నెలా నిర్ణీత తేదీన ఫలానా మ్యూచువల్ ఫండ్ పథకంలో నిర్దేశిత మొత్తం పెట్టుబడిగా పెట్టాలని ఇచ్చే ఆదేశం. దీన్ని సిప్ టూల్‌గా చెబుతారు. అదే స్టాక్ అయితే ఫలానా కంపెనీ షేరున ఫలానా తేదీన కొనుగోలు చేయాలని ఇచ్చే ఆదేశం. సిప్ ఉద్దేశం ఒకే విడత పెట్టుబడి మొత్తం పెట్టేయకుండా.. క్రమక్రమంగా కొనుగోళ్లు చేసుకోవడం. దీనివల్ల మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడు, కనిష్టాల్లో ఉన్నప్పుడు పెట్టుబడులు కొనసాగుతాయి. ఫలితంగా సగటు కొనుగోలు ధర తగ్గుతుంది. ఒకవేళ ఒకే విడత పెట్టుబడి పెట్టిన సమయంలో మార్కెట్లు గరిష్ట స్థాయిలో ఉండి, ఆ తర్వాత మార్కెట్లు దిద్దుబాటుకు లోనైతే.. ఇన్వెస్టర్ సగటు కొనుగోలు ధర (ఫండ్ యూనిట్ అయినా, స్టాక్ అయినా) గరిష్ఠంగానే ఉంటుంది. రాబడులను నిర్ణయించేది కొనుగోలు ధరేనన్నది విస్మరించకూడదు. అలా కాకుండా ప్రతి నెలా నిర్ణీత మొత్తం పెట్టుబడి పెట్టుకుంటూ వెళ్లడం వల్ల సగటు కొనుగోలు ధర తగ్గి, దీర్ఘకాలంలో మంచి రాబడులకు అవకాశం ఉంటుంది. పైగా అందరికీ ఒకే విడత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టే వెసులుబాటు ఉండకపోవచ్చు. అందుకని ప్రతి నెలా తమ ఆదాయానికి అనుగుణంగా, వీలైనంత మేర పెట్టుబడి పెట్టే ఆప్షన్‌ను సిప్ కల్పిస్తుంది. సిప్ అన్నది సామాన్యులకే కాదు, సంపన్నులకూ అనుకూలమైన టూల్. 15 రోజులు, నెల రోజులు, మూడు నెలలకోసారి చొప్పున సిప్‌ను నిర్ణయించుకోవచ్చు.

స్టాక్ సిప్/ఫండ్స్ సిప్

ఫండ్స్‌కు ఒకవైపు ఎంత ఆదరణ ఉన్నప్పటికీ.. మరోవైపు నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులకు అధిక శాతం మంది ఇన్వెస్టర్లు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఒక విధంగా దీన్ని అధిక రాబడుల కాంక్షగానే చూడాల్సి ఉంటుంది. 2020 మార్చి నాటికి 4 కోట్ల డీమ్యాట్ ఖాతాలుంటే, 2022 ఆగస్ట్ నాటికి 10 కోట్లను దాటిపోవడం దీన్నే సూచిస్తోంది. దీంతో ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు బ్రోకరేజీ సంస్థలు.. స్టాక్స్‌లో ప్రతి నెలా క్రమం తప్పకుండా పెట్టుబడులకు స్టాక్‌సిప్‌ను ఆఫర్ చేస్తున్నాయి. కొత్త ఇన్వెస్టర్ల రాకతో స్టాక్ సిప్‌కు సైతం డిమాండ్ పెరుగుతోంది. 2022 మార్చి 31 నాటికి ఎన్ఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల్లో రిటైల్ ఇన్వెస్టర్లు 7.52 శాతంగా ఉంటే, దేశీ మ్యూచువల్ ఫండ్స్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు 7.75 శాతంగా ఉన్నారు. ఒక కంపెనీ వాటాలను క్రమపద్ధతిలో కొనుగోలు చేయడానికి స్టాక్ సిప్ వీలు కల్పిస్తుంది. కంపెనీని ఎంపిక చేసుకుని, ఎంత కాలానికి ఓ సారి కొనుగోలు చేయాలి, అలా ఎంత కాలం పాటు కొనుగోలు చేయాలి, ఎన్ని వాటాలు కొనుగోలు చేయాలి? అనే వివరాలు బ్రోకర్‌కు ఇస్తే చాలు. నిర్ణీత మొత్తం లేదంటే ఎన్ని షేర్లు కొనుగోలు చేయాలన్నది ఎంపిక చేసుకోవచ్చు. చాలా వరకు బ్రోకరేజీ సంస్థలు బ్లూచిప్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌కే సిప్ సదుపాయాన్ని ఆఫర్ చేస్తున్నాయి. మ్యూచువల్ ఫండ్స్‌లో మాదిరే స్టాక్స్‌లోనూ సిప్ వల్ల సగటు కొనుగోలు వ్యయం తగ్గుతుంది. ఒకేసారి పెట్టుబడి పెట్టే దానితో పోలిస్తే సిప్ రూపంలో పెట్టుబడులతో కొంత రిస్క్ తగ్గించుకోవచ్చు. అయినా కానీ, ఇక్కడ చూడాల్సిన ఇతర అంశాలు కూడా ఉన్నాయి. వీటి విషయంలో ఉన్న అపోహలను కూడా తొలగించుకోవాలి.

ఒక్కటే కానీ వ్యత్యాసం..

గత కొన్నేళ్లలో దేశీ మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో సిప్ ఖాతాలు గణనీయంగా పెరిగాయి. 2022 అక్టోబర్ నాటికి 5.93 కోట్ల సిప్ ఖాతాలు నమోదై ఉన్నాయి. ఈ ఏడాది అక్టోబర్ నెలలో సిప్ ఖాతాల రూపంలో ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.13,041 కోట్లుగా ఉన్నాయి. సిప్‌కు ప్రచారం పెరగడంతో దీన్నొక అనుకూల, సురక్షిత సాధనంగా ఇన్వెస్టర్లు పరిగణిస్తున్నారు. ఫండ్స్ సిప్‌తో పోలిస్తే స్టాక్ సిప్ అంత సౌకర్యం కాదనే చెప్పుకోవాలి. మ్యూచువల్ ఫండ్స్ సిప్‌తో పోలిస్తే స్టాక్ సిప్ వేరు. స్టాక్ సిప్ ద్వారా కేవలం కొన్ని కంపెనీల్లోనే పెట్టుబడులు పెట్టుకోగలరు. కానీ, మ్యూచువల్ ఫండ్స్ సిప్‌లో వాయిదా మొత్తానికి సరిపడా యూనిట్లను కేటాయిస్తారు. ఈ యూనిట్లు ఆ పథకం లోని అన్ని కంపెనీల్లో వాటాలకు సంబంధించినవి. మ్యూచువల్ ఫండ్స్‌లో ప్రతీ సిప్ వాయిదాతో పదుల కంపెనీల్లో వాటాలు లభిస్తాయి. కానీ, స్టాక్ సిప్‌లో ఒక్క కంపెనీలోనే వాటాలు లభిస్తాయి. అధిక ఆదాయం ఉంటే తప్పించి, ఎక్కువ మంది స్టాక్ సిప్ ద్వారా ఎక్కువ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసుకోలేరు. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఆర్థిక నిపుణులు నిర్వహిస్తుంటారు. కానీ, స్టాక్ సిప్ అన్నది ఇన్వెస్టర్ తన సొంత నైపుణ్యాలపై ఆధారపడి చేసుకోవాల్సి ఉంటుంది. ఫండ్స్‌లో సిప్ ఎంపిక చేసుకుని పెట్టుబడులు ప్రారంభించిన తర్వాత.. పోర్ట్‌ఫోలియోలో కొన్ని కంపెనీల పనితీరు బాగాలేకపోతే ఫండ్ మేనేజర్, ఇతర పరిశోధక బృందం కారణాలను, కంపెనీ పనితీరును లోతుగా అధ్యయనం చేస్తారు. స్థూల ఆర్థిక అంశాలు, ఆయా రంగంలో మార్పులు, సైకిల్స్‌ను అర్థం చేసుకుని, అవసరమైతే ఆ కంపెనీలను విక్రయించి మెరుగైనవి అనుకున్న వేరే కంపెనీలను చేరుస్తుంటారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. స్టాక్ సిప్‌లో ఇన్వెస్టరే ఫండ్ మేనేజర్ అవతారం ఎత్తాల్సి వస్తుంది. నిర్ణీత కాలానికోసారి కంపెనీ పనితీరును సమీక్షించడం, ఆయా రంగాల్లో వచ్చే మార్పులను గమనిస్తుండాలి. ''మ్యూచువల్ ఫండ్ సిప్ రూపంలో మరింత వైవిధ్యంతో కూడిన పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడులకు వీలవుతుంది. దీని పనితీరును ఫండ్ మేనేజర్ చూసుకుంటారు. కనుక ఇది మరింత విస్తృతమైన పెట్టుబడుల విధానం అవుతుంది''అని ప్రభుదాస్ లీలాధర్ రిటైల్ బ్రోకింగ్ సీఈవో సందీప్ రాయిచుర తెలిపారు. ఫండ్స్‌లో సిప్ సైకిల్ అయిపోగానే, ఆటో రెన్యువల్ అవుతుంది. లేదంటే కనీసం రిమైండర్ వస్తుంది. స్టాక్ సిప్‌లో అలా ఉండదు. ఫండ్స్‌లో స్టెపప్ సిప్ ఆప్షన్ ఉంటుంది. నిర్ణీత కాలానికోసారి సిప్ పెట్టుబడి మొత్తాన్ని పెంచుకోవచ్చు.



స్టాక్ సిప్, ఫండ్స్ సిప్ వేర్వేరు..

- టూల్ ఒక్కటే అయినా ఫలితాల్లో వైరుధ్యాలు
- ఫండ్స్‌లో పెట్టుబడుల భారం నిపుణులది
- ఇన్వెస్టర్ నైపుణ్యాలపైనే స్టాక్ సిప్ భవిష్యత్తు
- ఫండ్స్‌లో తగినంత వైవిధ్యం
- స్టాక్ సిప్‌లో ఈ భిన్నత్వం తక్కువ
- ఫండ్స్‌లో రాబడులకు భరోసా



నైపుణ్యాలు ఉంటే..

ఫండ్స్ సిప్‌తో పోలిస్తే స్టాక్ సిప్ రూపంలో అధిక రాబడులు సంపాదించుకోవచ్చు. సరైన స్టాక్స్ ఎంపిక చేసుకోగల నైపుణ్యాలు ఇన్వెస్టర్‌కు ఉన్నప్పుడే ఇది సాధ్యపడుతుంది. కొన్నేళ్ల పాటు రాణించగల మంచి మల్టీబ్యాగర్ స్టాక్‌ను ఆదిలోనే గుర్తించి అందులో సిప్ వేసుకుంటే, పెట్టుబడులు ఎన్నో రెట్లు వృద్ధి చెందుతుంది. పెద్దగా ప్రచారం లేని, తక్కువ ధరలో లభిస్తున్నప్పుడే కంపెనీలో పెట్టుబడులు మొదలు పెట్టాలి. మల్టీబ్యాగర్ ప్రయాణం మొదలు పెట్టక ముందు గుర్తించినప్పుడు ప్రతిఫలం ఎన్నో రెట్లు వస్తుంది. అంతేకాదు అనుకున్న ప్రతీ కంపెనీ మల్టీబ్యాగర్ అవ్వాలని లేదు. కొన్నేళ్ల తర్వాతే అసలు వృద్ధి కనిపించొచ్చు. అప్పటి వరకు వేచి ఉండే ఓపిక కూడా అవసరం. అలాంటి కంపెనీని గుర్తించడం అంత సులభం కాదంటారు నిపుణులు. అందుకు రంగాలవారీ భవిష్యత్తును విశ్లేషించడం, కంపెనీ బ్యాలన్స్ షీట్లను, సామర్థ్యాలను, మేనేజ్‌మెంట్ లక్ష్యాలను పరిశీలించే నైపుణ్యాలు కావాలి. కొన్ని స్టాక్స్ ఒక శ్రేణి పరిధిలో చాలా కాలం పాటు చలిస్తుంటాయి. ఇలాంటి వాటిల్లో సిప్‌తో సీజన్ వారీ ఇన్వెస్టర్లు రాబడులు సంపాదించుకోవడం సాధ్యపడొచ్చు. మరో ముఖ్యమైన అంశం మార్కెట్ టైమింగ్. ఇన్వెస్టర్ ఫండ్స్‌లో అయితే ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళతారు. కానీ, స్టాక్స్‌లో సిప్‌కు వచ్చే సరికి మార్కెట్లలో కరెక్షన్ మొదలైందంటే.. సిప్ ఆపేసి ఇంకా పడిపోయిన తర్వాత ఒకేసారి ఆ మొత్తం ఇన్వెస్ట్ చేసుకోవచ్చుగా అనిపిస్తుంది. మార్కెట్లు బాగా పెరిగి కరెక్షన్ వస్తుందని లేదంటే, ఇక్కడి నుంచి మార్కెట్లో మంచి ర్యాలీ ఉంటుందన్న విశ్లేషణల ప్రభావం ఇన్వెస్టర్‌పై పడుతుంది.

వ్యత్యాసాలు

ఫండ్స్	స్టాక్స్
ఫండ్స్‌లో టైమింగ్‌తో పని లేకుండా సిప్ సాగుతుంది	నేరుగా స్టాక్స్‌లో అయితే మార్కెట్ ఆటుపోట్ల ప్రభావం ఇన్వెస్టర్‌పైనా ఉంటుంది
ఫండ్స్‌లో నిపుణులపై భారం వేసి నిశ్చింతగా ఉండొచ్చు	నిపుణులు కాకుండా ఇన్వెస్టర్లు నేరుగా పెట్టుబడులు పెట్టుకోవాల్సి ఉంటుంది
ఫండ్స్‌లో వివిధ రంగాలకు చెందిన కంపెనీలతో మంచి వైవిధ్యం	స్టాక్ సిప్‌లో పెద్ద వైవిధ్యానికి వీలుండదు
వైవిధ్యం తగినంత ఉండడం వల్ల రిస్క్ పెద్దగా ఉండదు	రెండు మూడు స్టాక్స్‌లో సిప్‌తో నష్టాల రిస్క్ ఎక్కువగా ఉంటుంది

వైవిధ్యం..

ఈక్విటీ పెట్టుబడులు అన్నింటికీ వైవిధ్యం అవసరం. స్టాక్ సిప్ అన్నది ఒక కంపెనీ వాటాలను నిర్ణీత కాలం వరకు కొనుగోలు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. కొనుగోలు వ్యయం సగటుగా మారుతుంది. అంతేకానీ, స్టాక్ సిప్ రూపంలో వైవిధ్యం వీలు పడదు. ఎక్కువ మంది ఇన్వెస్టర్లు మహా అయితే రెండు మూడు కంపెనీలకు మించి సిప్ చేసుకోలేరు. దీంతో పోర్ట్‌ఫోలియోలో కాన్సంట్రేషన్ రిస్క్ (ఒకటి రెండు కంపెనీలే) పెరుగుతుంది. ఏదైనా కారణాల వల్ల ఎంపిక చేసుకున్న రెండు మూడింటిలో రెండు మంచి పనితీరు చూపించకపోవడం, ప్రతికూల అంశాలతో కొనుగోలు ధర నుంచి మరింత పడిపోవచ్చు. అప్పుడు రాబడుల సంగతేమో కానీ, పెట్టుబడుల విలువ గణనీయంగా తగ్గిపోతుంది. దీంతో రిటైల్ ఇన్వెస్టర్ల ఆలోచనా ధోరణి మారిపోతుంది. చెత్త స్టాక్ అని భావిస్తూ, తెగ నష్టానికి అయినా అమ్మేసి బయటకు రావాలనిపించొచ్చు. ఎందుకంటే రిటైల్ ఇన్వెస్టర్లలో నమ్మకం, ఓపిక తక్కువ. అందుకే మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో రాబడులకు హామీ ఉండదు కానీ, భరోసా ఉంటుంది. స్టాక్ సిప్‌లో రాబడులన్నవి ఇన్వెస్టర్ నైపుణ్యాలు, కాలంపై ఆధారపడి ఉంటాయి. కొన్ని కంపెనీలు, కొన్ని రంగాలు నిర్ణీత కాలంలోనే మంచి పనితీరు చూపిస్తుంటాయి. తర్వాతి కాలంలో ప్రతికూల పనితీరులోకి వెళుతుంటాయి. ఉదాహరణకు మెటల్స్ కంపెనీలు ఒక సైకిల్ పరిధిలో నడుస్తుంటాయి. ధరలు పెరిగినప్పుడు అనూహ్య లాభాలు వస్తుంటాయి. వాటిని చూసి స్టాక్ ఎంపిక చేసుకుంటే.. ఆ సైకిల్ ముగిసేలోపే బయటకు రావాలి. లేదంటే అవి మళ్లీ పతనాన్ని చూస్తుంటాయి. కనుక ఎంపిక చేసుకునే స్టాక్స్ విషయంలో ఎంతో జాగ్రత్త అవసరం.

ఏమిటి మార్గం..?

రంగాల వారీ పరిస్థితులను, సైకిల్స్ అర్థం చేసుకోగలిగి, కంపెనీల ఆర్థిక మూలాలను విశ్లేషించే నైపుణ్యాలు ఉన్న వారు, దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసే వారు స్టాక్ సిప్ వైపు మొగ్గు చూపించొచ్చు. తాము ఎంపిక చేసిన స్టాక్ కచ్చితంగా భవిష్యత్తులో రాబడులను ఇస్తుందని నమ్మితే ముందుకు వెళ్లొచ్చు. దీనికితోడు క్రమశిక్షణతో మార్కెట్ల పతనాల్లోనూ సిప్ పెట్టుబడులు కొనసాగించాలి. సరైన స్టాక్ ఎంపిక చేసుకుని, క్రమశిక్షణ తప్పకుండా ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లినప్పుడే ఫండ్స్‌సిప్ కంటే మెరుగైన రాబడులు సాధ్యపడతాయి. పెట్టుబడులకు ఒక విధానం అంటూ ఉండాలని విఖ్యాత ఇన్వెస్టర్లు అందరూ చెబుతుంటారు. కనుక ప్రతి ఇన్వెస్టర్ ఒక విధానాన్ని అనుసరించాలి. సొంతంగా అధ్యయనం చేసేంత తీరిక, సమయం ఉండి, స్టాక్ సిప్ ద్వారా ఎక్కువ కంపెనీలను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉన్నా అనుకూలంగా ఉంటుంది. కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించిన ఇన్వెస్టర్లు, ఆర్థిక అంశాల్లో తగిన నైపుణ్యాలు లేని వారు (పెట్టుబడులు ఉన్నా సరే), ఇతరుల సలహాలపై ఆధారపడే వారు, అధ్యయనానికి తగినంత సమయం కేటాయించలేని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ స్టాక్ సిప్ జోలికి వెళ్లొద్దు. దీనికి బదులు వీరు నిపుణులు నిర్వహించే మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ వేసుకోవడమే నయం.

బాటా ఇండియా | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,677 టార్గెట్: రూ. 1,950



ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో అంచనాలకు అనుగుణంగా బాటా ఆదాయం 35 శాతం ఎగసింది. రూ. 830 కోట్లను తాకింది. స్థూల మార్జిన్లు వార్షిక ప్రాతిపదికన 2.09 శాతం మెరుగుపడి 55 శాతానికి చేరాయి. అయితే ముడిసరుకుల ధరల పెరుగుదల కారణంగా త్రైమాసిక(క్యూ1) రీత్యా చూస్తే 1.63 శాతం నీరసించాయి. ఇక నిర్వహణ(ఇబిటా) మార్జిన్లు దాదాపు యథాతథంగా 19.4 శాతంగా నమోదయ్యాయి. ఇందుకు నిర్వహణ వ్యయాలు తదితర అంశాలు ప్రభావం చూపినప్పటికీ వ్యయ క్రమబద్ధీకరణ చర్యలు కొంతమేర ఆదుకున్నాయి. దీంతో నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాలకంటే 23 శాతం తక్కువగా రూ. 161 కోట్లుగా నమోదైంది. ఇందుకు పెరిగిన నిర్వహణ వ్యయాలు కారణమయ్యాయి. కోవిడ్–19 ప్రభావం తదుపరి తిరిగి స్కూళ్లు, కాలేజీలు, కార్యాలయాలు యథావిధిగా ప్రారంభమవుతున్న నేపథ్యంలో డిమాండు ఊపందుకుంటోంది. స్నీకర్స్ బ్రాండు ప్రధానంగా కంపెనీ వృద్ధికి ఊతమిస్తోంది. వినియోగదారు సంబంధ సమాచారం, ప్రొడక్టుల అందుబాటు, పంపిణీ చానళ్ల పటిష్టత వంటి చర్యలు దేశవ్యాప్త రిటైల్ ఔట్‌లెట్లకు మద్దతుగా నిలుస్తున్నాయి. కొన్నేళ్లుగా నిర్వహణ నగదు, నిర్వహణ లాభం ఆర్జిస్తుండటంతో బిజినెస్ నిర్వహణలో పెట్టుబడుల సామర్థ్యం చూపుతోంది.

దిలీప్ బిల్డ్‌కాన్ | ఐడీబీఐ క్యాపిటల్ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 224 టార్గెట్: రూ. 263



ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో దిలీప్ బిల్డ్ అంచనాలను అధిగమిస్తూ ప్రోత్సాహకర పనితీరు ప్రదర్శించింది. వెరసి త్రైమాసికవారీగా చూస్తే నిర్వహణ లాభం 17 శాతం ఎగసింది. ఇందుకు 12 శాతం నిర్వహణ మార్జిన్లు సాధించడం దోహదపడింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో ఇవి 8 శాతమేకాగా.. ప్రాజెక్టుల ఎగ్జిక్యూషన్ ఇందుకు సహకరించింది. ఎస్కలేషన్ క్లాజ్ లేకపోవడంతో గత మూడు, నాలుగు త్రైమాసికాల్లో బలహీన మార్జిన్లు సాధించింది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో లెగసీ ఆర్డర్ పూర్తి నేపథ్యంలో మార్జిన్లు మరో 0.95 శాతంమేర బలపడనున్నట్లు కంపెనీ భావిస్తోంది. వెరసి పూర్తి ఏడాది(2022–23)కి అంచనాలకు అనుగుణమైన 12–13 శాతం ఇబిటా మార్జిన్లను సాధించే వీలున్నట్లు అభిప్రాయపడింది. ఇందుకు ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి)లో 14 శాతానికిపైగా మార్జిన్లు సాధించే వీలున్నట్లు ఊహిస్తోంది. రూ. 26,300 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్ కంపెనీ ఆదాయ సముపార్జనకు హామీనిస్తోంది. క్యూ2లో నికర రుణ భారం రూ. 200 కోట్లు తగ్గింది. ఆస్తుల మానిటైజేషన్ ద్వారా ఈ ఏడాది మరో రూ. 400–500 కోట్లమేర తగ్గించుకోనున్నట్లు అంచనా. క్యూ2లో రూ. 2,800 కోట్ల ఆర్డర్లను పొందింది. ప్రస్తుతం రూ. 80,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు బిడ్డింగ్ చేసింది. వీటిలో 75 శాతం హెచ్‌ఏఎం, ఈపీసీ ప్రాజెక్టులే!

స్టాక్స్ వ్యూ

గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

యాక్సిస్ ఫండ్ నుంచి లాంగ్ డ్యురేషన్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ తాజాగా లాంగ్ డ్యురేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్ల వంటి డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే ఓపెన్ ఎండెడ్ పథకం. డిసెంబర్ 21తో ఈ న్యూ ఫండ్ ఆఫర్ ముగుస్తుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇటు పెట్టుబడి వృద్ధి చెందడంతో పాటు అటు ఒక మోస్తరు రిస్కులతో మెరుగైన రాబడులు కోరుకునే వారికి ఇది అనువైనదని సంస్థ సీఈవో చంద్రేశ్ నిగమ్ తెలిపారు. రిటైర్మెంట్ తదితర సందర్భాల కోసం అవసరమయ్యే నిధిని సమకూర్చుకునేందుకు ఈ ఫండ్ తోడ్పడగలదని పేర్కొన్నారు.

పబ్లిక్ ఇష్యూల వారం

- మూడు ఐపీవోలు షురూ
- రూ. 1,858 కోట్ల సమీకరణ
- జాబితాలో శూల, అబాన్స్..
- ల్యాండ్‌మార్క్ కార్స్ సైతం

న్యూఢిల్లీ: ఈ వారం ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. మూడు కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టనున్నాయి. జాబితాలో శూల వైన్‌యార్డ్స్, ల్యాండ్‌మార్క్ కార్స్, అబాన్స్ హోల్డింగ్స్ ఉన్నాయి. ఈ మూడు కంపెనీలు ఉమ్మడిగా రూ. 1,858 కోట్లు సమీకరించాలని భావిస్తున్నాయి.

విభిన్న వైన్‌లతో..

వైన్ తయారీ సంస్థ శూల వైన్‌యార్డ్స్ ఐపీవో నేడు(12న) ప్రారంభంకానుంది. ఇందుకు ధరల శ్రేణి రూ. 340–357గా నిర్ణయించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు 2.69 కోట్లకుపైగా షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 960 కోట్లకుపైగా సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. రెడ్, వైట్ తదితర పలు వేరియంట్లతో వైన్ విక్రయాలలో కంపెనీ మార్కెట్ లీడర్‌గా ఉంది. శూల, రాసా, దిండోరి, సటోరీ తదితర పలు బ్రాండ్ ప్రొడక్టులను పంపిణీ చేస్తోంది.

ఆర్థిక సేవలతో..

ఫైనాన్షియల్ సర్వీసుల అబాన్స్ గ్రూప్ సంస్థ అబాన్స్ హోల్డింగ్స్ ఐపీవో నేడు(12న) ప్రారంభంకానుంది. ఇందుకు ధరల శ్రేణి రూ. 256–270కాగా.. దాదాపు రూ. 346 కోట్లు సమీకరించనుంది. ఇష్యూ ద్వారా 38 లక్షల ఈక్విటీ కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 90 లక్షల షేర్లను ప్రమోటర్ అభిషేక్ బన్సల్ ఆఫర్ చేస్తున్నారు. ఎన్‌బీఎఫ్‌సీ అనుబంధ సంస్థ అబాన్స్ ఫైనాన్స్‌లో పెట్టుబడులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు ఈక్విటీ జారీ నిధులను వెచ్చించనుంది. ఇష్యూ 15న ముగియనుంది.

ప్రీమియం కార్లతో..

ప్రీమియం బ్రాండ్ల రిటైల్ ఆటోమొబైల్ డీలర్‌షిప్ సంస్థ ల్యాండ్‌మార్క్ కార్స్ ఐపీవో మంగళవారం(13న) ప్రారంభకానుంది. ఇందుకు ధరల శ్రేణి రూ. 481–506గా నిర్ణయించింది. తద్వారా రూ. 552 కోట్లు సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా రూ. 402 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు ఆఫర్ చేస్తున్నారు.

ఎగ్జిట్ లోడ్ ఎలా అమలవుతుంది?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



మూడేళ్ల కాలానికి డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా? – అక్షయ

ఫిక్స్‌డ్ డిపాజిట్లతో (ఎఫ్‌డీలు) పోలిస్తే డెట్ ఫండ్స్ పన్ను ప్రయోజనం పరంగా ఆకర్షణీయ సాధనం. కచ్చితమైన కాల వ్యవధి కోసం మంచి ఆప్షన్. ఎఫ్‌డీ వడ్డీపై పన్ను అక్రూయల్ విధానంలో ఉంటుంది. వడ్డీ ఏటా ఎఫ్‌డీకి తోడవుతుంది. కనుక ఉపసంహరించుకోకపోయిన కానీ, ఏటా వచ్చే వడ్డీ మొత్తం పన్ను పరిధిలోకి వస్తుంది. కానీ, డెట్ పథకంలో పన్ను ఉపసంహరించుకున్న సమయంలోనే అమల్లోకి వస్తుంది. మూడేళ్లలోపు విక్రయించినట్టయితే, వచ్చే లాభం పెట్టుబడిదారు వార్షిక ఆదాయానికి కలుస్తుంది. మూడేళ్ల తర్వాత విక్రయిస్తే వచ్చే లాభం నుంచి ద్రవ్యోల్బణ ప్రభావం తీసివేయగా, మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లిస్తే చాలు. పన్ను అనంతరం రాబడులు చూస్తే ఎఫ్‌డీల కంటే డెట్ ఫండ్స్‌లోనే ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా అధిక పన్ను పరిధిలో ఉన్న వారికి మూడేళ్లకు మించిన కాలానికి డెట్ ఫండ్స్ అనుకూలం.

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు ఎగ్జిట్ లోడ్ విధిస్తారు. దీన్ని ఎలా అమలు చేస్తారు? – ఎస్ అశోకన్

ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే ప్రతి ఒక్కరికీ ఎగ్జిట్ లోడ్ గురించి కూడా తెలియాలి. నిర్దేశిత కాలంలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు అమలు చేసే చార్జీయే ఎగ్జిట్ లోడ్. ఫండ్ నిబంధనల్లో ఇది స్పష్టంగా ఉంటుంది. ఫండ్ రకాన్ని బట్టి ఎగ్జిట్ లోడ్ ఉంటుంది. ఏకమొత్తంలో (లంప్ సమ్) పెట్టుబడి లేదా సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడి తేదీ పరిగణనలోకి వస్తుంది. ఒకవేళ ఎగ్జిట్ లోడ్ చార్జీలను మ్యూచువల్ ఫండ్ సంస్థ మార్చితే, ఆ తర్వాత నుంచి చేసిన పెట్టుబడులకే అది వర్తిస్తుంది. ముందు చేసిన పెట్టుబడులకు కాదు. కనుక పెట్టుబడి పెట్టిన తేదీ నాటికి ఉన్న ఎగ్జిట్ లోడ్ విధానమే, ఉపసంహరణ సమయంలో అమలవుతుంది. ఉదాహరణకు రూ.లక్షను 2022 నవంబర్ 1న ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసినట్టు అనుకుందాం. ఆ సమయంలో ఎగ్జిట్ లోడ్ 365 రోజులకు 1 శాతంగా ఉంది. పెట్టుబడి తేదీ నాటికి పథకం ఎన్ఏవీ 20గా ఉంది. దీంతో రూ.లక్ష పెట్టుబడికి 5,000 యూనిట్లు వచ్చాయి. 2023 జూన్ 25న రూ.50వేలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అప్పుడు ఎన్ఏవీ 25 ఉందని అనుకుందాం. రూ.50వేల కోసం 2,000 యూనిట్లను విక్రయించాలి. దీంతో ఏడాదిలోపు (365 రోజుల్లోపు) విక్రయించినట్టు అవుతుంది. కనుక ఎగ్జిట్ లోడ్ పడుతుంది. పెట్టుబడి నాటికి ఎగ్జిట్ లోడ్ 1 శాతం ఉంది. రూ.50,000 ఉపసంహరణ విలువపై ఒక శాతం అంటే రూ.500 ఎగ్జిట్ లోడ్ కింద చెల్లించాలి. కనుక చేతికి రూ.49,500 వస్తాయి. ఒకవేళ ఈ ఉపసంహరణను 2023 నవంబర్ 1 తర్వాత తీసుకుంటే ఎగ్జిట్ లోడ్ పడదు. సిప్ రూపంలో పెట్టుబడి నెలవారీ వాయిదాల రూపంలో ఉంటుంది. కనుక పెట్టుబడిని ఉపసంహరించుకునే సమయంలో ఎగ్జిట్ లోడ్ అమలు కాస్త భిన్నంగా ఉంటుంది. ఉపసంహరించుకునే మొత్తంలో ఎన్ని వాయిదాలు ఉన్నాయి, అన్నింటికీ ఒక్కటే ఎగ్జిట్ లోడ్ విధానమా? తదితర అంశాలు పరిగణనలోకి వస్తాయి. ఉదాహరణకు 2022 నవంబర్ 1న సిప్ కింద ఒక పథకంలో రూ.10,000 ఇన్వెస్ట్ చేశారు. ఎన్ఏవీ రూ.20 ఉంది. కనుక 500 యూనిట్లు వచ్చాయి. అప్పటికి 1 శాతం ఎగ్జిట్ లోడ్ ఉంది. 2022 డిసెంబర్ 1 నుంచి ఎగ్జిట్ లోడ్ 1.5 శాతానికి పెరిగింది. డిసెంబర్ 1న సిప్ రూపంలో రూ.10,000 ఇన్వెస్ట్ చేశారు. ఆ సమయంలోనూ ఎన్ఏవీ రూ.20దగ్గరే ఉండడంతో మరో 500 యూనిట్లు వచ్చాయి. దీంతో ఉపసంహరణ సమయంలో యూనిట్ల విక్రయంపై ఎగ్జిట్ లోడ్ వేర్వేరుగా అమలవుతుందని గ్రహించాలి.

క్లుప్తంగా

విజయనగరం జిల్లాలో క్యాన్సర్ ఆస్పత్రి

- మంగళపాలెంలో వంద పడకలతో ఏర్పాటుచేస్తున్న గురుదేవ ట్రస్ట్
- శంకుస్థాపన చేసిన మిజోరం గవర్నర్ హరిబాబు



క్యాన్సర్ ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు

కొత్తవలస రూరల్: దివ్యాంగులకు వివిధ రూపాల్లో గురుదేవ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ప్రాంగణంలో వంద పడకల క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ట్రస్ట్ ప్రాంగణంలోని 50 పడకల ఆస్పత్రిలో అత్యాధునిక ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ 24 ఏళ్లుగా ఆంధ్రాతో పాటు 11 రాష్ట్రాల్లో 1.50లక్షల మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించడం, గురుదేవ చారిటబుల్ ఆస్పత్రి పేరుతో ఉచితంగా వైద్యసేవలు అందించడం గొప్ప విషయమన్నారు. తాను విశాఖపట్నం ఎంపీగా ఉన్న సమయంలో గురుదేవ ట్రస్ట్ ద్వారా ఉపకరణాల పంపిణీకి ప్రభుత్వం నుంచి సాయం అందించినట్లు తెలిపారు. చిన్నపిల్లల్లో వినికిడి సమస్య వల్ల మూగవారు అవుతున్నారని, అటువంటి వారిని గుర్తిస్తే ప్రభుత్వం ఉచితంగా రూ.12లక్షల విలువైన కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స చేయిస్తుందని, సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, విజయనగరం జేసీ మయూర్‌అశోక్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, స్థానిక నాయకులు ఐ.అనిల్, ఐ.శ్రీనివాసరావు, సీఐ బాల సూర్యారావు, తహసీల్దార్ దేవులపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని.. ఇక పర్యాటక గని!

● తెలంగాణ

గోదావరిఖని: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పర్యాటక శోభను సంతరించుకుంటోంది. మూతపడిన జీడీకే 7 ఎల్‌ఈపీ గనికి సింగరేణి అధికారులు కొత్తరూపు ఇస్తున్నారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. మరోవైపు సింగరేణి టూరిజం ప్యాకేజీని టీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టడంతో ఈ నెల 27 నుంచే పర్యాటకులు ఇక్కడకు రానున్నట్లు తెలుస్తోంది. సింగరేణి డైరెక్టర్(పా) చంద్రశేఖర్ మూడు ఏరియా జీఎంలు కె.నారాయణ, ఎ.మనోహర్, టి.వెంకటేశ్వర్‌రావుతో కలిసి 7 ఎల్‌ఈపీ గనిని సందర్శించారు. సంస్థ సీఎండీ శ్రీధర్ ఆదేశాల మేరకు పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సముద్ర గర్భంలోనూ మానవ రహిత విమానాలు!

దేశ రక్షణకు భారత నేవీ కీలక అడుగులు



భారత్‌లో ప్రాథమికంగా తయారు చేసిన యూఏవీలు

- నీటి అడుగునా పహారా కాసే మానవ రహిత వాహనాల తయారీకి చర్యలు
- శత్రు సబ్‌మెరైన్‌లను సులభంగా పసిగట్టేందుకు ప్రయత్నాలు
- నిఘాతో పాటు కదన రంగంలోనూ ఉపయోగపడేలా తయారీ

సాక్షి, విశాఖపట్నం: ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ దేశ రక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్న భారత నౌకాదళం.. ఇప్పుడు మరో అడుగు ముందుకేస్తోంది. అండర్ వాటర్ డొమైన్ అవేర్‌నెస్‌లో పూర్తి పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మానవ రహిత సాంకేతికత, వ్యవస్థల సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు చర్యలు చేపట్టింది. డీఆర్‌డీవో సాయంతో సముద్ర గర్భంలోనూ పహారా కాసే మానవ రహిత వాహనాలను తన అమ్ములపొదిలో చేర్చుకునేందుకు సన్నద్ధమవుతోంది. డీఆర్‌డీవో తయారు చేసిన మానవ రహిత విమాన ప్రయోగాలు ఇటీవలే విజయవంతమయ్యాయి. ఈ నేపథ్యంలోనే అన్‌మ్యాన్డ్ పవర్‌ను మరింత పెంపొందించే దిశగా భారత రక్షణ దళం సిద్ధమైంది. నీటి అంతర్భాగంలో కూడా దూసుకెళ్లే మానవ రహిత వాహనాలు తయారు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కేవలం నిఘాకు మాత్రమే కాకుండా యుద్ధ సమయంలోనూ సత్తా చాటే విధంగా డిజైన్ చేస్తున్నారు.

అమెరికా కంటే మిన్నగా..

ఇప్పటికే అమెరికా నౌకాదళం రిమోట్‌తో నడిచే మానవ రహిత అండర్ వాటర్ వెహికల్స్‌ను రూపొందించి అగ్రస్థానంలో నిలిచింది. దానికంటే మిన్నగా వాహనాలను తయారు చేసేందుకు భారత్ ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం ఉన్న టార్పెడో ట్యూబ్ సముద్ర గర్భంలో 2 రోజుల పాటు, హెవీ వెయిట్ ట్యూబ్ 3 నుంచి 4 రోజుల పాటు ఉండగలవు. కానీ త్వరలో అభివృద్ధి చేయనున్న అటానమస్ అన్‌మ్యాన్డ్ వెహికల్స్(ఏయూవీ) కనీసం 15 రోజుల పాటు సముద్ర గర్భంలో ఉండి పహారా కాయగలవు. ఇప్పటికే ఎల్ అండ్ టీ సంస్థ అదమ్య, అమోఘ పేరుతో ఏయూవీలను తయారు చేసి విజయవంతంగా పరీక్షించింది. ఈ నేపథ్యంలో డీఆర్‌డీవో తయారు చేసిన అండర్ వాటర్ లాంచ్డ్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసి.. కీలక కార్యకలాపాలకు ఉపయోగించాలని నిర్ణయించారు. మజ్‌గావ్ డాక్‌యార్డ్ లిమిటెడ్‌లో దీనికి సంబంధించిన ప్రయోగాలు జరుగుతున్నాయి. తొలి దశలో జలాంతర్గాముల పర్యవేక్షణ కోసం, తర్వాత శత్రు సబ్‌మెరైన్ల రాకను పసిగట్టేలా, తుది దశలో సైనిక దాడులకు కూడా ఈ మానవ రహిత సముద్రగర్భ వాహనాలు ఉపయోగపడేలా తీర్చిదిద్దనున్నారు.

కిటకిటలాడిన యాదాద్రి

● తెలంగాణ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో జంట నగరాలతో పాటు వివిధ రాష్ట్రాల భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం ఇబ్బంది పెట్టినా భక్తులు యాదాద్రీశుడి క్షేత్రానికి వచ్చారు. స్వామి వారి దర్శనానికి ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. స్వామిని 30 వేల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దీంతో వివిధ పూజలతో నిత్య ఆదాయం రూ.56,95,814 వచ్చినట్లు వెల్లడించారు.

పెళ్లి కూతురి బలవన్మరణం

- మరి కాసేపట్లో మెడలో పసుపుతాడు.. ఈలోగానే ఉరితాడుకి వేలాడిన వధువు
- నిజామాబాద్ జిల్లాలో విషాద ఘటన

నవీపేట: మరికొద్ది గంటల్లో మెడలో పసుపుతాడు కట్టించుకుని పెళ్లి చేసుకోవాల్సిన వధువు ఉరిపోసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా.. నవీపేట వాస్తవ్యులు ర్యాగల్ల ప్రభాకర్, ఉమారాణి దంపతుల కూతురు రవళికి నిజామాబాద్‌కి చెందిన తిమ్మిరిశెట్టి సిద్దవ్వ, చంద్రమౌళి దంపతుల కుమారుడు సంతోష్‌తో గత ఆగస్టులో నిశ్చితార్థం జరిగింది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సంతోష్‌కు రూ. రెండు లక్షల నగదుతో పాటు రెండు కిలోల వెండి, ఐదు తులాల బంగారాన్ని కట్నకానుకలుగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. నిశ్చితార్థం తర్వాత సంతోష్ ఫోన్‌లో ఆస్తి విషయాన్ని ప్రస్తావించడంతో రవళి తన స్నేహితులకు, ఆప్తులకు చెప్పి బాధపడింది. రెండేళ్ల క్రితం ఎంసీఏ పూర్తిచేసి ఇంట్లో ఎందుకు ఖాళీగా ఉన్నావని.. పెళ్లయ్యాక కచ్చితంగా ఉద్యోగం చేయాలని తరచూ ఫోన్‌లో చెప్పేవాడు. పెళ్లి దగ్గర పడుతుండడంతో వేధింపులు ఎక్కువయ్యాయి. పెళ్లయ్యాక ఉద్యోగం చేయాలని, మీ తల్లిదండ్రుల ఆస్తిలో సగం వాటా కావాలని డిమాండ్ చేసేవాడు. సున్నిత మనస్కురాలైన రవళి ఈ విషయాలను తల్లిదండ్రులకు చెప్తే బాధపడతారని చెప్పలేదు. బంధువులకు చెబితే వరుడికి మంచి ఉద్యోగం ఉందని.. పెళ్లయిన తరువాత మార్పు వస్తుందని సర్దిచెప్పారు.

వరుడు ఫోన్ తర్వాతే ఉరేసుకుని ఆత్మహత్య

శనివారం రాత్రి పెళ్లి కూతురుగా ముస్తాబు చేస్తున్న సమయంలో కూడా రవళి చిరునవ్వుతో బంధువులను పలకరించింది. రాత్రి పది గంటల సమయంలో పెళ్లి కుమారుడు సంతోష్ ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తర్వాత కాస్త బాధలో ఉన్న ఆమె పడుకుంటానని చెప్పి తన గదిలోకి వెళ్లింది. ఆదివారం ఉదయమే పెళ్లి ఉండడంతో 4 గంటల ప్రాంతం కూతురును నిద్రలేపుదామని తండ్రి గదిలోకి వెళ్లగా కూతురు చీరతో ఉరేసుకుని కనిపించింది. బోరున విలపించిన బంధువులు కిందకు దించి ప్రాణం ఉందేమోనని చూడగా.. అప్పటికే మృతి చెందింది.

నాలుగేళ్లు చదివితేనే ఆనర్స్ డిగ్రీ

▶ మొదటి పేజీ తరువాయి

అందుకోగలుగుతారు. అన్ని ఆనర్స్ డిగ్రీ కోర్సుల కాలపరిమితిని మూడేళ్లకు బదులుగా నాలుగేళ్లకు తప్పనిసరి చేసింది. విద్యార్థులు మూడేళ్లలో 120 క్రెడిట్‌లు పూర్తి చేస్తేనే అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) డిగ్రీకి అర్హులవుతారు. అదే విద్యార్థి నాలుగేళ్లలో 160 క్రెడిట్‌లను పూర్తి చేస్తేనే యూజీ ఆనర్స్ డిగ్రీ పట్టా లభిస్తుంది. అలాగే ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో చేరేవారు రీసెర్చ్ కోసం వెళ్లాలనుకుంటే తమ నాలుగేళ్ల కోర్సులోనే రీసెర్చ్ ప్రాజెక్ట్‌ను చేపట్టాల్సి ఉంటుంది. మొదటి ఆరు సెమిస్టర్‌లలో 75 శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు యూజీ స్థాయిలో పరిశోధనలు చేపట్టాలనుకుంటే నాలుగో ఏడాది పరిశోధనా ప్రాజెక్టును ఎంచుకోవచ్చు. దీన్ని పూర్తి చేస్తే వారికి యూజీ (ఆనర్స్ విత్ రీసెర్చ్) డిగ్రీని ప్రదానం చేస్తారు.



బహుళ ప్రవేశ, నిష్క్రమణలకు అవకాశం

నాలుగేళ్ల యూజీ ఆనర్స్ కోర్సుల్లో విద్యార్థులకు బహుళ ప్రవేశ, నిష్క్రమణలకు అవకాశం ఉంది. ఇందులో భాగంగా మొదటి ఏడాది పూర్తి చేస్తే విద్యార్థికి సర్టిఫికెట్ లభిస్తుంది. రెండేళ్లు చదివితే డిప్లొమా లభిస్తుంది. మూడేళ్లు చదివితే బ్యాచిలర్ డిగ్రీ పట్టా లభిస్తుంది. నాలుగేళ్లు పూర్తి చేస్తే ఆనర్స్‌తో బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుతుంది. ఈ మేరకు విద్యార్థులు తమ ప్రాధాన్యతలను అనుమతిస్తారు. నాలుగేళ్ల ఆనర్స్‌లో చేరినవారు మూడేళ్లలోపు నిష్క్రమిస్తే, అప్పటి నుంచి మూడేళ్లలోపు మళ్లీ చేరేందుకు అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఏడేళ్ల వ్యవధిలో కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది.

వైవిధ్యంతో పాఠ్యాంశాలు..

నూతన కరిక్యులం ఫ్రేమ్ వర్క్ ప్రకారం.. కోర్సుల పాఠ్యాంశాలు వైవిధ్యంతో ఉంటాయి. యూజీసీ నిర్దేశించిన పాఠ్యాంశాల్లో మెయిన్, మైనర్ స్ట్రీమ్ కోర్సులు, భాషా, నైపుణ్య కోర్సులు, పర్యావరణ విద్య, డిజిటల్, సాంకేతిక పరిష్కారాలు తదితర విభాగాల కోర్సులు ఉంటాయి. కొత్తగా ఆరోగ్యం, యోగా, క్రీడలు, ఫిట్‌నెస్ వంటివాటిని కూడా చేర్చారు. ఆధునిక భారతీయ భాష, సంస్కృతి, ఆంగ్ల భాష, నైపుణ్యాల పెంపుదల, నైతిక విలువల కోర్సులు ఉంటాయి. అలాగే విద్యార్థుల ఉపాధిని పెంపొందించడానికి ఆచరణాత్మక నైపుణ్యాలు, శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్ అందించడం లక్ష్యంగా ప్రత్యేక కోర్సులనూ చేర్చారు. నూతన విధానం ప్రకారం విద్యార్థులు ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు మారొచ్చు. ఓపెన్, దూరవిద్య, ఆన్‌లైన్ లెర్నింగ్ లేదా హైబ్రిడ్ మోడ్ వంటి ప్రత్యామ్నాయ విధానాలకు కూడా మారేందుకు అవకాశముంది.

మూడేళ్ల డిగ్రీ చేస్తున్నా ఆనర్స్‌కు..

ప్రస్తుతం మూడేళ్ల డిగ్రీ కోర్సులు చేస్తున్నవారు కూడా నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులకు మారేందుకు కొత్త కరిక్యులం ఫ్రేమ్ వర్క్ అవకాశం కల్పిస్తుంది. ఇప్పటికే చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) ప్రకారం.. మూడేళ్ల యూజీ కోర్సుల్లో పేర్లు నమోదు చేసుకున్న, అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా నాలుగేళ్ల యూజీ ఆనర్స్ కొనసాగించడానికి అర్హులని కొత్త నిబంధనల్లో పేర్కొన్నారు. వారు ఆనర్స్ కోర్సుల్లోకి మారడానికి వర్సిటీలు వారికి బ్రిడ్జ్ కోర్సులను (ఆన్‌లైన్‌తో సహా) అందించవచ్చని యూజీసీ తెలిపింది. డిగ్రీ కోర్సు నుంచి ఆనర్స్ కోర్సుల్లో చేరడానికి ఇది తప్పనిసరి అని వివరించింది.

రూ.100 కోట్ల దోపిడీ అవాస్తవం

- ఇది ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నమే..
- ఒక్క రూపాయి చెల్లించకపోయినా రూ.వందకోట్ల దోపిడీ జరిగిందని రాస్తారా?
- ఈనాడు కథనాన్ని ఖండించిన ఏపీ ఎంఎస్ఐడీసీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఆస్పత్రులకు మందుల సరఫరాలో రూ.100 కోట్ల దోపిడీ జరిగిందనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఏపీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీ ఎంఎస్ఐడీసీ) ఎండీ డి.మురళీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ఆస్పత్రులకు మందుల కొనుగోళ్లలో గోల్‌మాల్' శీర్షికన ఈనాడు పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనాన్ని ఒక ప్రకటనలో ఆయన ఖండించారు. మందులను మార్కెట్ ధర కంటే 500% పైగా అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణ ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నమే తప్ప మరొకటి కాదన్నారు. రెండేళ్లలో ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్ల ద్వారా గానీ, ఏపీ ఎంఎస్ఐడీసీ ద్వారా గానీ ఇప్పటివరకూ ఎటువంటి చెల్లింపులు చేపట్టలేదన్నారు. ఒక్క రూపాయి కూడా చెల్లించనప్పుడు రూ.100 కోట్ల మేర దోపిడీ జరిగిందని రాయడం సరికాదన్నారు. డీసెంట్రలైజ్డ్ బడ్జెట్ ద్వారా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు 20 శాతం సబ్సిడీకి గాను గతంలో ఔషధాలు కొనుగోలు చేసేవారనీ, ఈ విషయం ప్రభుత్వ దృష్టికి రావటంతోపాటు కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని గ్రహించి సెంట్రలైజ్డ్ టెండర్ విధానాన్ని తీసుకొచ్చామని వివరించారు. టెండర్‌లో పెట్టిన నిబంధన ప్రకారమే మందులను కాంట్రాక్టర్లు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు.

అతి తక్కువ రేట్లకే..

అత్యవసర మందుల సరఫరాలో జాప్యాన్ని అధిగమించడం కోసం రెండేళ్ల కాలపరిమితితో ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో రివర్స్ టెండరింగ్ నిర్వహించి మరీ అతి తక్కువ రేట్లకు మందులు సరఫరా చేసే ఏజెన్సీని గుర్తించామన్నారు. సరఫరాదారుడి అన్ని బిల్లులను డ్రగ్ కంట్రోల్ అథారిటీ పరిశీలన తర్వాత, వారు నిర్ణయించిన రేట్లకు అనుగుణంగా బిల్లుల చెల్లింపులు ఉంటాయన్నారు. నిబంధనల ప్రకారం సరఫరాదారుడు జనరిక్ మందులను, బ్రాండెడ్ మందులను, కేంద్ర ప్రభుత్వ డ్రగ్ ప్రైస్ కంట్రోల్ మందులను ఒకే రాయితీ రేట్లకు సరఫరా చెయ్యాల్సి ఉంటుందన్నారు. ఈ మందులలో 60 శాతానికి పైగా డ్రగ్ ప్రైస్ కంట్రోల్ వారి ఆధీనంలో ఉండేవేనన్నారు. వీటి గరిష్ట రిటైల్ ధరలు కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉంటాయని వివరించారు. మార్కెట్ రేటును పరిగణనలోకి తీసుకునే చెల్లింపులు చేస్తామని తెలిపారు. టెండర్ ఎంపికలో ఎటువంటి మతలబు జరగలేదని, సరఫరాదారుడుకి స్థాయి ఉండాలనే ఉద్దేశంతోనే రూ.10 కోట్లుగా నిర్ణయించామన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.